ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
శ్రీ పొట్టిశ్రీరాములు
నెల్లూరు
జిల్లా వార్తలు
మంగళవారం 11 ఫిబ్రవరి 2025



5,43,743 మంది పిల్లలకు నులిపురుగుల మందు

నెల్లూరు (వైద్యం), ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి) : జాతీయ నులిపురుగుల నివారణ దినం సందర్భంగా జిల్లావ్యాప్తంగా సోమవారం 94.5 శాతం మంది విద్యార్థులకు నులిపురుగుల నివారణ మాత్రలు మింగించినట్లు డీఎం హెచ్‌వో సుజాత ఒక ప్రటనలో తెలిపారు. మొత్తం 5.75 లక్షల మంది విద్యార్థులకు ఈ మాత్రలు మింగించాలని నిర్ణయించగా 5,43,743 మందికి అందజేసినట్లు తెలిపారు. మిగిలిన వారికి మంగళవారం కూడా మాత్రలు పంపిణీ చేయనున్నట్లు పేర్కొన్నారు.



రిజిస్ట్రేషన్ల మందగమనం

లక్ష్యంలో పూర్తయింది 60.38 శాతం

మార్చి నెలాఖరుతో ముగియనున్న గడువు

తలలు పట్టుకుంటున్న ఆశాఖ అధికారులు

నెల్లూరు (హరనాధపురం) ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో స్థిరాస్తి క్రయ, విక్రయాలు మందగించాయి. రిజిస్ట్రేషన్లు చేయించుకునే వారి సంఖ్య బాగా తగ్గడంతో ప్రభుత్వ ఖజానాకు ఆదాయానికి గండి పడింది. గత వైసీపీ సర్కారు నిర్వాకంతో స్థిరాస్తి వ్యాపారం కుదేలవగా, రిజిస్ట్రేషన్ చార్జీలు విపరీతంగా పెరగడంతో కొందరు ఒప్పందాలతోనే సరిపెట్టుకుంటు న్నారు. ఆస్తి బదలాయింపులకు ఒప్పందం చట్టబద్ధత కాకపో యినా రిజిస్ట్రేషన్ చార్జీలు భరించలేక వాయిదా వేసుకుంటున్నారు. ఫలితంగా రిజిస్ట్రేషన్ల సంఖ్య అనుకున్న మేరకు నమోదు కాలేదు. అంతే గాక స్టాంపుల అమ్మకాలను గత ప్రభుత్వం పూర్తిగా ప్రైవేటీకరణ చేయడంతో ప్రభుత్వ ఖజానాకు ఆదాయం తగ్గింది. ఈ పరిస్థితిని గుర్తించిన కూటమి ప్రభుత్వం స్టాంపుల అమ్మకాలను సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లోనే తిరిగి ప్రారంభించడంతో ఇటీవల తనఖా రిజిస్ట్రేషన్ సంఖ్య పెరగడం ప్రారంభమైంది. భూములు, భవనాలు తనఖా పెట్టి కొందరు ప్రైవేటు వ్యక్తుల వద్ద అప్పులు తీసుకుంటున్నారు. ఈ తనఖా రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్ల కారణంగా కొంత ఆదాయం రిజిస్ట్రేషన్ శాఖకు వస్తోంది.

● సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల వారీగా..

జిల్లావ్యాప్తంగా 15 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు ఉన్నాయి. గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ఈసారి లక్ష్యాలు బాగానే నమోదయ్యాయి. 2024 -25 ఆర్థిక సంవత్సరానికి రాబడి లక్ష్యం రూ.712.38 కోట్లు కాగా జనవరి నెలాఖరుకు రూ.383.80 కోట్లు (60.38 శాతం) మాత్రమే వసూలు అయింది. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల వారీగా చూసుకుంటే అత్యధికంగా ముత్తుకూరులో 93.18 శాతం, కోవూరులో 87.25 శాతం, అల్లూరులో 81.30 శాతం, ఆత్మకూరులో 75.01 శాతం లక్ష్యసాధన నమోదైంది. రాపూరులో అత్యల్పంగా 47.97 శాతం లక్ష్యం మాత్రమే పూర్తయింది. పట్టణ ప్రాంతాల్లో ప్లాట్ల ధరలు ఆకాశమే హద్దుగా పెరుగుతుండటంతో స్థిరాస్తుల క్రయవిక్రయాలు తగ్గుతున్నాయని కొందరు విశ్లేషిస్తున్నారు. మార్చి నెలాఖరులోపు లక్ష్యం పూర్తి చేయాల్సి ఉండటంతో అధికారులు ఆలోచనలో పడిపోయారు.

లక్ష్య సాధన ఇలా... (జనవరి ఆఖరు వరకు, రూ.కోట్లలో)

సబ్‌రిజిస్ట్రార్	లక్ష్యం	పూర్తి	శాతం
కందుకూరు	30.66	18.17	59.28
అల్లూరు	7.54	6.13	81.30
ఆత్మకూరు	12.65	9.49	75.01
బుచ్చిరెడ్డిపాలెం	25.76	16.80	65.24
ఇందుకూరుపేట	21.67	13.74	63.39
కావలి	72.80	40.21	55.24
కోవూరు	23.00	20.06	87.25
ముత్తుకూరు	32.04	29.85	93.18
పొదలకూరు	15.29	8.29	54.22
రాపూరు	7.87	3.77	47.97
ఉదయగిరి	8.13	5.99	73.71
వింజమూరు	15.87	9.22	58.11
నెల్లూరు (ఆర్‌ఓ)	227.72	121.67	53.43
స్టోన్‌హౌస్‌పేట	92.22	52.44	56.87
బుజబుజనెల్లూరు	40.72	26.88	66.03
మొత్తం	**634.02**	**382.80**	**60.38**

● పాఠశాలలను మార్పు చేయొద్దని ఆందోళన

విలీనంపై ఆగ్రహం!



కలువాయి : పాఠశాల గేటుకు తాళం వేసి బైఠాయించిన విద్యార్థులు, తల్లిదండ్రులు

కలువాయి, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి) : పాఠశాలల విలీనంపై విద్యార్థుల తల్లిదండ్రుల ఆగ్రహం కట్టలు తెంచుకుంటోంది. తరగతులను బహిష్కరించి, ఉపాధ్యాయులను బయటకు పంపి గేటుకు తాళం వేసి బడి ముందు విద్యార్థులతో కలిసి బైఠాయించారు. సోమవారం కలువాయి, సంగం, అనంతసాగరం తదితర మండలాల్లో ఆందోళనలు జరిగాయి. కలువాయి మండలం పెన్నబద్వేలిలో సచివాలయం, రైతుసేవా కేంద్రాల సిబ్బందిని కూడా బయటకు పంపి మూసేశారు. ఈ గ్రామంలోని ప్రాథమికోన్నత పాఠశాలలో 122 మంది విద్యార్థులు ఉండగా, 1 నుంచి 5 తరగతుల విద్యార్థులు 70 మంది, 6,7,8 తరగతుల విద్యార్థులు 52 మంది ఉన్నారు. ఈ పాఠశాలను మోడల్ ప్రాథమిక పాఠశాలగా మార్చి ఇక్కడున్న 6, 7, 8 తరగతుల విద్యార్థులను 4 కి.మీ దూరంలో ఉన్న కలువాయి జడ్పీ హైస్కూల్‌లో విలీనం చేశారు. అలాగే 2 కి.మీ దూరంలోని పాత బద్వేలి గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలోని 3,4,5 తరగతుల విద్యార్థులను ఇందులో విలీనం చేసేందుకు అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. ఈ ప్రతిపాదనలపై గ్రామస్థులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ పాఠశాలనే హైస్కూల్‌గా మార్చి కొనసాగించాలని డిమాండ్ చేస్తున్నారు. ఉన్నతాధికారుల నుంచి స్పష్టమైన హామీ వచ్చే వరకు ఆందోళన కొనసాగుతుందని హెచ్చరిస్తున్నారు. ఈ సమాచారం అందుకున్న ఎంఈవో-2 శేషగిరిరావు అక్కడకు చేరుకుని ఆందోళనకారులతో మాట్లాడి, సర్దిచెప్పారు.



స్కాం నిర్వాహకుడు షేక్ సుభాన్ ఇల్లు

'షేర్' కా సుభాన్!

- ఆన్‌లైన్ ట్రేడింగ్ పేరుతో మనీస్కాం
- అనంతార్థ అసోసియేట్స్ పేరుతో రూ.కోట్లు దండుకుని జంప్
- సుమారు వేయి మందికిపైగా బాధితులు
- కేసు నమోదు చేసి విచారిస్తున్న పోలీసులు

'మా సంస్థలో పెట్టుబడి పెట్టండి చాలు. ఆన్‌లైన్ ట్రేడింగ్‌లో పెట్టి లాభాలు సృష్టిస్తాం. మీకు రూ.లక్షల్లో ముట్టచెబుతాం.' అంటూ ఓ వ్యక్తి మహిళలు, నిరక్షరాస్యులను నమ్మించాడు. ఇంకేముంది.. ఆయన మాటలు నమ్మిన వారు భారీగా ముట్టజెప్పారు. ఇప్పుడు ఆ సంస్థ నిర్వాహకుడు అదృశ్యం కావడంతో బాధితులు గగ్గోలు పెడుతున్నారు. న్యాయం చేయాలంటూ ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డిని, పోలీసులను ఆశ్రయించారు. బాధితుల కథనం మేరకు..

వివరాలు 6లో..

గుప్పెడంత గుండెకు కొండంత భరోసా!

- స్టెమీ ప్రాజెక్టుతో సాధ్యం చేస్తున్న కూటమి ప్రభుత్వం
- రూ.40 వేల విలువైన టెనెక్టెప్లెస్ ఇంజక్షన్ ఉచితంగా
- అన్ని ప్రభుత్వ ఆసుపత్రులకు సరఫరా

వివరాలు 6లో..

ఇక స్వచ్ఛ కందుకూరు

- 15న పర్యటించనున్న సీఎం చంద్రబాబు
- స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ నుంచి సంపూర్ణ సహకారం
- డంపింగ్ యార్డును తరలించి పార్కు ఏర్పాటు
- స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ చైర్మన్ పట్టాభిరామ్



దూబగుంట వద్ద ఏర్పాటు చేయనున్న వేస్ట్ ప్రాసెసింగ్ యూనిట్‌ను పరిశీలిస్తున్న పట్టాభిరాం, ఎమ్మెల్యే ఇంటూరి, మాజీఎమ్మెల్యే దివి శివరాం తదితరులు

కందుకూరు, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి) : కందుకూరు పట్టణాన్ని సుందర పట్టణంగా తీర్చిదిద్దేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటామని, జనావాసాలకు సమీపంలోఉన్న డంపింగ్‌యార్డులోని చెత్తను వందరోజుల్లో ఖాళీచేసి సుందర పార్కుగా అభివృద్ధి చేస్తామని స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ చైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభిరామ్ తెలిపారు. స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా ఈ నెల 15న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కందుకూరులో పర్యటించనున్న నేపథ్యంలో పట్టాభిరామ్ సోమవారం కందుకూరు విచ్చేశారు. ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు, మాజీ ఎమ్మెల్యే దివి శివరాం, వివిధ శాఖల అధికారులతో కలిసి గుర్రంవారిపా లెం సమీపంలో ఉన్న డంపింగ్‌యార్డును, దూబగుంట సమీపంలో ఏర్పాటు చేసిన వేస్ట్ ప్రాసెసింగ్ యూనిట్‌ను పట్టాభి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 15న సీఎం చంద్రబాబు స్వచ్ఛ కందుకూరు కార్యక్రమానికి శ్రీకారం చుట్టబోతున్నారని తెలిపారు. ఆ రోజు రాష్ట్రంలో ఉన్న ప్రజా ప్రతినిధులు, అధికారు లంతా స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో పాల్గొంటారని తెలిపారు. కందుకూరులో 26వేల టన్నుల చెత్త ఉన్న డంపింగ్‌యార్డును జనావాస ప్రాంతంలో ఏర్పాటు చేయటం బాధాకరమన్నారు. కేవలం వంద రోజు ల్లోనే ఈ యార్డులో ఉన్న చెత్తను రీసై క్లింగ్‌చేసి ఖాళీ చేయిస్తామని ఈ ప్రాం తాన్ని పబ్లిక్ పార్కుగా అభివృద్ధి చేస్తా మని ఇందుకోసం స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ నుంచి సంపూర్ణ సహకారం అందిస్తా మని పేర్కొన్నారు. మార్చి 1 నుంచి కందుకూరులో ప్రతిరోజు వచ్చే 25 టన్నుల చెత్తను తడిచెత్త, పొడిచెత్తగా వేరుచేసి దూబగుం టలో ఏర్పాటుచేసిన వేస్ట్ ప్రాసెసింగ్ యూనిట్‌కు తరలిస్తామని తెలిపారు. ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వర రావు మాట్లాడుతూ డంపింగ్‌యార్డును ఇక్కడ నుంచి తరలించి సుదూరప్రాంతంలో ఏర్పాటు చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సబ్ కలెక్టరు తిరుమణి శ్రీపూజ, మున్సిపల్ కమిషనర్ కె. అనూష, టీడీపీ పట్టణ అధ్యక్షుడు దామా మల్లేశ్వర రావు, ఇతర ముఖ్యనేతలు పాల్గొన్నారు.

● తొలిరోజు 7,160 మంది హాజరు

ప్రాక్టికల్స్ ప్రారంభం

నెల్లూరు(విద్య), ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి) : ఇంటర్ ద్వితీయ సంవత్సరం సైన్స్ విద్యార్థులకు ప్రయోగ పరీక్షలు (ప్రాక్టికల్) సోమవారం ప్రారంభమయ్యాయి. తొలివిడతలో జిల్లావ్యాప్తంగా 88 కేంద్రాల్లో జరిగిన ప్రాక్టికల్స్‌కు 7,160 మంది హాజరయ్యారు. ఉదయం జరిగిన ప్రాక్టికల్స్‌కు 4,267 మందికిగాను 4,136 మంది హాజరవగా 131 మంది గైర్హాజరయ్యారు. అలాగే మధ్యాహ్నం 3,121 మందికి 3,024 మంది హాజరవగా, 97 మంది గైర్హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆర్ఐఓ ఎ.శ్రీనివాసులు ఆరు పరీక్ష కేంద్రాలను తనిఖీ చేసి ప్రాక్టికల్స్ జరుగుతున్న తీరును పరిశీలించారు. జిల్లావ్యాప్తంగా ఎక్కడా ఎలాంటి ఇబ్బందులు లేకుండా తొలిరోజు పరీక్షలు పూర్తయ్యాయని, ఇదే రీతిలో అన్ని పరీక్షలను కట్టుదిట్టంగా ప్రశాంతమైన వాతావరణంలో నిర్వహిస్తామని తెలిపారు. ఆర్ఐఓతోపాటు డీఈసీ సభ్యులు, ఫ్లయింగ్‌స్క్వాడ్ కలిపి మొత్తం 9 పరీక్ష కేంద్రాలను పరిశీలించారు.




ప్రాక్టికల్స్‌కు హాజరైన విద్యార్థిని ప్రశ్నిస్తున్న ఆర్ఐవో శ్రీనివాసులు

గీతకులాలకు మద్యం దుకాణాల కేటాయింపు 6లో..

కందుకూరులో ఐవోసీ మంట

- ప్రభుత్వ కార్యాలయాల సముదాయంలో పెట్రోలు బంకు
- వ్యతిరేకత వస్తున్నా అధికారులు ముందుకే!
- రెవెన్యూ మంత్రిని కలిసిన ముఖ్యులు

కందుకూరు మండల కార్యాలయాల సముదాయంలో పెట్రోలుబంకు ఏర్పాటుకు తీసుకున్న నిర్ణయంపై సర్వత్రా విస్మయం వ్యక్తమవుతోంది. ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ (ఐఓసీ) ఆధ్వర్యంలో ఏర్పాటయ్యే పెట్రోలు బంకు కోసం కేవలం నెలకు రూ.15వేల అద్దెకు 99 సంవత్సరాలపాటు స్థలాన్ని లీజుకు ఇచ్చేలా ఉత్తర్వులు జారీ అయ్యాయి. దీనిపై అన్నివర్గాల నుంచి వ్యతిరేకత వస్తున్నా గత ప్రభుత్వ హయాంలో ఈ నిర్ణయం జరిగినందున తామేమీ చేయలేమని అధికారులు తప్పించుకునే యత్నం వెనుక పరమార్థం ఏమిటని పలువురు ప్రశ్నిస్తున్నారు. ప్రజల నుంచి వ్యతిరేకత వస్తే పునఃసమీక్ష చేయరా అని ప్రశ్నిస్తున్నారు.



పెట్రోలు బంకు ఏర్పాటుకు ఐవోసీకి ఇచ్చిన స్థలం ఇదే!

వివరాలు 6లో..

రైతులకూ గుర్తింపు సంఖ్య

- అది ఉంటేనే సంక్షేమ పథకాలు, ఇతర సేవలు
- ఫార్మర్ రిజిస్టర్ పేరుతో ఆధార్ తరహా నమోదు
- ఆర్ఎస్‌కేల ద్వారా ప్రక్రియ ప్రారంభం
- లక్ష్యం 1,71,547 మంది అన్నదాతలు

అన్నదాతలకు ఆధార్ తరహా గుర్తింపు కార్డు రాబోతోంది. ప్రతి రైతుకు ఓ విశిష్ట సంఖ్య (యూనిక్ కోడ్) ఇవ్వాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్ణయించాయి. భూమి ఉన్న ప్రతి రైతుకు ఫార్మర్ రిజిస్టర్ పేరుతో నిర్దిష్ట గుర్తింపు సంఖ్య(11 అంకెలు) ఇవ్వడం ద్వారా ప్రభుత్వ పథకాలు, ఇతర సేవల ద్వారా నేరుగా లబ్ధి చేకూరనుంది. జిల్లాలోని రైతు సేవా కేంద్రాల (ఆర్ఎస్‌కేలు) ద్వారా ఈసంఖ్య జారీ చేసేందుకు వ్యవసాయశాఖ అధికారులు అన్ని చర్యలు తీసుకుంటున్నారు. జిల్లాలో 1,71,547 మంది రైతుల నమోదే లక్ష్యంగా వారు ముందుకు సాగుతున్నారు.



నెల్లూరు (వ్యవసాయం)/ఉదయగిరి, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): రైతుల ఆధార్, దానికి అనుసంధానం చేసిన ఫోన్ నెంబరు, పట్టాదారు పాసుపుస్తకం తీసుకుని ఆర్ఎస్‌కేకి వెళ్లాలి. అక్కడ వీఏఏలు ఆన్‌లైన్‌లో వారి వివరాలు నమోదు చేస్తారు. అనంతరం రైతు ఫోన్‌కు ఓటీపీ వస్తుంది. దాన్ని వీఏఏలకు చెబితే 11 అంకెల ప్రత్యేక గుర్తింపు సంఖ్య వస్తుంది. ఆయా గ్రామాల్లో లేనివారు కూడా ఫోన్ ద్వారా కూడా నమోదు చేసుకునే అవకాశం ఉంది. ఆధార్, ఆన్‌లైన్ అడంగల్‌లో పేరు 80శాతం సరిగా ఉంటేనే విశిష్ట గుర్తింపు సంఖ్య వస్తుంది. అయితే ఆధార్‌లో రైతు పేరు, ఆన్‌లైన్ అడంగల్‌లో 60 నుంచి 80శాతం వరకు సరిగా ఉంటే దాన్ని పరిశీలించేందుకు వీఆర్వో లాగిన్‌కు వెళుతుంది. 60శాతానికంటే తక్కువగా ఉంటే ఆ వివరాలు తహసీల్దారు లాగిన్‌కు వెళుతుంది. వారు పరిశీలించి సరిగ్గా ఉందని భావిస్తే రైతుకు విశిష్ట గుర్తింపు సంఖ్య వస్తుంది.

● విశిష్ట సంఖ్యతో ఉపయోగాలు

ప్రభుత్వ పథకాలు, సబ్సిడీలు, ఇతర వ్యవసాయ సంబంధిత సేవలు పొందేందుకు ఈ విశిష్ట సంఖ్య ఉపయోగపడుతుంది. ప్రధాన్ మంత్రి కిసాన్ యోజన, అన్నదాత సుఖీభవ, పంటల బీమా, పంట రుణాలపై వడ్డీ రాయితీ, రాయితీపై వ్యవసాయ యంత్ర పరికరాలు, రాయితీపై సూక్ష్మ పోషకాలు, సూక్ష్మసేద్యంపై రాయితీ, పంట రుణాలు, పెట్టుబడి సాయం.. పథకాల వల్ల నేరుగా పొందే వీలు ంటుంది. అలాగే సత్వర పంట నష్ట పరిహారం పొందేందుకు వీలవుతుంది. నీటిపారుదల, తెగుళ్ల నియంత్రణ, వాతావరణ సూచనలు వంటి ఇతర సేవలు పొందేందుకు కూడా ఉపయోగపడుతుంది.

రైతులు సహకరించాలి

భూమి ఉన్న ప్రతి రైతుకు ప్రస్తుతం విశిష్ట సంఖ్య ఇస్తున్నాం. ఆ తరువాత కౌలు రైతులకు, భూమిలేని వ్యవసాయ కూలీలకు, వ్యవసాయ ఆధారిత వృత్తుల్లో ఉన్న వారికీ కూడా ఇవ్వనున్నారు. ఈ విషయపై ఇప్పటికే మండల వ్యవసాయాధికారులు, వీఏఏలు, వీహెచ్‌ఏలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాం. జిల్లాలో 1,71,547 మంది రైతుల నమోదే లక్ష్యంగా పనిచేస్తున్నాం. మండలాల వారీగా లక్ష్యాలను నిర్దేశించాం. నమోదుపై రైతులకు అవగాహన కల్పిస్తున్నాం. రైతులు కూడా ముందుకొచ్చి విశిష్ట సంఖ్య నమోదుకు అధికారులకు సహకరించాలి.



- పీ.సత్యవాణి, జిల్లా వ్యవసాయాధికారి

మహిళల హాకీ ఛాంపియన్ కడప

నెల్లూరు(విద్య), ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): జిల్లా హాకీ అసోసియేషన్ ఆధ్వర్యంలో నెల్లూరులోని ఏసీ సుబ్బారెడ్డి స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో జరిగిన 15వ ఏపీ సీనియర్ మహిళా హాకీ ఛాంపియన్‌షిప్ పోటీల్లో కడప జిల్లా జట్టు విజేతగా నిలిచింది. సోమవారం జరిగిన ఫైనల్స్‌లో అనంతపురం, కడప జట్లు తలపడగా 2-0 గోల్స్ తేడాతో కడప టీం గెలుపొందింది. అనంతపురం ద్వితీయ స్థానంలో నిలిచింది. మూడు, నాలుగు స్థానాల కోసం జరిగిన మ్యాచ్‌లో కాకినాడ, అనకాపల్లి జట్లు తలపడగా కాకినాడ 7-1 గోల్స్‌తో విజయం సాధించింది. విజేతలకు హాకీ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు చాణిక్య రాజు, కార్యదర్శి హర్షవర్ధన్, కోశాధికారి థామస్‌పీటర్ విజేతలకు బహుమతులు అందచేశారు. ప్రథమ స్థానంలో నిలిచిన కడప జట్టుకు ట్రోఫీతోపాటు రూ.7 వేలు, ద్వితీయస్థానంలో నిలిచిన అనంతపురం జట్టుకు ట్రోఫీ, రూ.5వేలు, తృతీయస్థానంలో నిలిచిన కాకినాడ జట్టుకు ట్రోఫీ రూ.3వేలు నగదు అందచేశారు. అలాగే ఉత్తమ గోల్‌కీపర్‌గా నిలిచిన ప్రకాశం జిల్లా క్రీడాకారిణి నందినికి, ఉత్తమ క్రీడాకారిణిగా నిలిచిన కాకినాడ క్రీడాకారిణి వరాలమ్మకు, అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన అనంతపురం జిల్లా క్రీడాకారిణి లక్ష్మీలకు నగదు బహుమతులు అందచేశారు. కార్యక్రమంలో డాక్టర్ మల్లికార్జున, డాక్టర్ జోనాథాన్, సీనియర్ క్రీడాకారులు నవీన్, పోటీల నిర్వాహక కార్యదర్శి థామస్‌పీటర్, జిల్లా అసోసియేషన్ కార్యదర్శి జగన్మోహన్, వ్యాయామ ఉపాధ్యాయులు జీడీ.సురేష్, సీనియర్ క్రీడాకారులు పాల్గొన్నారు.



చేసిన పనులకు బిల్లులివ్వండి!

● సచివాలయంలో ఒకరి హల్‌చల్

తోటపల్లిగూడూరు, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి) : తాను చేసిన పనులకు బిల్లులు ఇవ్వాలంటూ ఓ వ్యక్తి మాచర్ల వారిపాలెం సచివాలయంలో హల్‌చల్ చేసిన ఘటన సోమవారం వెలుగులోకి వచ్చింది. శనివారం జరిగిన ఈ ఘటనకు సంబంధించిన వీడియోలు సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారాయి. చేసిన ప్రతి పనికి ముడుపులు ఇవ్వాలంటే ఎలాగని సిబ్బందిని నిలదీశారు. దీంతో కార్యదర్శి పాత పనులకు బిల్లులు చేయనని తెగేసి చెప్పారు. ఇరువురి మధ్య వాగ్వాదం జరగ్గా సిబ్బంది సర్ది చెప్పారు. దీనిపై ఎంపీడీవో వెంకటేశ్వర్లును వివరణ కోరగా విషయం తన దృష్టికి రాలేదని తెలిపారు.



వెల్‌డన్ వెటరన్స్!
జాతీయ అథ్లెటిక్స్‌లో పతకాలు

నెల్లూరు(విద్య), ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): రాజస్థాన్‌లో ఇటీవల జరిగిన 44వ జాతీయ వెటరన్ మాస్టర్ అథ్లెటిక్స్ పోటీల్లో జిల్లా క్రీడాకారులు పతకాలు సాధించారు. జిల్లా నుంచి 32 మంది పోటీలకు హాజరై, వివిధ విభాగాల్లో సత్తా చాటి 36 బంగారు, 16 వెండి, 15 కాంస్య పతకాలను దక్కించుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా మాస్టర్స్ వెటరన్ అథ్లెటిక్ అసోసియేషన్ అధ్యక్షుడు ఈ భాస్కర్‌రెడ్డి, కార్యదర్శి డీ బసవయ్య, మహిళా అధ్యక్షురాలు వీ కోటేశ్వరమ్మ సోమవారం ఓ ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు.

గుప్పెడంత గుండెకు కొండంత భరోసా!

- స్టెమీ ప్రాజెక్టుతో సాధ్యం చేస్తున్న కూటమి ప్రభుత్వం
- రూ.40 వేల విలువైన టెనెక్టెప్లెస్ ఇంజక్షన్ ఉచితంగా
- అన్ని ప్రభుత్వ ఆసుపత్రులకు సరఫరా

● విడవలూరుకు చెందిన సుబ్బరాజు (45) గుండెనొప్పితో స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వెళ్లారు. అక్కడ ఈసీజీ తీసిన వైద్యులు సుబ్బరాజుకు గుండె సమస్య ఉందని వెంటనే ప్రభుత్వ జనరల్ ఆసుపత్రికి పంపించారు. ఇక్కడ పరీక్షించి న వైద్యులు నారాయణ ఆసుపత్రిలోని గుండె వ్యాధి నిపుణుడికి బాధితుడి వివ రాలు పంపించారు. రోగికి గుండెకు వెళ్లే నరాలలో లోపం ఉందని, టెనెక్టెప్లెస్ ఇంజక్షన్ ఇవ్వాలంటూ సిఫారసు చేశారు. వెంటనే జీజీహెచ్ వైద్యులు అందుబాటు లో ఉన్న ఈ ఇంజక్షన్ వేయటంతో తాత్కాలికంగా రోగి కోలుకున్నారు. ఆ రోగిని నారాయణ ఆసుపత్రికి తరలించటంతో శస్త్రచికిత్స చేశారు.


● దుత్తలూరు మండలం నర్రవాడకు చెందిన వెంగయ్య తీవ్ర గుండె నొప్పితో ఉదయగిరి సామాజిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. అక్కడ వైద్యులు పరీక్షించి ఇతనికి వెంటనే అందుబాటులో ఉన్న టెన్‌క్టెప్లెస్ ఇంజక్షన్ వేయటంతో బాధితుడు కోలుకున్నారు. వైద్యుల సూచనల మేరకు బాధితుడిని మెడికవర్ ఆసుపత్రికి తరలించటంతో అక్కడ గుండెకు వెళ్లే నరాలకు స్టంట్ వేయటంతో కోలుకున్నాడు. ఎన్టీఆర్ వైద్యసేవ ద్వారా ఈ చికిత్సలు అందించారు.

నెల్లూరు (వైద్యం) ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి) : ప్రస్తుత సమాజంలో గుండె వ్యాధులు ఆందోళన కలిగిస్తున్నాయి. అన్ని వ్యాధుల కంటే గుండె సంబంధిత వ్యాధులతోనే ఎక్కువగా మరణాలు జరుగుతున్నట్లు వైద్య నిపుణులు చెబుతున్నారు. ఒకప్పుడు 50 ఏళ్ల పైబడిన వారిలోనే వచ్చే గుండెజబ్బులు ఇప్పుడు చిన్నారులనూ కలవరపెడుతున్నాయి. ప్రస్తుత ఆహారపు అలవాట్ల వల్ల గుండె వెళ్లే కవాటాలు పూడి పోతున్నాయి. దీంతో గుండెపోటు సంభవిస్తోంది. వెంటనే రెండు గంటల్లోపు బాధితులకు తాత్కాలిక ఉపశమనం కింది ఖరీదైన ఇంజక్షన్ ఇవ్వాల్సి ఉంటుంది. ఇది వేసిన వెంటనే వ్యాధిగ్రస్తుడు కోలుకుంటాడు. దీన్ని గుర్తించిన కూటమి ప్రభుత్వం రూ.40 వేల నుంచి 50వేలు ఖరీదు చేసే టెనెక్టెప్లెస్ అనే సూదిమందును అందుబాటులోకి తెచ్చింది. గత ఏడాది నవంబరు 23వ తేదీన స్టెమీ (ఎస్టీ ఎలివేషన్ మయోకార్డియల్ ఇన్‌ఫార్క్షన్) పేరుతో ప్రభుత్వం ఈ కార్యక్రమం చేపడుతోంది. రెండున్నర నెలల పరిధిలో 200 మంది బాధితులకు గోల్డెన్ అవర్ పేరిట అందుబాటులోకి తెచ్చిన ఈ ఇంజక్షన్ ఇచ్చి ప్రాణా లు కాపాడారు. ఇటీవల పక్షవాత బాధితులకు కూడా ఈ సూది మందు వాడుతున్నారు.



● 14 ఆసుపత్రుల్లో అందుబాటులోకి

నెల్లూరులోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి (జీజీహెచ్)తో పాటు ఆత్మకూరులోని జిల్లా ఆసుపత్రి, కందుకూరు, కావలి ఏరియా ఆసుపత్రులు, ఉదయగిరి, అల్లూరు, పొదలకూరు, వెంకటాచలం, బుచ్చి, వింజమూరు, ఇందుకూరుపేట, కోవూరు, రాపూరు సామాజిక ఆరోగ్య కేంద్రాల్లోనూ ఈ టెన్‌క్టెప్లెస్ ఇంజక్షన్లు అందుబాటులో ఉన్నా యి. వాటిని ప్రజలు ఉపయోగించుకునేలా వైద్యులు చర్యలు తీసుకుంటున్నారు. ఇప్పటి వరకు 450 ఇంజక్షన్లు ఆయా ఆరోగ్య కేంద్రాలకు పంపించారు. అయితే ప్రభుత్వపరంగా గుండె వైద్య నిపుణులు లేకపోవటంతో ఎన్టీఆర్ వైద్యసేవ పథకం నిర్వహించే నారాయణ, మెడికవర్ ఆసుపత్రుల్లోని వైద్యులకు టెలిమెడిసిన్ ద్వారా సమాచారం ఇచ్చి వారి సూచనలతో బాధితులకు ఇంజక్షన్ ఇచ్చి ప్రాణాలు కాపాడుతున్నారు.



గుండెతోపాటు పక్షవాతం బాధితులకూ అండగా..

ఛాతీ నొప్పితో వస్తే...

కొందరు ఛాతీ నొప్పితో ఆసుపత్రికి వస్తుంటారు. చెమటలు పట్టడం, వాంతులు అవడం వంటి లక్షణాలు గుండె నొప్పికి కారణాలుగా వైద్యులు చెబుతున్నారు. ఈ లక్షణాలతో ఆసుపత్రులకు వచ్చే రోగికి ఆక్సిజన్ పెట్టి ఈసీజీ తీస్తారు. దీన్ని ప్రత్యేక యాప్‌ద్వారా ఎన్టీఆర్ వైద్యసేవ ఆసుపత్రులకు పంపిస్తారు. అక్కడున్న గుండె వైద్యులు ఆ రిపోర్టులను పరిశీలించి వెంట నే టెన్‌క్టెప్లెస్ ఇంజక్షన్‌కు సిఫారసు చేస్తారు. లేదంటే ఈసీజీ రిపోర్టులకు తగ్గట్టుగా మందులు, ఇతర ఇంజక్షన్లు వేయా లని సూచిస్తారు. ఇలా అనుమానంతో ఇప్పటివరకు 2వేల మందికిపైగా నమోదవగా వీరిలో 200 మందికే ఈ ఖరీదైన టెన్‌క్టెప్లెస్ ఇంజక్షన్ వేశారు.

ఎంతో ఉపయోగం

గుండె వ్యాధిగ్రస్తులకు స్టెమీ ప్రాజెక్టు ద్వారా ప్రభుత్వం ఖరీదైన టెన్‌క్టెప్లెస్ ఇంజక్షన్‌ను అందుబాటులోకి తెచ్చింది. ఆత్మకూరు జిల్లా ఆసుపత్రితోపాటు రెండు ఏరియా ఆసుపత్రులు, 10 సామాజిక ఆరోగ్య కేంద్రాలలోనూ ఈ ఇంజక్షన్లు అందుబాటులో ఉన్నాయి. గాస్ట్రిక్ ట్రబుల్ అనుకొని గుండె నొప్పికి సంబంధించి ఎలాంటి నిర్లక్ష్యం చేయవద్దు. వెంటనే సమీప ఆసుపత్రికి వెళ్లి పరీక్ష చేయించుకోవాలి. తద్వారా అత్యవసరస్థితిలో వైద్య నిపుణుల సూచనల మేరకు ఈ ఇంజక్షన్ బాధితులకు వేస్తారు.



- డాక్టర్ రమేస్‌నాథ్, డీసీహెచ్ఎస్

ప్రాణాలు కాపాడుతున్నాం



గత ఏడాది నవంబరు 23వ తేదీన ఖరీదైన ఇంజక్షన్‌ను అందుబాటులోకి తీసుకువచ్చారు. ప్రభుత్వ జనరల్ ఆసుపత్రికి వచ్చే రోగులను క్షణ్ణంగా పరీక్షించి వైద్య నిపుణుల సూచనల మేరకు ఈ ఇంజక్షన్ వేస్తున్నాము. పక్షవాతం బాధితులకు కూడా ఇది ఎంతో ఉపయోగ పడుతుంది. దీనిపై పూర్తిస్థాయిలో ప్రచారం నిర్వహిస్తే మరింత మందికి ఉపయోగపడుతుంది.

- డాక్టర్ సిద్ధానాయక్, జీజీహెచ్ సూపరింటెండెంట్

తల్లీబిడ్డకు ప్రాణం పోశారు

నెల్లూరు (వైద్యం) ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): నెల్లూరు జీజీహెచ్ వైద్యులు ప్రాణాపాయంలో ఉన్న తల్లీబిడ్డను కాపాడారు. వివరాల్లోకి వెళితే.. కావలి డివిజన్‌లోని మోచర్ల గ్రామానికి చెందిన గర్భిణి పారాబత్తిన రజని (25) డెంగ్యూ, వైరల్ జ్వరంతో ప్లేట్‌లెట్స్ పడిపోయి కావలి ఏరియా ఆసుపత్రికి వెళ్లారు. పరీక్షించిన వైద్యులు పరిస్థితి ఆందోళనకరంగా ఉండటంతో నెల్లూరులోని జీజీహెచ్‌కు వెళ్లాలని సిఫార్సు చేశారు. వెంటనే జీజీహెచ్‌కురాగా డాక్టర్ గీతాలక్ష్మి పర్యవేక్షణలో ప్లేట్‌లెట్స్ ఎక్కించారు. అయితే ఆమెకు అత్యవసర సిజేరియన్ చేయాల్సి రావటంతో ఆపరేషన్ చేసి తల్లీబిడ్డను కాపాడారు. విషయం తెలుసుకున్న జీజీహెచ్ అభివృద్ధి కమిటీ కో-ఆర్డినేటర్ శ్రీనివాసులు, డైరెక్టర్లు మొగరాల సురేష్, బ్రహ్మారెడ్డి డాక్టర్ గీతాలక్ష్మిని సత్కరించారు. ఆసుపత్రి అడ్మినిస్ట్రేటర్ డాక్టర్ సునీల్‌ను కూడా వారు సత్కరించారు. ఈ కార్యక్రమంలో జీజీహెచ్ అడ్మినిస్టేటర్ డాక్టర్ కళారాణి తదితరులు పాల్గొన్నారు.



వైద్యులను సత్కరిస్తున్న ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు,

పీజీ, ఎల్ఎల్‌బీ పరీక్షలకు 271 మంది గైర్హాజరు

వెంకటాచలం, ఫిబ్రవరి 10 (ఆంధ్ర జ్యోతి) : విక్రమ సింహపురి విశ్వవిద్యాలయం అనుబంధ కళాశాలల్లో సోమవారం జరిగిన పీజీ మొదటి, ఎల్ఎల్‌బీ మూడవ సెమిస్టర్ పరీక్షలకు 271 మంది విద్యార్థు లు గైర్హాజరైనట్లు వర్సిటీ పరీక్షల నిర్వాహణాధి కారి డాక్టర్ ఆర్ మధుమతి ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం జరిగిన పరీ క్షలకు 1,976 మంది విద్యార్థులకుగాను 1,797 మంది హాజరుకాగా 179 మంది గైర్హాజరయ్యాని, మధ్యాహ్నం పరీక్షలకు 1,477 మందికి 1,385 మంది హాజరుకా గా 92 మంది గైర్హాజరయ్యారని తెలి పారు.

● డిగ్రీ ఒకటవ, నాలుగవ సెమిస్టర్ మెగా సప్లిమెంటరీ పరీక్షలకు ఒకరు గైర్హాజరైనట్లు ఆమె తెలిపారు. ఉదయం, మధ్యాహ్నం జరిగిన పరీక్షలకు 22 మంది విద్యార్థులకు 21 మంది హాజరయ్యారు.

టెన్త్ పరీక్షలకు పటిష్ట ఏర్పాట్లు చేయండి

డీఆర్వో విజయభాస్కర్



సమావేశంలో డీఆర్వో, అధికారులు

నెల్లూరు(విద్య), ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో వచ్చేనెలలో ప్రారంభం కానున్న టెన్త్ పరీక్షలకు పటిష్ట ఏర్పాటు చేయాలని డీఆర్వో జే.విజయభాస్కర్‌రావు తెలిపారు. డీఆర్వో చాంబర్‌లో సోమవారం టెన్త్ వార్షిక పరీక్షలపై సంబంధిత అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మార్చి 17 నుంచి 31 వరకు జరిగే టెన్త్ పరీక్షలకు జిల్లాలో మొత్తం 33,434 మంది విద్యార్థులు హాజరవుతున్నారన్నారు. పరీక్షల నిర్వహణ కోసం ఏర్పాటు చేస్తున్న 174 కేంద్రాలతో పాటు 16 సమస్యాత్మక కేంద్రాలపై కూడా ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. పరీక్ష కేంద్రాల వద్ద పోలీసు బందోబస్తు, ఫ్లయింగ్ స్క్వాడ్స్‌ను ఏర్పాటు చేయాలన్నారు. పరీక్షల సమయంలో సమీపంలోని జిరాక్స్ షాపులు మూసివేయడంతోపాటు విద్యుత్ సరఫరాకు అంతరాయం లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఎక్కడా కూడా విద్యార్థులు ఇబ్బందులు పడకూడదని, పరీక్షలు సజావుగా జరిగేలా అధికారులంతా సమన్వయంతో పనిచేయాలని తెలిపారు. ఈ సమీక్షలో డీఈవో డాక్టర్ ఆర్ బాలాజీరావు, అధికారులు పాల్గొన్నారు.



లక్కీడిప్ తీస్తున్న జాయింట్ కలెక్టర్ కార్తీక్

గీతకులాలకు మద్యం దుకాణాల కేటాయింపు

● నేడు ప్రొవిజినల్ లైసెన్స్‌ల జారీ ● ప్రశాంతంగా లక్కీ డిప్

● 18 షాపులు కేటాయించిన జేసీ కార్తీక్

నెల్లూరు(క్రైం), ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): గీతకులాలకు మద్యం దుకాణాల కేటాయింపు సోమవారం ప్రశాంతంగా ముగిసింది. నగరంలోని జడ్పీ సమావేశ మందిరంలో జేసీ కార్తీక్ ఆధ్వర్యంలో లక్కీడిప్ ద్వారా వ్యాపారులకు దుకాణాలు కేటాయించారు. జిల్లాలోని 18 షాపులకు వ్యాపారులు 213 దరఖాస్తులు వేశారు. జేసీ సమక్షంలో ఎక్సైజ్ అధికారులు ఒక్కో షాపునకు అందిన దరఖాస్తుల ప్రకారం లక్కీడిప్ నిర్వహించారు. నగరంలోని ఒక షాపునకు అధికంగా 30 దరఖాస్తులు అందాయి. వ్యాపారులకు దరఖాస్తు చేసుకున్న సమయంలో ఇచ్చిన టోకెన్ నెంబర్ల ఆధారంగా లక్కీడిప్ నిర్వహించారు. ఇలా 18 షాపులను కేటాయించారు. మంగళవారం వ్యాపారులకు ఎక్సైజ్ అధికారులు ప్రొవిజినల్ లైసెన్సులను అందించను న్నారు. ఈ కార్యక్రమంలో ఎక్సైజ్ డీసీ శ్రీనివాసరావు, ఈఎస్ శ్రీనివాసులనాయుడు, పలువురు ఇన్‌స్పెక్టర్లు, ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

'షేర్' కా సుభాన్!

ఆన్‌లైన్ ట్రేడింగ్ పేరుతో మనీ స్కాం

కావలి రూరల్, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి) : గుంటూరు జిల్లాకు చెందిన దివ్యాంగుడు షేక్ మహబూబ్ సుభాన్ కొన్నేళ్ల నుంచి కావలిలోని ముసునూరు మర్రిచెట్టు గిరిజన కాలనీలో కుటుంబంతో నివాసం ఉంటున్నాడు. షేర్ మార్కెట్‌పై తనకున్న అనుభవంతో ట్రైనింగ్ సెంటర్ పేరుతో సుమారు 50మంది నిరుద్యోగులకు ఎర వేశాడు. షిఫ్టుల ప్రకారం 3 నెలలు క్లాసులు చెప్పి ఒక్కొక్కరి నుంచి రూ.15వేలు వసూలు చేశాడు. శిక్షణ అనంతరం వారితోనే కొంత పెట్టుబడి పెట్టిస్తూ వ్యాపారాన్ని విస్తరింపజేశాడు.

● ఉద్యోగులను సన్నిహితులుగా...

కొందరు పోలీస్, రెవెన్యూ, హౌసింగ్ ఇలా ప్రభుత్వ ఉద్యోగులను సన్నిహితులుగా చేసుకుని 2024, ఆగస్టు 15న అనంతార్థ అసోసియేట్స్ పేరిట ఓ భవనం నిర్మించి కార్యాలయం ప్రారంభించాడు. 17 మంది సభ్యులనూ ఏర్పరుచుకున్నాడు. వీరిలో ఉద్యోగులు, పోలీసుల భార్యలు సభ్యులుగా ఉన్నారు. స్కాం నిర్వాహకుడికి పోలీసులు సన్నిహితంగా ఉంటూ తరచూ కార్యాయానికి వచ్చి పెట్టుబడులు పెడుతూ పెద్దన్న పాత్ర పోషించారు. రూ.లక్ష పెట్టుబడి పెడితే 15రోజులకు రూ.10వేలు చొప్పున 6 నెలలకు రూ.2.5 లక్షలు వస్తాయని స్థానికులకు ఆశ చూపారు. దీంతోపాటు రూ.లక్ష పెట్టుబడికి నెలకు రూ.6వేల నుంచి 10వేల వడ్డీ ఇస్తుండటంతో ఇళ్లలో పాచిపని చేసే వారి నుంచి దినసరి కూలీలు, నిరుద్యోగులు అప్పులు తెచ్చిమరీ పెట్టుబడి పెట్టారు. సుమారు వెయ్యి మందికిపైగా రూ.70 కోట్ల నుంచి 80కోట్ల వరకు పెట్టుబడులు పెట్టినట్లు సమాచారం.



సుభాని కార్యాలయం

● సుభాన్‌పై కేసు నమోదు

గత 4రోజులుగా సుభాన్ ఇంటికి, కార్యాయానికి తాళాలు వేసి అదృశ్యమయ్యాడు. ఫోను చేసిన గ్రూపు సభ్యులకు పర్సనల్ పని ఉందని 10వ తేదీ కార్యాలయం తీస్తానని నమ్మబలికాడు. ఆ తర్వాత ఫోన్‌కు అందుబాటులోకి రాకపోవటంతో కుటుంబ సభ్యులతో పరారైనట్లు గ్రహించారు. విషయం తెలుసుకున్న బాధితులు లబోదిబోమంటూ స్థానిక ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డిని ఆశ్రయించి న్యాయం చేయాలని కోరారు. అలాగే, బాధితుల నుంచి ఫిర్యాదులు వెల్లువెత్తడంతో సుభాన్‌పై కేసు నమోదు చేసిన పోలీసులు డీఎస్పీ శ్రీధర్ ఆధ్వర్యంలో విచారణ ప్రారంభించారు.

విద్యుత్ విజిలెన్స్ అధికారుల ఆకస్మిక తనిఖీ

● 227మందికి రూ.8.24 లక్షల జరిమానా

కందుకూరు, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): స్థానిక మున్సిపాలిటీ పరిధిలో సోమవారం విద్యుత్‌శాఖ విజిలె న్స్ అధికారులు సోమవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహిం చారు. విజిలెన్స్ ఈఈ హైమావతి, కందుకూరు డివిజన్ ఆపరేషన్స్ ఈఈ మల్లెల నాగేశ్వరరావు ఆధ్వర్యంలో కందుకూరు రూరల్ సెక్షన్ పరిధిలోని అధికారులు, సిబ్బంది 36 బృందాలుగా ఏర్పడి ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా అద నపులోడ్ వినియోగించుకుంటున్న 227 మంది విద్యుత్ వినియోగదారులకు రూ.8.24లక్షల జరిమానా విధించినట్లు అధికారులు వివరాలను వెల్లడించారు.

కందుకూరులో పెట్రో మంట

- ప్రభుత్వ కార్యాలయాల సముదాయంలో పెట్రోలు బంకు
- నామమాత్రపు అద్దెతో 99 ఏళ్లపాటు ఐవోసీకి లీజుకు..
- ప్రజల నుంచి వ్యతిరేకత వస్తున్నా అధికారులు ముందుకే!
- రెవెన్యూ మంత్రిని కలిసిన పలువురు ముఖ్యులు

కందుకూరు, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): కందుకూరులోని మండల కార్యాలయాల సముదాయంలో డివిజన్ విద్యాశాఖాధికారి, మండల విద్యాశాఖ, తహసీల్దారు, ఎమ్పీడీవో కార్యాలయాలతోపాటు సబ్ డివిజన్ వ్యవసాయాధికారి, మండల వ్యవసాయాధికారుల కార్యాలయాలతోపాటు భవిత పాఠశాల, కందుకూరు నియోజకవర్గంతోపాటు కొండపి నియోజకవర్గంలోని పలు మండలాలకు సంబంధించిన సబ్ ట్రెజరీ కార్యాలయాలు ఉన్నాయి. వీటన్నిటికంటే ముఖ్యంగా అంగన్వాడీలకు సంబంధించిన డివిజన్ కార్యాలయం, నియోజకవర్గస్థాయి వెలుగు కార్యాలయాలు ఉన్నాయి. ఈ కార్యాలయాలన్నీ నిత్యం ప్రజలకు అవసరాలు ఉండే కార్యాలయాలు కావటంతో నిత్యం వేలాదిమంది ఆయా కార్యాలయాలకు వస్తుంటారు. ఈ ప్రభుత్వ కార్యాలయాలకు సంబంధించి బహిరంగ కార్యక్రమాలు ఉన్నా ఈ ప్రాంగణంలోనే సభావేదిక ఏర్పాటుచేసి నిర్వహిస్తుంటారు. వీటన్నిటికంటే ముఖ్యంగా ఈ ప్రాంగణంలో బ్రిటిష్‌కాలం నాడు నాటిన భారీ వృక్షాలు 40కిపైగా ఉన్నాయి. ఈ ప్రాంతం వాణిజ్య ప్రాంతంగా అభివృద్ధి చెంది ఉన్నందున కేవలం ఒక్క గది నిర్మించి అద్దెకు ఇస్తే నెలకు రూ.15వేలుకన్నా ఎక్కువ ఆదాయం వచ్చే అవకాశం ఉంది. అలాంటి చోట పెట్రోలుబంకు ఏర్పాటుకు స్థలం ఇవ్వాలన్న నిర్ణయం జరిగిందని అధికారులు చెబుతుండటం మరోపక్క. నామమాత్రపు అద్దెతో ఐఓసీకి 99 సంవత్సరాల లీజు ఇవ్వటం దుర్మార్గమని ప్రజాసంఘాలు, వివిధ రాజకీయ పార్టీలు ఆందోళన చేస్తున్నాయి.ప్రస్తుతం పెట్రోలుబంకు ఏర్పాటుచేయాలంటే ఈ చెట్లను నరకడమేగాక ఆయా ప్రభుత్వ శాఖలకు సంబంధించిన కార్యక్రమాలకు తీవ్ర ఆటంకం ఏర్పడుతోంది. ఇన్ని ఇబ్బందులు ఉన్నా మొండిగా పెట్రోలుబంకు ఏర్పాటు చేయించేందుకు అధికారులు ప్రయత్నిస్తుండటం ఎవరి ప్రయోజనాలకోసమో ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదని పలువురు విమర్శిస్తున్నారు.



ప్రభుత్వ కార్యాలయాల సముదాయం, ఆ ప్రాంగణంలోని భారీ వృక్షాలు

● మంత్రిని కలిసిన మాజీ ఎమ్మెల్యే

కందుకూరు మాజీ ఎమ్మెల్యే, నియోజకవర్గ అభివృద్ధి మండలి అధ్యక్షుడు దివి శివరాంతోపాటు వివిధ ప్రజాసంఘాలు, పలు రాజకీయ పార్టీల నాయకులు పెట్రోలుబంకు ఏర్పాటును తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. కోట్ల విలువైన స్థలాన్ని నామమాత్రపు లీజుకు ఇవ్వటాన్ని సహించేది లేదని అందునా ప్రజలకు తీవ్ర అసౌకర్యం కలిగించే ఈ చర్యను అడ్డుకుని తీరుతామని హెచ్చరిస్తూ ఉన్నారు. ఇటీవల తమకు కేటాయించిన స్థలాన్ని సర్వే చేసేందుకు వచ్చిన ఐవోసీ సిబ్బందిని మాజీఎమ్మెల్యే దివి శివరాం, పలు ప్రజాసంఘాల నేతలు అడ్డగించటమే గాక ఆ మరుసటి రోజే రాష్ట్ర రెవెన్యూమంత్రి అనగాని సత్యప్రసాద్‌ను వారు కలిసి తమ అభ్యంతరాలను వ్యక్తం చేశారు. ప్రభుత్వానికి రాబడి పెంచుకోవటమే లక్ష్యం అయితే ప్రధానరోడ్డుపై షాపింగ్ కాంప్లెక్స్ నిర్మిస్తే అంతకు 15, 20 రెట్ల రాబడి వస్తుందని అదీ అతితక్కువ స్థలంతోనే సరిపోతుందని దానివల్ల ప్రజలకు అసౌకర్యం కూడా ఉండదని వివరించినట్లు శివరాం తెలిపారు. ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు కూడా ఈ నిర్ణయాన్ని పునస్సమీక్షించి పెట్రోలుబంకునకు స్థల లీజు ఉత్తర్వులు రద్దయ్యేలా చూడాలని ప్రజలు కోరుకుంటున్నారు.



ముళ్లపొదల్లో జనరేటర్

● రూ. లక్షలు నిరుపయోగం

సంగం, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): స్థానిక తహసీల్దారు కార్యాలయంలో ఏర్పాటుచేసిన జనరేటర్ మరమ్మతులకు గురై ముళ్లపొదల్లో నిరుపయోగంగా పడిఉంది. గత టీడీపీ ప్రభుత్వంలో రెవెన్యూ కార్యాలయంలో పనులకు అంతరాయం లేకుండా చేసేందుకు లక్షల నిధులు వెచ్చించి జనరేటర్ ఏర్పాటు చేశారు. కానీ నిర్వహణకు ప్రభుత్వం నిధులు మంజూరు చేయకపోవడంతో అధికారులు నిధుల కొరతతో జనరేటర్‌ను నిర్వహించలేక చేతులెత్తేశారు. కార్యాలయంలో విద్యుత్ సరఫరా లేని సమయంలో కంప్యూటర్లు పనిచేయక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

స్వచ్ఛాంధ్ర కార్యక్రమాలపై ప్రత్యేక శ్రద్ధ వహించండి

కలెక్టర్ ఆనంద్

నెల్లూరు (జడ్పీ), ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): జిల్లాలో స్వచ్ఛాంధ్ర కార్యక్రమాలను పకడ్బందీ నిర్వహించడంలో అధికారులంతా ప్రత్యేక శ్రద్ధ వహించాలని కలెక్టర్ ఓ ఆనంద్ ఆదేశించారు. కలెక్టరేట్‌లోని శంకరన్ సమావేశ మందిరంలో సోమవారం మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీవోలతో ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉపాధి హామీ పథకం ద్వారా గ్రామాల్లో ఇంకుడు గుంతల నిర్మాణాలు చేపట్టాలన్నారు. చెత్తనుంచి సంపద తయారుచేసే కేంద్రాలను వినియోగంలోకి తీసుకురావాలన్నారు. ప్రతినెలా మూడో శనివారం చేపట్టే స్వచ్ఛాంధ్ర కార్యక్రమాలపై ముందస్తుగా అన్నీ ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. ఉపాధి హామీ పనులు అనేక మండలాల్లో సక్రమంగా జరగడం లేదని, లక్ష్యాలలో వెనుకబడుతున్నారని, దీన్ని అధిగమించాలన్నారు. ఎవరైనా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవన్నారు. సమావేశంలో జడ్పీ సీఈవో విద్యారమ, డ్వామా పీడి గంగాభవాని, డీపీవో శ్రీధర్‌రెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

ఉదయగిరి దుర్గంపై గాలింపు చర్యలు

ఉదయగిరి, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): ఉదయగిరి దుర్గంపై సోమవారం పోలీసు, అటవీ శాఖ సిబ్బంది గాలింపు చర్యలు చేపట్టారు. గత మూడు రోజుల క్రితం రాత్రి సమయంలో దుర్గం కొండపై దీపాల వెలుగులు కనిపించాయి. దీంతో గుప్తనిధుల ముఠా సంచరిస్తోందని, తవ్వకాలు చేస్తున్నారని స్థానికులు అనుమానం వ్యక్తం చేశారు. ఈవిషయం పత్రికల్లో సైతం ప్రచురితమైంది. దీంతో స్పందించిన ఉదయగిరి సీఐ ఎన్ వెంకటరావు, ఎస్ఐ కె ఇంద్రసేనారెడ్డి, అటవీ శాఖాధికారి బీఎస్ కుమార రాజాలు తమ సిబ్బందిని దుర్గం కొండపైకి పంపి గాలింపులు చర్యలు చేపట్టారు. అక్కడ గతంలో గుప్తనిధుల కోసం తవ్విన గుంతలే ఉండడం, నూతనంగా తవ్విన గుంతలు లేకపోవడాన్ని గుర్తించారు. ఈమేరకు ఆయా శాఖల అధికారులకు సిబ్బంది సమాచారం అందజేశారు.



నేర వార్తలు (crime news) ఆంధ్రజ్యోతి

టిప్పర్ ఢీకొని యువకుడి మృతి

దుత్తలూరు(ఉదయగిరి), ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): టిప్పర్ ఢీకొని ఓ యువకుడు మృతిచెందిన సంఘటన మండలంలోని నర్రవాడ గ్రామంలో ఆదివారం రాత్రి చోటుచేసుకొంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. నర్రవాడ పంచాయతీ వడ్డిపాలెంకు చెందిన పచ్చవ మల్లికార్జున(35) వడ్డిపాళెం నుంచి వెంగమాంబ ఆలయానికి వెళ్లే మార్గంలో చెరువుకట్ట మీద గల రోడ్డు పక్కన కూర్చొని ఉన్నాడు. ఈ తరుణంలో కంకర లోడుతో వస్తున్న టిప్పర్ రోడ్డుపక్కన కూర్చొని ఉన్న మల్లికార్జున్‌ను గమనించకుండా ఢీకొంది. దీంతో అతనికి తీవ్ర గాయాలు కావడంతో స్థానికులు గమనించి కుటుంబ సభ్యులకు సమాచారం అందజేశారు. వారు హుటాహుటిన అక్కడికి చేరుకుని తీవ్ర గాయాలపాలైన మల్లికార్జున్‌ను ఉదయగిరి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అనంతరం ఆత్మకూరు తరలించేందుకు సిద్ధమవుతుండగా అతనిలో కదలికలు లేకపోవడంతో వైద్యులు పరీక్షించి అప్పటికే మృతిచెందినట్లు గుర్తించారు. సమాచారం అందుకున్న ఎస్ఐ ఆదిలక్ష్మి సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించి వాహనాన్ని స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

శ్మశానాన్నీ ఆక్రమించేశారు..!

● తహసీల్దారు కార్యాలయం ఎదుట గిరిజనుల ఆందోళన



డిప్యూటీ తహసీల్దారుకు వినతి పత్రం ఇస్తున్న గిరిజనులు

కలువాయి, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): శ్మశానం ఆక్రమణకు గురికావడంతో తహసీల్దారు కార్యాలయం వద్ద గిరిజనులు సోమవారం ఆందోళన చేపట్టారు. మండలంలోని బాలాజీరావుపేట గిరిజన కాలనీకి చెందిన ఇండ్ల చంద్రమ్మ (80) అనారోగ్యంతో ఆదివారం మధ్యాహ్నం మృతి చెందింది. కనీసం శవాన్ని శ్మశానానికి తీసుకుపోయేందుకు దారి కూడా లేకుండా ఆక్రమణ జరిగింది. దీంతో చంద్రమ్మ అంత్యక్రియలు ఎక్కడ చేయాలన్న సమస్య ఏర్పడింది. ఈ సమస్యను ఎన్నో ఏళ్లుగా అధికారుల దృష్టికి తీసుకుపోయినా పరిష్కారం లభించలేదు. దీంతో చంద్రమ్మ మృతదేహాన్ని ఊర్లో ఉంచి పెద్దఎత్తున గిరిజనులు సోమవారం తహసీల్దారు కార్యాలయానికి చేరుకున్నారు. టీడీపీ నాయకుడు చల్లా రఘురామిరెడ్డి, బీజేపీ నాయకుడు దండు పెంచలయ్య ఆధ్వర్యంలో గిరిజనులు డిప్యూటీ తహసీల్దారుకు సమస్యను వివరించి, వినతిపత్రం అందజేశారు. శ్మశానం ఆక్రమణ తొలగించి సమస్య పరిష్కరించేంత వరకు మృతదేహానికి అంత్యక్రియలు నిర్వహించమని అధికారులకు తెగేసి చెప్పారు. దీంతో డీటీ వెంకటేశ్వర్లు వెంటనే గ్రామానికి ఆర్ఐ సుధీర్, వీఆర్వో అరుణను పంపి ఆక్రమణదారుడితో మాట్లాడి అంత్యక్రియలకు ఇబ్బంది లేకుండా చేశారు. సర్వేచేసి సమస్యను శాశ్వతంగా పరిష్కరిస్తామని రెవెన్యూ అధికారులు తెలియజేశారు.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో
బాయిలర్ లైవ్	108
లేయర్ లైవ్	85
స్కిన్ చికెన్	200
స్కిన్‌లెస్	224
లేయర్	145

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)

ఒక గ్రాము ధర	రూ.8238
వెండి కిలో ధర	రూ. 98,800
వెండి ఒక గ్రాము	రూ. 101.90

కమీషన్ కోసం కుమ్ములాట!


● కార్పొరేషన్‌లో ఆర్ఐ వర్సెస్ అడ్మిన్ ● రోడ్డున పడుతున్న విభేదాలు ● ఫిర్యాదులందుతున్నా అధికారుల మౌనం

కార్పొరేషన్ పరిధిలో ఓ వ్యక్తి వీఎల్టీ లేకుండానే భవనం నిర్మించారు. దీనిని పసిగట్టిన అడ్మిన్ (బిల్ కలెక్టర్) సదరు యజమానితో డీల్ కుదుర్చుని తాజాగా పన్ను విధింపునకు దస్త్రం సిద్ధం చేసుకున్నాడు. కానీ ఆ ప్రాంతానికి ఆర్ఐ భవన యజమానితో మాట్లాడుకుని పన్ను వేసేశాడు. ఈ వ్యవహారం వెనుక రూ.50 వేల వరకు చేతులు మారాయి. ఇది తెలుసుకున్న అడ్మిన్ సదరు ఆర్ఐతో గొడవకు దిగాడు. రూ.15 వేలు ఇస్తానన్నాససేమీరా అనడంతో గుట్టు రోడ్డుకెక్కింది. ప్రస్తుతం ఈ అంశం కార్పొరేషన్‌లోని రెవెన్యూ విభాగాన్ని కుదిపేస్తోంది.

నెల్లూరు(సిటీ), ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరు నగర పాలక సంస్థ రెవెన్యూ విభాగంలో ఆర్ఐలుగా బాధ్యతలు స్వీకరించిన వారిలో కొందరు కొత్త భవనాలకు పన్ను వేసేందుకు మితిమీరి సొమ్ము వసూళ్లు చేస్తున్నారు. ఈ విషయం స్థానిక సచివాలయ అడ్మిన్లకు సమాచారం లేకపోవడం, కొన్ని ప్రాంతాలలో అడ్మిన్లు భవన నిర్మాణదారులతో కుమ్మక్కై నగదు తీసుకోవడం, ఆర్ఐలు పన్ను వేసేందుకు ఒప్పుకోకపోవడంతో ఇరువురి మధ్య అంతర్గత కుమ్ములాట నడుస్తోంది. ఇటు ఆర్ఐలు, ఇటు బిల్‌కలెక్టర్లుగా ఉన్న అడ్మిన్ల దెబ్బకు భవన నిర్మాణదారులు హడలెత్తిపోతున్నారు. భవనాలు నిర్మాణ దశలోనే పన్ను వేయాలంటూ స్థానిక సచివాలయాలకు చెందిన అడ్మిన్లు యజమానులతో సంప్రదింపులకు వెళ్తున్నారు. తక్కువ పన్ను వేయాలంటే ప్యాకేజీ ఇవ్వాలని డీల్ కుదుర్చుకుంటున్నారు. ఇదంతా ఒక ఎత్తయితే చివరగా రంగంలోకి దిగుతున్న ఆర్ఐలు సచివాలయాల నుంచి వచ్చిన దస్త్రాలను క్షేత్రస్థాయిలో పరిశీలనకు వెళ్లి వీ ఎల్టీ లేకుండానే ఎలా నిర్మిస్తారు? పన్ను తక్కువ ఎలా వేశారంటూ భవన నిర్మాణదారులను నిలదీస్తున్నారు. వీఎల్టీ కట్టి రావాలని సూచిస్తూ అయోమయానికి గురి చేసి ఆపై తమదైన శైలిలో డీల్ కుదుర్చుకుంటున్నారు. అటు ఆర్ఐ, ఇటు అడ్మిన్లు పెట్టే డీల్స్‌కు ఏం అర్థం కాక నిర్మాణదారులు గందరగోళానికి గురవుతున్నారు.

● పర్సంటేజీల కోసమే..

కార్పొరేషన్ ఖజానాకు ఆదాయం తెచ్చిపెట్టేది రెవెన్యూ విభాగం. మితిమీరిన అవినీతి జరిగేది ఇక్కడే. నగరంలో శరవేగంగా భవన నిర్మాణాలు జరుగుతుండటంతో పన్నులు వేయాలని అడ్మిన్లు, ఆర్ఐలు క్షేత్రస్థాయిలోకి వెళ్తున్నారు. అక్కడ పన్ను విధింపు, వీఎల్టీ మినహాయింపుల వద్ద నిర్మాణదారులతో కుదుర్చుకునే పర్సంటేజీలు ఇరువురి మధ్య అంతర్యుద్ధానికి దారితీస్తున్నాయి. ఎవరికివారుగా డీల్ కుదుర్చుకోవడం ఒక ఎత్తయితే ఇద్దరూ కలిసి డీల్ కుదుర్చుకున్న పంపకాల్లో తేడాలు రావడంతో రహస్యంగా నడవాల్సిన అవినీతి బాగోతం రట్టవుతోంది. ఈ మధ్య కాలంలో ఇలాంటి సంఘటనలు అనేకం బహిర్గతమయ్యాయి.



● అధికారుల మౌనం

రెవెన్యూ విభాగంలో అవినీతి మితిమీరుతోందంటూ ఇంటాబయటా రచ్చ జరుగుతోంది. కొన్ని సంఘటనలు నేరుగా అధికారుల వద్దకు వస్తున్నాయి. ఇటీవల ఓ మహిళ ఆర్ఐ పేరుతో లేఖ రాసి అతని అవినీతి బాగోతాన్ని ఎండగట్టింది. కార్పొరేటర్లతోపాటు అధికార పార్టీలో నియోజకవర్గ స్థాయి నేతలు సైతం ఫిర్యాదు చేస్తున్నా అటు ఆర్ఐలు, ఇటు అడ్మిన్లపై చర్యలు తీసుకోవడంలో ఉన్నతాధికారులు మౌనం వహిస్తున్నారంటూ విమర్శలు గుప్పుమంటున్నాయి. రెవెన్యూ అక్రమాలపై మరో విభాగం అధికారులతో విచారిస్తే వాస్తవాలు బయటపడతాయని ఉద్యోగులు కోరుతున్నారు.

విద్యార్థుల ఆరోగ్యానికి డీవార్మింగ్ తప్పనిసరి

జాతీయ నులిపురుగుల నివారణ దినంలో కలెక్టర్



విద్యార్థినికి నులిపురుగుల మాత్ర మింగిస్తున్న కలెక్టర్

నెల్లూరు (వైద్యం) ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని విద్యార్థుల ఆరోగ్యం మెరుగుకు డీవార్మింగ్ తప్పనిసరని కలెక్టర్ ఓ. ఆనంద్ పేర్కొన్నారు. సోమవారం జాతీయ నులిపురుగుల నివారణ దినం సందర్భంగా నెల్లూరులోని మూలాపేట ఈఎస్ఆర్ఎం ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు ఆయన నులిపురుగుల నివారణ మాత్రలు మింగించారు. అనంతరం మాట్లాడుతూ పౌష్టికాహారం లోపం, రక్తహీనత, శారీరక, మానసిక ఎదుగుదల లేకపోవటం వల్ల విద్యార్థులు అనారోగ్య సమస్యలు ఎదుర్కొంటున్నారని చెప్పారు. జిల్లాలోని 5,75,806 మంది విద్యార్థులకు ఆల్‌బెండాజోల్ మాత్రలు వేయాలని నిర్ణయించామని చెప్పారు. ఒకటి నుంచి 19 ఏళ్ల వయసున్న విద్యార్థులు ఈ మాత్రలు వేసుకోవాలన్నారు. ఈ నేపథ్యంలో ప్రతి ఒక్క విద్యార్థి ఏడాదికి రెండుసార్లు ఈ మాత్రలు వేసుకోవాలన్నారు. జిల్లాలోని అన్ని పాఠశాలలు, కళాశాలల్లో ఈ మాత్రలు విద్యార్థులకు అందేలా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో డీఎంహెచ్‌వో డాక్టర్ సుజాత, డీఈవో బాలాజీరావు, సమగ్రశిక్ష ఏపీసీ వెంకట సుబ్బయ్య, స్కూల్ హెల్త్ ప్రాజెక్టు అధికారి డాక్టర్ యశ్వంత్, హెచ్ఎం శివరామప్రసాద్, వైద్యాధికారి ప్రతిమారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

హైస్కూల్ విద్యార్థినులకు తీవ్ర అస్వస్థత

కలిగిరి, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): స్థానిక జడ్పీ హైస్కూల్‌లో 8వ తరగతి చదువుతున్న శ్రీరూప, మహితలు సోమవారం అకస్మాత్తుగా అస్వస్థతకు గురయ్యారు. ఉదయం 11గంటల సమయంలో శ్రీరూప శ్వాసుకోవడంలో ఇబ్బంది పడటం, మరో విద్యార్థిని మహిత గుండెలో నొప్పిగా ఉందని సహచర విద్యార్థినులకు తెలపడంతో వారు ఉపాధ్యాయులకు సమాచారం ఇచ్చారు. అప్రమత్తమైన ఉపాధ్యాయులు ఇద్దరినీ స్థానిక పీహెచ్‌సీకి తీసుకెళ్లారు. శ్రీరూపకి జలుబు, దగ్గుతో శ్వాస తీసుకోవడం ఇబ్బందిపడుతుందని, అలాగే మహితకు గ్యాస్ట్రిక్ ట్రబుల్‌తో ఛాతీలో మంట రావడం గుర్తించి వైద్య చికిత్స అందించినట్లు వైద్యాధికారి బిజ్జం గీతారెడ్డి తెలిపారు. ఉపాధ్యాయుల సమాచారంతో సంబంధిత విద్యార్థినుల తల్లిదండ్రులు హుటాహుటిన ఆసుపత్రికి వచ్చారు. చికిత్స అనంతరం వారి ఆరోగ్యం మెరుగుపడటంతో తల్లిదండ్రులతో కలిసి విద్యార్థినులు సాయంత్రం ఆసుపత్రి నుంచి ఇంటికివెళ్లారు.

రోడ్డు మార్జిన్ ఆక్రమణల తొలగింపునకు చర్యలు

● వీధిన పడనున్న 240 కుటుంబాలు

● తహసీల్దారు కార్యాలయం ఎదుట బాధితుల ఆందోళన

విడవలూరు, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): ఏపీ లోకాయుక్త (కర్నూలు) ఆదేశాలతో విడవలూరులో రహదారి వెంబడి ఉన్న ఆక్రమణల తొలగింపునకు ఆర్ అండ్‌బీ, పీఆర్, రెవెన్యూ అధికారులు సంయుక్తంగా చర్యలు చేట్టారు. ఈనెల 12న ఆక్రమణల తొలగింపునకు రంగం సిద్ధం చేశారు. దీంతో సుమారు 240 కుటుంబాలు వీధిన పడనున్నాయి. విషయం తెలుసుకున్న బాధితులు సోమవారం స్థానిక తహసీల్దారు కార్యాలయం ఎదుట ఆందోళనకు దిగారు. అసలేమి జరిగిందంటే.. విడవలూరు పంచాయతీలో కొందరు రహదారులను ఆక్రమించుకుని దుకాణాలు, ఇళ్ల నిర్మాణాలు చేపట్టారని, దీనివల్ల వాహన రాకపోకలకు అంతరాయం ఏర్పడటమే కాకుండా ప్రమాదాలు జరుగుతున్నాయని గ్రామానికి చెందిన ఓ వ్యక్తి 2021లో ఏపీ లోకాయుక్త (కర్నూలు)ను ఆశ్రయించారు. విచారణ చేపట్టిన ఏపీ లోకాయుక్త రహదారి వెంబడి ఉన్న ఆక్రమణలను తొలగించాలని జిల్లా అధికారులకు ఆదేశాలు జారీ చేసింది. దీంతో ఈనెల 12న విడవలూరు సిని మా హాల్ సెంటర్ నుంచి తహసీల్దారు కార్యాలయం వరకు ఉన్న దుకాణాలు, ఇళ్లను తొలగించడానికి అధికారులు ప్రణాళికలు సిద్ధం చేశారు. ఆ సమయంలో ఎలాంటి ఆవాంఛనీయ సంఘటనలు జరగకుండా బందోబస్తు కల్పించాలని పోలీసుల కు ముందస్తు సమాచారం అందిం చారు. దీంతో ఏన్నో ఏళ్ల నుంచి నివాసం ఉంటు న్న సుమారు 240 కుటుంబాలు వీధిన పడనున్నాయి. ఈ విషయం తెలుసుకున్న బాధితులు తహసీల్దారు కార్యాలయం ఎదుట ఆందోళనకు దిగారు. రెవెన్యూ అధికారులు చేసిన సర్వేలో తప్పులు జరిగాయని ఆరోపించారు. తమ ఇళ్లకు పొజిషన్ సర్టిఫికెట్లు, కరెంటు, పంచాయతీ పన్నులు ఉన్నాయని, అటువంటప్పుడు తమ ఇళ్లను, దుకాణాలను ఎలా తొలగిస్తారని ప్రశ్నించారు. తమకు ఉన్న ఒక్క ఆధా రాన్ని తీసి తమ పొట్టలు కొట్టవద్దని అధికారులను వేడుకున్నారు. ఆక్రమణల తొలగింపు నిలిపి వేయాలని లేదా నెలాఖరు వరకు గడువు ఇవ్వాలని కోరుతూ తహసీల్దారు చంద్రశేఖర్, అర్‌అండ్‌బీ ఏఈ చంద్రశేఖర్‌లకు వినతి పత్రాలు అందజేశారు.



తహసీల్దారు కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న బాధితులు

సోమశిలలో 64.640 టీఎంసీల నీరు నిల్వ

అనంతసాగరం ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): సోమశిల జలాశయానికి ఎగువ నుంచి సోమవారం 1,020 క్యూసెక్కుల ప్రవాహం వస్తున్నట్లు అధికారులు తెలిపారు. ప్రాజెక్టు సామర్థ్యం 77.988 టీఎంసీలు కాగా 64.640 టీఎంసీల నిల్వ ఉంది. దిగువ కండలేరుకు 200, డెల్టాకు 2,800, ఉత్తర కాలువకు 650, దక్షిణ కాలువకు 350 క్యూసెక్కులు సరఫరా చేస్తున్నారు.

డీసీఎంఎస్ బిజినెస్ మేనేజర్‌గా మోహనకృష్ణ



మోహనకృష్ణ

నెల్లూరు (హరనాథపురం) ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): జిల్లా కోఆపరేటివ్ మార్కెటింగ్ సొసైటీ (డీసీఎంఎస్) లిమిటెడ్ బిజినెస్ మేనేజర్‌గా సీ మోహనకృష్ణ సోమవారం నగరంలోని డీసీఎంఎస్ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు ఆయన సహకారశాఖలో అసిస్టెంట్ రిజిస్ట్రార్‌గా పనిచేస్తున్నారు. డీసీఎంఎస్ బిజినెస్ మేనేజర్‌గా పనిచేసిన వెంకటస్వామి వ్యక్తిగత కారణాలతో ఇటీవల రాజీనామా చేశారు. దీంతో మోహనకృష్ణ బాధ్యతలు చేపట్టారు.

వ్యక్తిగత శ్రద్ధతో అర్జీల పరిష్కారం

ప్రజా సమస్యల పరిష్కార వేదికలో జేసీ కార్తీక్

409 అర్జీల స్వీకరణ



అర్జీల స్వీకరిస్తున్న జాయింట్ కలెక్టర్ కార్తీక్

నెల్లూరు (హరనాథపురం) ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వచ్చే అర్జీల పరిష్కారానికి వ్యక్తిగత శ్రద్ధ అవసరమని జాయింట్ కలెక్టర్ కే కార్తీక్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని తిక్కనభవన్‌లో వేదిక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ వివిధ సమస్యలపై ప్రజలు అందించిన అర్జీలను నిర్దిష్ట గడువులోగా పరిశీలించి, పరిష్కరించేందుకు ఆయా శాఖల అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలో రెవెన్యూ అంశాలకు సంబంధించి అర్జీలు ఎక్కువగా వస్తున్నాయని, వాటిని పరిష్కరించేదిశగా అధికారులు వ్యక్తిగత శ్రద్ధ పెట్టాలన్నారు. పదే పదే రీఓపెన్ అవుతున్న వాటిని ప్రత్యేకంగా పరిశీలిస్తామన్నారు.

మొత్తం అర్జీలు 409

వేదిక కార్యక్రమానికి మొత్తం 409 అర్జీలు వచ్చాయి. వీటిలో రెవెన్యూ శాఖవి 160, మున్సిపల్‌శాఖవి 31, పోలీసు శాఖవి 93, సర్వేశాఖవి 33, పంచాయతీరాజ్‌శాఖకి 16కాగా మిగిలినవి ఇతర విభాగాలకు సంబంధించిన వినతులు ఉన్నాయి. కార్యక్రమంలో డీఆర్‌వో ఉదయభాస్కర్‌రావు, పలు శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

● ఆత్మకూరులో పంట కాలువలలు, అలుగు వాగు, శ్మశాన భూములను ఆక్రమించుకున్న రియల్టర్ పచ్చిపులుసు వెంకటేశ్వర్లుపై చర్యలు తీసుకోవాలని కోరుతూ సీమాంధ్ర ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు పందిటి సుబ్బయ్యమాదిగ జేసీకి వినతిపత్రం సమర్పించారు.

● ఉమ్మడి నెల్లూరు జిల్లాలోని అన్ని వృత్తుల కళాకారులకు ప్రస్తుతం ఇస్తున్న పింఛనును రూ.4వేల నుంచి రూ.6వేలకు పెంచాలని జానపద కళావేదిక జిల్లా అధ్యక్షుడు ఏ.కృష్ణదాసు, ప్రధాన కార్యదర్శి వడ్డే చక్రపాణి, కోశాధికారి కళ్ల సీనయ్య, తదితరులు వినతిపత్రం ఇచ్చారు.

● రాష్ట్రంలో పనిచేస్తున్న బీసీ ఉద్యోగులకు ఇళ్ల స్థలాలు కాని, ఇళ్లు కాని కేటాయించాలని కోరుతూ ఏపీ బీసీ చైతన్య సమితి ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఆరంబాకం చంద్రశేఖర్ జేసీకి వినతిపత్రం ఇచ్చారు. పదవీ విరమణ పొందేవారికి రెండేళ్ల ముందే స్పెషల్ ఇంక్రిమెంట్ మంజూరు చేయాలని కోరారు.

ఫిర్యాదులపై త్వరితగతిన స్పందించండి : ఎస్పీ

నెల్లూరు(క్రైం), ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక ద్వారా స్వీకరించిన ఫిర్యాదులపై త్వరితగతిన స్పందించాలని పోలీసు అధికారులను ఎస్పీ జీ కృష్ణకాంత్ ఆదేశించారు. నగరంలోని ఉమేష్‌చంద్ర కాన్ఫరెన్స్ హాల్‌లో సోమవారం జరిగిన ఈ కార్యక్రమానికి జిల్లా వ్యాప్తంగా 98 మంది హాజరై వారి సమస్యలను ఎస్పీకు విన్నవించుకున్నారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ఫిర్యాదులపై విచారణ జరిపి చట్టపరంగా న్యాయం చేస్తామని బాధితులకు హామీ ఇచ్చారు.

● హిజ్రాల నాయకురాలు అలేఖ్య బెదిరింపులకు పాల్పడుతున్నారని పలువురు హిజ్రాలు ఎస్పీకి ఫిర్యాదు చేశారు. పోలీసు అధికారులతో మాట్లాడి తమను బైండోవర్ చేయిస్తూ పదేపదే స్టేషన్‌లకు పిలిపించి భయాందోళనలకు గురిచేస్తున్నదని, ఆమె వల్ల తమకు ప్రమాదం పొంచి ఉందని, రక్షణ కల్పించాలని కోరారు.

● చిన్నకోడలు ఇంటిని ఆక్రమించుకొని,తమను ఇబ్బంది పెడుతున్నదని, విడవలూరు మండలం వావిళ్ల గ్రామవాసులు సుబ్రహ్మణ్యం, మస్తానమ్మ ఎస్పీకి ఫిర్యాదు చేశారు. వృద్ధులమని కూడా చూడకుండా తమపైనే కేసులు పెడుతున్నదని ఆవేదన వ్యక్తం చేశారు. తమ ఇంటికి తమకు అప్పగించాలని వారు కోరారు.



హిజ్రాలతో మాట్లాడుతున్న ఎస్పీ కృష్ణకాంత్

గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనే ప్రభుత్వ ధ్యేయం

● ఎమ్మెల్యే ఇంటూరి



శిలాఫలకం ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే నాగేశ్వరరావు

వలేటివారిపాలెం, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో మౌలిక వసతుల కల్పించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యం అని కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు తెలిపారు. మండలంలోని జాతీయ రహదారి నుంచి రోళ్లపాడు, కొండసముద్రం, పోకూరు శివాలయం నుంచి శింగమనేనిపల్లెలో రూ.4.50కోట్ల నిధులతో చేపట్టనున్నలోకి బీటీ రోడ్ల పనులకు సోమవారం ఎమ్మెల్యే నాగేశ్వరరావు శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమాలకు వచ్చిన ఎమ్మెల్యేకు ఆయా గ్రామాల నాయకులు పూలవర్షంతో స్వాగతం పలికి గజమాలతో సత్కరించారు. అంతరం ఎమ్మెల్యే మాట్లాడారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన 8 నెలల కాలంలోనే నియోజకవర్గంలో రూ.15కోట్లతో సిమెంటు రోడ్లు, మరో రూ.11కోట్లతో బీటీ రోడ్లు వేస్తునట్లు తెలిపారు. కందుకూరును ప్రకాశం జిల్లాలోకి కలిపేందుకు ఈ నెల 15న రానున్న సీఎం చంద్రబాబునాయుడుకు వినతిపత్రం అందజేయనున్నట్లు చెప్పారు. కందుకూరు మున్సిపాలిటీ అభివృద్ధికి రూ.10కోట్లతో డ్రైనేజీలు, సిమెంటు రోడ్లు వేస్తునట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీఈఓ నరేంద్రదేవ్, పీఆర్ ఏఈ చంద్రమౌళి, ఏపీఓ ఉమామహేష్, పార్టీ మండలాధ్యక్షుడు మాదాల లక్ష్మీనరసింహం, వలేటి మధుసూదన్‌రావు, నరసింహం, కొంకా రమేష్, కాకుమాను ఆంజనేయులు, వీరమోసు అంజయ్య, కాకుమాను మాల్యాద్రి, గుత్తా మహేశ్వరరావు, మార్తాల వెంకటేశ్వరరెడ్డి, పిల్లి రామచంద్రారెడ్డి, ఘట్టమ నేని సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

తరగతులను తరలించొద్దని విద్యార్థుల ఆందోళన



సంగం: పాఠశాల ఎదుట ఆందోళన చేస్తున్న విద్యార్థులు

సంగం, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఆర్ఎస్ ప్రాథమిక పాఠశాలలోని 3, 4, 5 తరగతుల విద్యార్థులను నార్త్ పాఠశాలకు తరలించొద్దని విద్యార్థుల తల్లిదండ్రులు పాఠశాల ఎదుట సోమవారం ధర్నా నిర్వహించారు. ఈమేరకు స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ సభ్యులు తీర్మానం చేసి ఎంపీడీవోకు, ఎంఈవోకు వినతి పత్రం అందచేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎంసీ చైర్మన్, సభ్యులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

●అనంతసాగరం : మండలంలోని ముత్తుకూరు, గార్లదిన్నెపాడు విద్యార్థులను పాతదేవరాయపల్లి మోడల్ స్కూల్‌కు విలీనం చేయడాన్ని నిరసిస్తూ సోమవారం ఎంఈవో కార్యాలయం ఎదుట గ్రామస్థులు ఆందోళన చేశారు. వారు మాట్లాడుతూ తమ గ్రామ సమీపంలో వాగు ఉందని, నిత్యం ప్రవాహం కొనసాగుతూ ఉంటుందని దీంతో విద్యార్థులు ప్రమాదానికి గురయ్యే అవకాశం ఉందని, విలీనం ఆపాలని డిమాండ్ చేస్తూ ఎంఈవో ప్రభాకర్‌రెడ్డికి వినతిపత్రం ఇచ్చారు. కార్యక్రమంలో నాయకులు రాపూరు సురేంద్రరెడ్డి, సుబ్బారెడ్డి, కృష్ణారెడ్డి విద్యార్థుల తలిదండ్రులు పాల్గొన్నారు.

రైతులకు విశిష్ట గుర్తింపు సంఖ్య కార్డుల పంపిణీ

చేజర్ల, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): భూములు కలిగిన ప్రతి రైతు ప్రత్యేక విశిష్ట గుర్తింపు సంఖ్య కార్డులు పొందాలని మండల వ్యవసాయశాఖ అధికారి వి శశిధర్ తెలిపారు. సోమవారం చేజర్ల మండలం మాముడూరులో ప్రత్యేక విశిష్ట గుర్తింపు సంఖ్యపై రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ గుర్తింపు సంఖ్య ద్వారా ప్రభుత్వ పథకాలు, సబ్సిడీలు, ఇతర వ్యవసాయ శాఖకు సంబంధించిన సేవలు పొందడానికి సులభతరం అవుతుందన్నారు. అదేవిధంగా తెగుళ్ల నియంత్రణ, వాతావరణ సూచనలు తదితర సేవలను పొందవచ్చన్నారు. కావున రైతులు తమ ఆధార్ నెంబర్, మొబైల్ నెం, పట్టాదారు పాసు పుస్తకాలతో గ్రామాలలోని రైతు సేవా కేంద్రాల వద్ద వ్యవసాయశాఖ సిబ్బందిని సంప్రదించి ప్రత్యేక గుర్తింపు సంఖ్యను పొందవచ్చునని తెలిపారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక రైతులు పాల్గొన్నారు.

●ఉలవపాడు : ఆధార్ కార్డు తరహాలో రైతులకు 11అంకెలతో కూడిన ప్రత్యేక విశిష్ట కార్డును కేంద్ర ప్రభుత్వం జారీ చేయున్నట్లు సోమవారం మండల వ్యవసాయ శాఖ అధికారిణి తిరుమల జ్యోతి తెలిపారు. ఇకపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పథకాల రాయితీలు పొందాలంటే రైతులకు ప్రత్యేక గుర్తింపు కార్డు తప్పనిసరి కావడంతో దగ్గరలోని రైతుసేవా కేంద్రాల్లో 11అంకెల విశిష్ట సంఖ్యను నమోదు చేసుకోవాలని సూచించారు.

ప్రభుత్వమే ధాన్యం కొనుగోలు చేయాలి



ఆర్డీవోకి వినతిపత్రం ఇస్తున్న రైతు సంఘాల నేతలు

ఆత్మకూరు, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): రైతులు పండించిన వరి ధాన్యాన్ని గిట్టుబాటు ధర కల్పిస్తూ ప్రభుత్వమే కొనుగోలు చేయాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం, కౌలు రైతు సంఘం నాయకులు గంటా లక్ష్మీపతి, లక్కు కృష్ణప్రసాద్ కోరారు. ఈమేరకు సోమవారం ఆర్డీవో బి పావనికి వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు మాటాడుతూ ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర కంటే రూ. 500 అదనంగా ఇవ్వాలన్నారు. అదేక్రమంలో ఈక్రాప్ నమోదు గాని రైతుల ధాన్యాన్ని కొనుగోలు చేయాలని, రైతులు మిల్లులకు ధాన్యాన్ని తీసుకుపోయే పద్ధతికి స్వస్తి పలకాలని డిమాండ్ చేశారు. రైతులకు సరిపడ గోతాలు అందుబాటులో ఉంచాలని, ధాన్యం కొనుగోలు కేంద్రాలను వారికి అనువుగా ఏర్పాటు చేయాలని కోరారు. ఈనెల 22న నెల్లూరులో జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందజేసేందుకు రైతులు భారీగా తరలిరావాలని కోరారు.

ఉదయగిరిలో దెబ్బతిన్న రోడ్ల పరిశీలన



దెబ్బతిన్న రోడ్లను పరిశీలిస్తున్న డీఈ మణికుమార్

ఉదయగిరి, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): ఉదయగిరి పట్టణంలోని కోళ్లవీధి, నాగులబావివీధి, అగ్రహారం, బ్రాహ్మణవీధి, దిలావర్‌భాయ్‌వీధి తదితర ప్రాంతాల్లో దెబ్బతిన్న సిమెంట్ రోడ్లను సోమవారం పంచాయతీరాజ్ డీఈ సీహెచ్ మణికుమార్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణానికి చెందిన టీడీపీ రాష్ట్ర మైనారిటీ సెల్ ఉపాధ్యక్షుడు షేక్ రియాజ్ పట్టణంలోని పలు ప్రాంతాల్లో దెబ్బతిన్న రోడ్ల దుస్థితిని ఎమ్మెల్యే కాకర్ల సురేష్ దృష్టికి తీసుకెళ్లారన్నారు. ఆయన ఆదేశాల మేరకు దెబ్బతిన్న రోడ్లను పరిశీలించినట్లు, త్వరలో ఆయా రోడ్లకు ప్రతిపాదనలు పంపి నిధులు మంజూరు కాగానే నిర్మాణం చేపడతామన్నారు. ఈ కార్యక్రమంలో జూనియర్ టెక్నికల్ అధికారి రాజశేఖర్, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు వెంకటేష్, షరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

కంపు కొడుతున్న పట్టణాలు, పల్లెలు

● పడకేసిన పారిశుధ్యం ● అస్తవ్యస్తంగా డ్రైనేజీ వ్యవస్థ ● అవస్థలు పడుతున్న ప్రజలు



ఉదయగిరిలోని సుద్దబావివీధిలో రహదారిపై ప్రవహిస్తున్న మురుగు నీరు



ఉదయగిరి మండలం వెంకట్రావుపల్లిలో సిమెంట్ రోడ్డుపై చేరిన మురుగు

ఉదయగిరి, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): ఉదయగిరి పట్టణంలో డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉండడంతో మురుగుతో ప్రజలు అవస్థలు పడుతున్నారు. సుద్దబావివీధి, యాదవపాళెం, దేవలాలగడ్డ, తుపాన్‌నగర్, సినిమాహాలు వీధి, బాలాజీ నగర్ తదితర ప్రాంతాల్లో మురుగు కాలువలు సక్రమంగా లేకపోవడంతో ఖాళీ స్థలాలు, రహదారులపై మురుగునీరు నిలిచి దుర్గంధం వెదజల్లుతోంది. రాకపోకలకు ప్రజలు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. కొన్ని ప్రాంతాల్లో కాలువలు నాసిరకంగా నిర్మించడంతో ధ్వంసమై మురుగు నీరు ముందుకు సాగడంలేదు. డ్రైనేజీ వ్యవస్థను బాగు చేయాలని పాలకులు, అధికారులకు పలుమార్లు విన్నవించినా పట్టించుకోలేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పంచాయతీల్లో పడకేసిన పారిశుధ్యం

మండలంలోని పంచాయతీల్లో పారిశుధ్యం పడకేసింది. కొండాయపాళెం, తిరుమలాపురం, జీ.చెర్లోపల్లి, జీ.చెరువుపల్లి, శకునాలపల్లి, దాసరిపల్లి, అప్పసముద్రం తదితర పంచాయతీల్లో మురుగు కాలువలు పూర్తిస్థాయిలో లేకపోవడంతో నివాసాల్లో నుంచి వచ్చే మురుగునీరంతా రహదారులు, ఇళ్ల నడుమ నిల్వ చేరడంతో ప్రజలు దుర్గంధంతో అల్లాడుతున్నారు. మరోవైపు దోమలకు నిలయంగా మారి వ్యాధులు ప్రబలుతున్నాయని వాపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు సత్వరమే స్పందించి మురుగునీరు రోడ్లపై ప్రవహించకుండా చర్యలు చేపట్టాలని గ్రామస్థులు కోరుతున్నారు.

నులిపురుగుల నివారణతో చిన్నారుల్లో ఎదుగుదల

● అదనపు డీఎంహెచ్‌వో ఖాదర్‌వల్లి



కావలి: విద్యార్థులకు నులిపురుగుల నివారణ మాత్ర వేస్తున్న డిప్యూటీ డీఎంహెచ్‌వో బ్రిజిత

సంగం, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): చిన్నారుల ఎదుగుదలకు నులిపురుగుల నివారణ మాత్రలు దోహదపడతాయని జిల్లా అదనపు వైద్యాధికారి డాక్టర్ ఖాదర్‌వల్లి పేర్కొన్నారు. సోమవారం ఆయన స్థానిక డాక్టర్ బిఆర్ అంబేడ్కర్ సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల కళాశాల, గాంధీజన సంఘం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు నులిపురుగుల మాత్రలు మింగించారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట ఎంపీడీవో షాలెట్, స్థానిక వైద్యాధికారి డాక్టర్ శ్రీనివాసులురెడ్డి, అశోక్, ప్రిన్సిపాల్ సుమతి, హెచ్ఎం మల్లికార్జునరెడ్డి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

●ఏఎస్ పేట: స్థానిక పీహెచ్‌సీ పరిధిలోని అన్ని పాఠశాలల్లోని విద్యార్థులకు ఆల్‌బెండజోల్ మాత్రలను మింగించారు. కార్యక్రమంలో డా మంజుల తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా చిరమన పీహెచ్‌సీ పరిధిలోని పాఠశాలలో విద్యార్థులకు వైద్యులు జ్యోతిరాణి, నాగవినూత ఆధ్వర్యంలో మాత్రలను పంపిణీ చేశారు.

●ఉదయగిరి : మండలంలో 97 శాతం మంది విద్యార్థులకు అల్బెండజోల్ మాత్రలను మింగించినట్లు మండల వైద్యాధికారులు శివకల్పన, వినీతలు పేర్కొన్నారు. మండలంలోని నేలటూరు, గన్నేపల్లి, ఉదయగిరి పట్టణంలోని బీసీ కాలనీల్లో విద్యార్థులకు మాత్రలను మింగించారు. ఈ కార్యక్రమంలో సీహెచ్‌వో శివకుమారి, ఆరోగ్య బోధకుడు వెంకటసుబ్బయ్య, వైద్యఆరోగ్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

●దుత్తలూరు: మండలంలోని నర్రవాడ పీహెచ్‌సీ పరిధిలో 96, దుత్తలూరు పీహెచ్‌సీ పరిధిలో 93 శాతం మంది చిన్నారులకు నులిపురుగుల మాత్రలు మింగించినట్లు వైద్యాధికారులు మనోజ్ఞ, అయూబ్‌లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా వారు నర్రవాడ, నందిపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో విద్యార్థులకు మాత్రలు మింగించారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య పర్యవేక్షకులు రియాజ్, ఖాజామొహిద్దీన్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

●సీతారామపురం : స్థానిక కస్తూర్బా విద్యాలయం వద్ద సోమవారం జిల్లా మలేరియా అధికారి హుస్సేనమ్మ, డాక్టర్ స్వప్న ఆధ్వర్యంలో జాతీయ నులి పురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా విద్యార్థినులకు అల్బెండజోల్ మాత్రలను మింగించారు. ఈ కార్యక్రమంలో కేజీబీవి స్కూల్ ప్రిన్సిపాల్ షాజియా, ఎంపిహెచ్ఇవో మజీద్, ఎంపిహెచ్ఎస్ రియాజ్, నౌషాద్, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

●కావలి: తుమ్మలపెంట గురుకుల పాఠశాల విద్యార్థులకు కావలి డిప్యూటీ డీఎంఅండ్ హెచ్‌వో బ్రిజిత నులిపురుగుల మాత్రలు వేయించారు. కార్యక్రమంలో తుమ్మలపెంట వైద్యాధికారి అనీల్‌కుమార్, సహాయక సిబ్బంది, భాస్కర్, ఏఎన్ఎంలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

● బిట్రగుంట: పీహెచ్‌సీ వైద్యాధికారి జిహారిక కప్పరాళ్లతిప్పలోని అంబేడ్కర్ గురుకుల పాఠశాల విద్యార్థులకు నులిపురుగుల నివారణ మందు వేశారు. ప్రిన్సిపాల్ పద్మావతి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

● కొండాపురం: 18మండల వైద్యాధికారులు నసీరుద్దీన్, వినీతలు జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవంలో పాల్గొన్నారు. అలాగే మండలకేంద్రంలోని జడ్పీ ఉన్నత పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో ఎంపీడీవో ఆదినారాయణ, ఎంఈవో-1 కె.రవికుమార్, ఈవోపీఆర్డీ నారాయణ పాల్గొని విద్యార్థులకు అల్బెండజోల్ మాత్రలు వేయించారు. కార్యక్రమాల్లో సీహెచ్.చెంచురామయ్య, సూపర్‌వైజర్లు సరోజినీదేవి, అక్బర్ భాషా, ఏఎన్ఎం లు, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

●ఉలవపాడు: మండలంలోని ప్రభుత్వ, ప్రవేటు పాఠశాలలు, అంగన్‌వాడీకేంద్రాలు, జూనియర్ కాలేజీలోని 5,645మందిలో 5,539మంది విద్యార్థులకు సోమవారం ఆల్బెండజోల్ మాత్రలు వేసినట్లు కరేడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు శ్రీనివాసరావు, వైద్యులు రమ్యజ్యోతి తెలిపారు. పాఠశాలకు రాని విద్యార్థులకు ఈనెల 17న మాత్రలు వేస్తామన్నారు. కార్యక్రమంలో ఎంపీహెచ్‌ఈవో లక్ష్మీ నారాయణ, పీహెచ్ఎన్ సీతారాములు, హెచ్‌వీ వసంత, సీహెచ్‌వోలు, సిబ్బంది పాల్గొన్నారు.

●లింగసముద్రం: మండలంలోని 97శాతం మంది పిల్లలకు ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేసినట్లు మండల పీహెచ్‌సీ వైదాధికారి రమేష్ తెలిపారు. వైద్యులు అనూరాధ, సీహెచ్‌ఓ శ్రీనివాసులు, ఎంఈఓ-2 ఎంవీ.శివకుమార్ ఆరోగ్య సిబ్బంది అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లోని 5,217 మంది పిల్లలకు ఈ మందు వేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు క్షత్రియకుమారి, మహబూబ్ బాషా, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

● కలిగిరి: స్థానిక జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థులకు మండల వైద్యాధికారి బిజ్జం గీతారెడ్డి అల్బెండజోల్ మాత్రలు వేయించారు. కార్యక్రమంలో సీ హెచ్‌ఓ సాయి లక్ష్మి, ఎంఎల్‌హెచ్‌పీ పద్మ, హైస్కూల్ ఇన్‌చార్జి సుగుణమ్మ, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

గుండెపోటు నివారణకు ఉచితంగా ఇంజక్షన్

కందుకూరు, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): తీవ్రమైన గుండెపోటు వచ్చిన వారికి గంట లోపు టెనెక్టెప్లస్ అనే ఖరీదైన ఇంజెక్షన్ ఇస్తే వారి ప్రాణాలను నిలబెట్టే అవకాశం ఉందని, అయితే ఆ ఇంజక్షన్ వేయించటం అందరికీ ఆర్థికస్థోమతకు సాధ్యం కాదన్నారు. అలాంటి వారికి ఉచితంగా ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించిందని కందుకూరు ఏరియా హాస్పటల్ వైద్యులు తులసీరామ్ తెలిపారు. ప్రస్తుతం ఈ ఇంజక్షన్ కందుకూరు ఏరియా హాస్పటల్‌లో అందుబాటులో ఉందని ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఇటీవలికాలంలో గుండెపోటు మరణాలు పెరుగుతున్న నేపథ్యంలో ప్రభుత్వం ఈనిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. ఇప్పటికే 10మందికి ఈ ఇంజక్షన్ ఇచ్చి వారి ప్రాణాలను కాపాడినట్లు తెలిపారు.

● వింజమూరు : ప్రభుత్వ వైద్యశాలలో గుండెకు సంబంధించిన ఛాతీనొప్పికి ఇంజక్షన్‌ను ఉచితంగా పంపిణీ చేస్తున్నట్లు డీడీఓ కార్తీక్ తెలిపారు. సోమవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ ఇంజక్షన్ ఛాతీనొప్పి వచ్చిన ఆరు గంటల లోపు వేయించుకోవాలని, ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో డాక్టర్ శ్వేత, మసూద్, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

లైంగిక వేధింపులకు పాల్పడితే కఠిన చర్యలు : సీఐ



ఆత్మకూరు: అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న సీఐ గంగాధర్

ఆత్మకూరు, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): మహిళలు, విద్యార్థినులపై ఎవరైనా లైంగిక వేధింపులకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని సీఐ జి గంగాధర్ హెచ్చరించారు. పట్టణంలోని ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలలో సోమవారం విద్యార్థినులకు లైంగిక దాడులపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎవరైనా లైంగిక వేధింపులకు పాల్పడుతున్నట్లు అనుమానం కలిగినా వారి గురించి తల్లిదండ్రులకు, సన్నిహితులకు, పోలీసులకు గాని తెలిచేయాలని సూచించారు. త్వరలో పాఠశాలల సమీపంలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేస్తామన్నారు. ఈకార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు కోటేశ్వరమ్మ, గ్రైడ్ స్వచ్ఛంద సంస్థ నిర్వాహకులు వాగాల శ్రీహరి, వ్యాయామ ఉపాధ్యాయురాలు వసుంధర పాల్గొన్నారు.

● ఏఎస్ పేట: విద్యార్థినులు పాఠశాలకు వచ్చి వెళ్లే సమయంలో అప్రమత్తంగా ఉండాలని సంగం సీఐ వేమారెడ్డి సూచించారు. సోమవారం ఆయన శ్రీకొలను గ్రామంలోని జడ్పీ హైస్కూల్‌లో ఎస్ఐ సైదులుతో కలసి విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లడుతూ గుడ్ టచ్, బ్యాడ్ టచ్, బాలికల చట్టాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో మహిళా పోలీసులు, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

'కస్తూర్బా' పరిసరాలను పరిశీలించిన డీఎస్పీ

● వార్డెన్ ఫిర్యాదుతో కేసు నమోదు

కావలి రూరల్, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని మసునూరులో ఉన్న కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయం పరిసరాలను సోమవారం సాయంత్రం డీఎస్పీ శ్రీధర్ పరిశీలించారు. వ్యక్తి గోడదూకి బాలికల విద్యాలయంలోకి రావడంపై హాస్టల్ వార్డెన్ సంధ్యారాణి ఫిర్యాదుతో రూరల్ పోలీసులు కేసు నమోదు చేశారు. విద్యార్థులు ఎలాంటి భయాందోళనలకు గురికావద్దన్నారు. విద్యాలయ ఆవరణలో విద్యుత్ లైట్లు ఏర్పాటు చేయించటంతో పాటు పోలీస్ గస్తీ ఏర్పాటు చేస్తామని డీఎస్పీ హామీ ఇచ్చారు. ఆయన వెంట రూరల్ సీఐ రాజేశ్వరావు, సిబ్బంది ఉన్నారు.

పచ్చని పొలాల జోలికి రావొద్దు



నిరసన తెలుపుతున్న బీసీ నాయకుడు శ్రీనివాసులు, తదితరులు

ఉలవపాడు, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): బీపీసీఎల్ కంపెనీ స్థాపనలో భాగంగా పచ్చని పొలాలను వదులుకోవడానికి సిద్ధంగా లేమని బీసీ కులాల జేఏసీ రాష్ట్ర చైర్మన్ మిరియం శ్రీనివాసులు తెలిపారు. ఈ మేరకు సోమవారం ఆయన స్థానిక రైతులతో కలిసి పొలాల వద్ద నిరసన వ్యక్తం చేశారు. 16గ్రామాలతో కరేడు మేజర్ పంచాయతీ ఏర్పడిందని, సముద్ర తీరంలో వందల ఎకరాల్లో వేరుశన పంట ఏడాడికి రెండు కార్లు పండిస్తారని చెప్పారు. వీటితోపాటు ఆకుకూరలు, కూరగాయల సాగు చేస్తారని తెలిపారు. సాగులో భూములు లాక్కోవడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రయత్నిస్తున్నట్లు వస్తున్న వార్తలు ఆందోళన కలిగిస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు తీర ప్రాంత పల్లెల్లో అధికారులు సర్వే కొలతలు చేపట్టారని పేర్కొన్నారు. ప్రభుత్వం ఈ ఆలోచనలు ఉప సంహ రించుకోవాలని లేని పక్షంలో ప్రజా ఉద్యమం చేస్తామని హెచ్చరించారు.

ప్రభుత్వ భూములు పేదలకు పంచాలి

● ఆర్డీవో కార్యాలయం ఎదుట దళితుల ధర్నా



ఆర్డీవో కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న దళితులు

కావలి, ఫిబ్రవరి10(ఆంధ్రజ్యోతి): పట్టణంలో రియల్‌ఎస్టేట్ వ్యాపారులు ఆక్రమించుకున్న ప్రభుత్వ భూము లను ప్రభుత్వం స్వాధీనం చేసుకుని పేదలకు పంపిణీ చేయాలని దళిత సంఘర్షణ సమితి జిల్లా అధ్యక్షుడు ఎస్.మల్లి డిమాండు చేశారు. ఈ మేరకు సోమవారం ఆర్డీవో కార్యా లయం ఎదుట ధర్నా చేసి ఆర్డీవో ఎం.వంశీక్రిష్ణకు వినతిపత్రం అందజేసి మాట్లాడారు. రియల్‌ఎస్టేట్ వ్యాపారులు కాలువలు, గుంటలు, వంకలు, సీజేఎఫ్ఎస్ తదితర ప్రభుత్వ భూములు వంద ఎకరాలకు పైన ఆక్రమించుకుని లేఅవుట్లలో కలుపుకున్నారన్నారు. ఆ భూములన్నింటినీ స్వాధీనం చేసుకుని పేదల కు పంపిణీ చేస్తే వారి సమస్య తీరుతోందన్నారు. పట్టణంతో పాటు బోగోలు, అల్లూరు మండలాల్లో కూడా ఆక్రమణకు గురైన భూములను స్వాధీనం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో దళితనేతలు జరుగుమల్లి విజయరత్నం, కత్తి ప్రభాకర్, చలంచర్ల లక్ష్మయ్య, శ్రీనివాసులు, భాస్కర్ పాల్గొన్నారు.

గ్రామాల్లో రోడ్లకు మహర్దశ

● షేక్ ఖాదర్‌మస్తాన్, ఏఈ



ఆత్మకూరు, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో రోడ్లకు మహర్దశ పట్టింది. పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం తొలి విడతలో అన్ని గ్రామాల్లో రోడ్ల పనులు చేపట్టామని పంచాయతీరాజ్‌శాఖ ఏఈ షేక్ ఖాదర్ మస్తాన్ తెలిపారు.

ఈ ఇంటర్వ్యూ

? గ్రామాల్లో రోడ్ల నిర్మాణానికి ఎన్ని నిధులు మంజూరు అయ్యాయి.

! మండలంలోని అన్ని గ్రామ పంచాయతీలకు మెటీరియల్, వేజ్ కాంపోనెంట్ ద్వారా మొదటి విడతలో ఉపాధి నిధుల కింద రూ. 1.76 కోట్లు మంజూరయ్యాయి.

? కేటాయించిన నిధులతో ఎన్ని కిలోమీటర్ల మేర సీసీ రోడ్ల నిర్మాణ పనులు చేపట్టారు.

! మండలానికి కేటాయించిన నిధులతో మొత్తం 38పనులు మంజూరయ్యాయి. ఇప్పటికి 29 పనులు పూర్తిచేశాం. మిగిలినవి వివిధ దశల్లో నిర్మా ణంలో ఉన్నాయి.

? రోడ్డు నిర్మాణ పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటిస్తున్నారా.

! గ్రామాల్లో చేపట్టిన రోడ్ల నిర్మాణ పనులను సచివాలయం ఇంజనీరింగ్ సిబ్బంది దగ్గరుండి పర్యవేక్షించారు. నిర్మాణం అనంతరం క్వాలిటీకంట్రోల్ విభాగం నాణ్యతను నిర్ధారించిన తరువాతే సంబంధిత బిల్లులు మంజూరవుతాయి. కావున నిర్దేశించిన ప్రమాణాల గురించి అవగాహన కల్పించి పనులు చేపట్టేలా చూశాం.

న్యూస్ బాక్స్

వేణుగోపాలస్వామి రథం తయారీకి సన్నాహాలు

ఉలవపాడు, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): స్థానిక శ్రీవేణుగోపాల స్వామి నూతన రథం తయారు చేయించేందుకు సోమవారం దేవదాయ శాఖ ఇంజనీరు అధికారులు పాత రథం కొలతలు తీసుకుననట్లు సోమవారం ఆలయ ఈవో శ్రీనివాస్ తెలిపారు. 90 ఏళ్లనాటి రథం పూర్తిగా శిథిలావస్థతకు చేరుకోవడంతో తయారీకి కావాల్సిన ప్రణాళిక అయిన వెంటనే రూ.80లక్షల అంచనాలతో నూతన రథం పనులు మొదలు పెట్టనున్నట్లు ఈవో తెలిపారు.

కూలీల పనిదినాలు పెంచాలి

కావలి, ఫిబ్రవరి10 (ఆంధ్రజ్యోతి): కేంద్ర బడ్జెట్‌లో మహాత్మాగాంధీ ఉపాధిహామీ నిధులు పెంచి ఉపాధి కూలీలకు పని దినాలు పెంచాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్రకమిటీ సభ్యులు మాల్యాద్రి డిమాండు చేశారు. ఈమేరకు సోమవారం ఆర్డీవో ఎం వంశీక్రిష్ణకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సంఘం మండల కార్యదర్శి రాధాక్రిష్ణ పాల్గొన్నారు.

భూ సమస్యలు పరిష్కరించాలి

వింజమూరు, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి) : మండలంలో భూ సమస్యలను రెవెన్యూ అధికారులు త్వరితగతిన పరిష్కరించాలని తెలుగుదేశం పార్టీ జిల్లా కార్యదర్శి చల్లా వెంకటేశ్వర్లు యాదవ్ సోమవారం తహసీల్దారును కోరారు. ఎమ్మెల్యే కాకర్ల సురేష్ ఆదేశం మేరకు తహసీల్దారును కలిసి వినతి పత్రం అందచేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు గంగపట్ల వెంగయ్య, నీలం పెరుమాళ్, శ్రీను, చిలకల వెంకటరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

'పరీక్షా పే'పై అవగాహన

ఉదయగిరి, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): పరీక్షా పే కార్యక్రమం విద్యార్థుల్లో మానసిక వత్తిడిని తగ్గించి ప్రేరణ, ఆత్మస్థైర్యాన్ని నింపుతుందని ఎంఈవో-2 శ్రీనివాసులు పేర్కొన్నారు. సోమవారం స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు పరీక్షా పే కార్యక్రమంపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు బాల కేశవులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

దివ్యాంగుల సర్టిఫికెట్ల పరిశీలన

ఉదయగిరి, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో సోమవారం కేంద్ర ప్రభుత్వ సంస్థ సంయుక్త ప్రాంతీయ కేంద్రం ఆధ్వర్యంలో దివ్యాంగులు, వయోవృద్ధుల శిబిరం నిర్వహించారు. ఈసందర్భంగా దివ్యాంగుల సంక్షేమ సంఘం అసిస్టెంట్ డైరెక్టరు మహమ్మద్‌అయూబ్ దివ్యాంగుల సదరం సర్టిఫికెట్లు పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ త్వరలో మూడుచక్రాల వాహనాలు, వినికిడి యంత్రాలు, వీల్‌చైర్ తదితర ఉపకరణాలు పంపిణీ చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ప్రత్యేకాధికారులు దేవి, సంధ్యారాణి, ఏవో పద్మజ, జూనియర్ అసిస్టెంట్ సమద్, సీఆర్పీలు తదితరులు పాల్గొన్నారు.

యువకుల రక్తదానం

కందుకూరు, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): స్థానిక జడ్పీ బాలికల ఉన్నత పాఠశాల సమావేశ మందిరంలో సోమవారం స్థానిక రక్తదాతల సమూహం, సక్షమ్ ఆధ్వర్యంలో నిర్వహించిన రక్తదాన శిబిరంను కందుకూరు డీఎస్పీ సీహెచ్‌వీ బాలసుబ్రహ్మణ్యం ప్రారంభించారు. శిబిరంలో 30మంది యువకులు పాల్గొని రక్తదానం చేశారు. ఒంగోలు రెడ్‌క్రాస్ సొసైటీ రక్తనిల్వ కేంద్రం కోసం ఈ రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో కందుకూరు రెడ్‌క్రాస్ సబ్‌బ్రాంచ్ చైర్మన్ చెన్నా రామాంజనేయులు, పూరిపర్తి శ్రీనివాసరావు, బొజ్జా చంద్రమోహన్, కనపర్తి మల్లికార్జున, ఓరుగంటి రమేష్, చన్నా రంగనాయకులు పాల్గొన్నారు.

ఈఎస్ఐ ఆసుపత్రి ఏర్పాటుపై త్వరగా నిర్ణయం తీసుకోండి: వీపీఆర్

నెల్లూరు (హరనాథపురం) ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): నెల్లూరులో వంద పడకల ఈఎస్ఐ ఆసుపత్రి ఏర్పాటు చేసేలా త్వరగా నిర్ణయం తీసుకోవాలని ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి కోరారు. సోమవారం ఢిల్లీలో ఆయన ఈఎస్ఐసీ డైరెక్టర్ జనరల్ అశోక్‌కుమార్‌సింగ్‌ను ఆయన కార్యాలయంలో కలిసి ఈ మేరకు విజ్ఞప్తి చేశారు. ఆసుపత్రి ఏర్పాటుపై వారు సుదీర్ఘంగా చర్చించారు. అలాగే రాష్ట్రంలో జిల్లాల వారీగా పెరిగిన అటవీ విస్తీర్ణాన్ని వివరించాలని లోక్‌సభలో వీపీఆర్ ప్రశ్నించారు. ఇందుకు అటవీ, వాతావరణ మార్పుల మంత్రిత్వశాఖ సహాయమంత్రి కీర్తి వర్ధన్ సింగ్ సమాధానం ఇస్తూ ఏపీలోని విజయనగరం జిల్లాలో అత్యధికంగా 35.35 శాతం, నెల్లూరు జిల్లాలో 17.77శాతం, కోనసీమ జిల్లాలో 10.68 శాతం అటవీ విస్తీర్ణం పెరిగిందని తెలిపారు.



ఈఎస్ఐ డైరెక్టర్‌ని కలిసిన ఎంపీ వేమిరెడ్డి

మూర్ఛవ్యాధిపై అప్రమత్తంగా ఉండాలి

నెల్లూరు (వైద్యం) ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): మూర్ఛవ్యాధిపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని ఎనెల్ ఆసుపత్రి న్యూరాలజిస్ట్ డాక్టర్ హరితకుమారి తెలిపారు. సోమవారం ప్రపంచ మూర్ఛ వ్యాధి దినోత్సవాన్ని ఆ ఆసుపత్రిలో నిర్వహిం చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మూర్ఛవ్యాధిపై మూఢ నమ్మకాలు విడనాడాలన్నారు. మూర్ఛవ్యాధి వచ్చిన వెంటనే ప్రాథమిక వైద్యం అందించి, వెంటనే ఆసుపత్రికి తీసుకు రావాలని తెలిపారు. కార్యక్రమంలో ఆసుపత్రి వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.



అవగాహన కలిగిస్తున్న డాక్టర్ హరితకుమారి

పొలంలోకి దూసుకెళ్లిన కళాశాల బస్సు

● ముగ్గురు విద్యార్థులకు గాయాలు

బుచ్చిరెడ్డిపాళెం, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): కృష్ణచైతన్య విద్యాసంస్థల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న గుత్తికొండ కళాశాల బస్సు సోమవారం మండలంలోని పెనుబల్లి-మినగల్లు మార్గంలో అదుపుతప్పి పొలంలోకి దూసుకెళ్లింది. అయితే తాటిచెట్టు అడ్డురావడంతో పెద్దప్రమాదం తప్పి ఓ పక్కకు ఒరిగిపోయింది. ఈ ఘటనలో బస్సులో ఉన్న డిగ్రీ సెకండియర్ విద్యార్థులు నిరీష, ఎస్‌కే.మస్తానమ్మ(అంబ్రీన్), పవన్‌లు బస్సులో కూర్చున వైపు నుంచి మరో వైపుకు పడిపోవడంతో తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటనతో విద్యార్థులు భయాందోళనతో కేకలు వేశారు. ఎలాగోలా బస్సులో నుంచి వరి పొలంలోకి దూకేశారు. ప్రమాదాన్ని గమనించిన చుట్టుపక్కల రైతులు ఘటనా స్థలానికి చేరుకుని విద్యార్థులను కర్రల సాయంతో రోడ్డుపైకి తీసువచ్చారు. క్షతగాత్రులను బుచ్చిలోని ఆసుపత్రికి తరలించారు. అయితే ఈ ప్రమాదం బస్సు కట్టలు విరగడంవల్లే జరిగిందని భావిస్తుండగా కళాశాల సిబ్బంది మాత్రం ట్రాక్టర్ అడ్డురావడంతో ఈ ప్రమాదం జరిగినట్లు చెప్పడం విశేషం.



పొలంలోకి ఒరిగిన బస్సు

బద్దెవోలులో సీఐ విచారణ

మనుబోలు, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బద్దెవోలు దళితవాడలో కుళాయి విషయమై ఆదివారం ఇరువర్గాలు ఘర్షణ పడి 8 మంది గాయపడిన విషయం విదితమే. సోమవారం రాత్రి పొదలకూరు సీఐ శివరామకృష్ణారెడ్డి, ఎస్ఐ శివరాకేష్‌లు బద్దెవోలు కాలనీకి చేరుకుని విచారణ చేపట్టారు. రాత్రికి పోలీస్ పికెట్ ఏర్పాటు చేయించారు.

రైతుల సంక్షేమానికి కృష్ణపట్నం పోర్టు కృషి

ముత్తుకూరు, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): అదానీ కృష్ణపట్నం పోర్టు ప్రభావిత గ్రామాల రైతులకు పలు సేవా కార్యక్రమాలు చేపడుతున్నట్లు సీఈవో జగదీష్‌పటేల్ తెలిపారు. సోమవారం ఫౌండేషన్ భవన ప్రాం గణంలో జరిగిన రైతు స్నేహ బంధనం కార్యక్రమంలో కృష్ణపట్నం ఫార్మర్ ప్రొడ్యుసర్ కంపెనీ లిమిటెడ్‌తో అనుబంధిం చిన రైతులకు ట్రాక్టర్, ఈ-రిక్షా, మోటారు అను సంధాన పురుగు మందుల స్ప్రేయర్లు వంటి వ్యవసాయ పరికరాలను పంపిణీ చేశారు. సీఎస్ఆర్ హెడ్ రాజేష్ రంజన్, పోర్టు కార్పొ రేట్ వ్యవహారాల హెడ్ మృత్యుంజయరామ్, హెచ్‌ఆర్ అండ్ అడ్మిన్ హెడ్ అనురాగ్ ద్వివేది, సెక్యూరిటీ హెడ్ వెంకటేష్ భాస్కర్, ఎడ్యుకేటర్ రాధిక, కేఎఫ్‌పీసీఎల్ ప్రతినిధులు పాల్గొన్నారు.

నెల్లూరు మత్స్యశాఖ అధికారులపై విచారణకు ఆదేశాలు

అమరావతి, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరించారన్న అభియోగాలపై నెల్లూరు జిల్లా మత్స్యశాఖ అధికారులపై ప్రభుత్వం విచారణకు ఆదేశించింది. ప్రస్తుత జిల్లా అధికారి నాగేశ్వరరావుతో పాటు గతంలో అక్కడ పని చేసి, రిటైరైన సీతారామరాజు, సాల్మన్‌రాజు, శ్రీహరిపై పలు అభియోగాలు వచ్చాయి. విచారణ అధికారిగా ఏపీ లైవ్‌స్టాక్ డెవలప్‌మెంట్ ఏజెన్సీ సీఈవో శ్రీనివాసరావును నియమించింది. మూడు నెలల్లో విచారణ నివేదిక ఇవ్వాలని ఆదేశిస్తూ ప్రభుత్వం సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది.

ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలి

నెల్లూరురూరల్, ఫిబ్రవరి10, (ఆంధ్రజ్యోతి): వరికోతలు మొదలైనందున ప్రభుత్వం వెంటనే ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం వారు నెల్లూరు రూరల్ తహసీల్దారు కార్యాలయం వద్ద ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ పార్టీ మండల కార్యదర్శి పూడిపర్తి జనార్దన్, పార్టీ నేత ఆలూరు తిరుపాలు మాట్లాడారు. ప్రభుత్వ మద్దతు ధరకు ధాన్యం సేకరించాలని కోరారు. ఐదు కొనుగోలు కేంద్రాలను అందుబాటులోకి తీసు కురావాలని తెలిపారు. అనంతరం తహసీల్దారు లాజరస్‌కు వినతి పత్రం అందచేశారు.



నెల్లూరు రూరల్ తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న సీపీఎం నాయకులు

ధాన్యానికి గిట్టుబాటు ధర కల్పించాలి

తోటపల్లిగూడూరు : రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలని జిల్లా వ్యవసాయ కార్మిక సంఘం కార్యదర్శి పుల్లయ్య పేర్కొన్నారు. సోమవారం స్థానిక తహసీల్దారు కార్యాలయ ఎదుట వ్యవసాయ కార్మిక సంఘం, సీఐటీయూ, సీపీఎం నాయకులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా పుల్లయ్య మాట్లాడుతూ ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించి, గ్రేడ్-ఏ రకం ధాన్యానికి పుట్టికి కనీస మద్దతు ధర రూ.19,720 ఇవ్వాలని, సాధారణ రకం పుట్టికి రూ.19,500 చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు లక్ష్మయ్య, రాజా, శ్రీనివాసులు, బండి సౌరీ, తదితరులు పాల్గొన్నారు.

● బుచ్చిరెడ్డిపాళెం : ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు పులిగండ్ల శ్రీరాములు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం స్థానిక తహసీల్దారు కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టి తహసీల్దారు వెంకటేశ్వర్లు, మండల వ్యవసాయాధికారి సురేంద్రరెడ్డికి వినతిపత్రాలు అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 22న నెల్లూరులో ర్యాలీ నిర్వహించి కార్యాలయం ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈ ర్యాలీకి జిల్లాలో రైతు సంఘాలు, రైతు నాయకులు, రైతులు వేలాదిగా తరలి రావాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు గండవరపు శ్రీనివాసులు, మల్లికార్జున, మునుస్వామి, అంకయ్య, రమణయ్య, సురేష్, కోటయ్య తదితరులు పాల్గొన్నారు.

అందుబాటులోకి ధాన్యం కొనుగోలు కేంద్రాలు

నెల్లూరురూరల్ : రబీ సీజన్‌లో వరికోతలు ప్రారంభమయినందున ప్రాంతాల వారీగా ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రభుత్వం త్వరలో ఏర్పాటు చేయనున్నట్లు టీడీపీ నేత కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి అన్నారు. 'గడప గడపకు'. కార్యక్రమంలో భాగంగా మండలంలోని కొం డ్లపూడిలో సోమవారం ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతులు నష్టపోకుండా కనీస మద్దతు ధరకు ధాన్యం కొనుగోలు చేసేందుకు సేకరణ కేంద్రాలు త్వరలో ఏర్పాటు కానున్నాయన్నారు. గ్రామంలోని సమస్యలు తెలియచేయాలని ఆయన ఇంటింటి ప్రచారంలో కోరారు.

● కొమ్మరపూడికి చెందిన వైసీపీ నేత ముత్తంగి వెంకటేశ్వర్లు, ఆయన మిత్రబృందం టీడీపీ తీర్థం పుచ్చుకుంది. రూరల్ ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి, టీడీపీ నేత గిరిధర్ రెడ్డిల సమక్షంలో ఎమ్మెల్యే కార్యాలయంలో వారు పార్టీ కండువా కప్పుకున్నారు.

ఫార్మర్ రిజిస్ట్రేషన్‌పై అవగాహన సదస్సు

ముత్తుకూరు, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): మండల తహసీల్దారు కార్యాలయంలో సోమవారం వ్యవసాయ సిబ్బంది, వీఆర్‌వోలకు రైతులకు ఫార్మర్ రిజిస్ట్రేషన్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డిప్యూటీ తహసీల్దారు ప్రదీప్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేపడుతున్న ఈ కార్యక్రమాన్ని రైతులు ఉపయోగించుకుని 11 అంకెల ఐడీని పొందాలన్నారు. వీఆర్‌వోలు గ్రామాల్లో రైతులందరికీ అవగాహన కల్పించి ఈనెల 25వ తేదీలోపు పూర్తి చేయాలన్నారు. రైతులు ఆధార్‌కార్డు, ఆధార్‌నెంబరుకు లింకైన మొబైల్, భూమి పాసుపుస్తకం తీసుకుని సచివాలయంలోని వ్యవసాయ సిబ్బందిని కలిసి ఐడీని పొందాలని మండల వ్యవసాయాధికారి జోత్స్నారాణి సూచించారు.

బురాన్‌పూర్‌లో వ్యక్తి మృతి

వెంకటాచలం, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని చెముడుగుంట పంచాయతీ బురాన్‌పూర్‌లో సోమవారం ఓ వ్యక్తి మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు... ఒడిశా రాష్ట్రం గంజాం జిల్లా మదనాపురంకు చెందిన అంజరాని ఇంద్ర(48) గత కొన్నేళ్ల నుంచి బురాన్‌పూర్‌లో నివాసం ఉంటున్నాడు. ఆదివారం తన ఇంట్లో మద్యం పూటుగా సేవించి ఆహారం తినకపోవడం వల్ల మృతి చెందాడు. మృతుడి కుమారుడు అనిల్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

గురుకులంలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

బుచ్చిరెడ్డిపాళెం, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రామచంద్రాపురంలో ఉన్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకులంలో 2025-26 విద్యా సంవత్సరానికి సంబంధించి 5వ తరగతి, ఇంటర్ ఫస్ట్ ఇయర్, (ఇంగ్లీష్ మీడియం)లో ప్రవేశానికి దరఖాస్తులు సేకరిస్తున్నట్లు గురుకులం ప్రిన్సిపాల్ గీత సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఆన్‌లైన్ విధానంలో మార్చి 6వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చని ఆమె పేర్కొన్నారు.

జిల్లాస్థాయి కబడ్డీ పోటీల ప్రారంభం

నెల్లూరు(విద్య), ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): నగరంలోని ఏసీ సుబ్బారెడ్డి స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో సోమవారం కబడ్డీ క్రీడాకారుడు వీ.సునీల్‌కృష్ణ మెమోరియల్ ఇన్విటేషన్ జిల్లాస్థాయి కబడ్డీ పోటీలు ప్రారంభమయ్యాయి. ఏఆర్ అడిషనల్ ఎస్పీ జీ. మునిరాజ్ ఈ పోటీలను ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ పోటీలకు హాజరైన జట్లు క్రీడాస్ఫూర్తితో ఉత్తమ ఆటతీరును ప్రదర్శించాలన్నారు. నిర్వాహకులు షేక్.హనీఫ్ మాట్లాడుతూ రాత్రింబవళ్లు జరిగే ఈ పోటీలు మూడు రోజులపాటు జరుగుతాయని, విజేత జట్లకు నగదు ప్రోత్సాహకాలు అందచేస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఏఆర్ డీఎస్పీ చంద్రమోహన్, హోంగార్డ్స్ డీఎస్పీ ఎం.వెంకటరమణ, డీటీసీ ఆర్ఐ శ్రీనివాసరెడ్డి, ఎంటీవో ఆర్ఐవో అంకమరావు, అడ్మిన్ ఆర్ఐ జే.హరిబాబు, వెల్ఫేర్ ఆర్ఐ రాజారావు, హోంగార్డ్స్ ఆర్ఐ పౌల్‌రాజు, డీఎస్‌డీవో ఆర్‌కె.యతిరాజ్ పాల్గొన్నారు.



కబడ్డీలో తలపడుతున్న క్రీడాకారులు

మరుగుదొడ్ల పక్కన బస్‌స్టాప్‌ను మార్చాలి

● జనసేన ఆధ్వర్యంలో సంతకాల సేకరణ

వెంకటాచలం, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరు ఆర్టీసీ బస్టాండ్‌లో సర్వేపల్లి, కసుమూరు, గొలగమూడి బస్సులు నిలిపే బస్‌స్టాప్‌ను మార్చాలని సర్వేపల్లి నియోజకవర్గ జనసేన పార్టీ సమన్వయకర్త బొబ్బేపల్లి సురేష్‌నాయుడు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం ప్రజల నుంచి సంతకాల సేకరణ కార్యక్రమాన్ని చేపట్టారు. అనంతరం బస్‌స్టాప్‌ను పరిశీలించిన ఆయన మాట్లాడుతూ సర్వేపల్లి, కసుమూరు, గొలగమూడి గ్రామాల బస్సులు నిలిపే నెల్లూరు ప్రధాన ఆర్టీసీ బస్టాండ్‌లో బస్‌స్టాప్ పక్కనే ఉన్న మరుగుదొడ్ల నుంచి తీవ్రమైన దుర్వాసన వస్తుందని, ప్రయాణికులు కూర్చునేందుకు కనీసం ఫ్యాన్లు కూడా లేవని, దోమల బెడద ఎక్కువగా ఉందన్నారు. వర్షాకాలంలో నిల్చుకునే సౌలభ్యం కూడా లేదన్నారు. ఆర్టీసీ ఉన్నతాధికారులు వెంటనే స్పందించి ఇక్కడి నుంచి బస్‌స్టాప్‌ను మార్చాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో గుమ్మినేని వాణిభవానీ, సందూరి శ్రీహరి, రహీమ్, అశోక్, సుమన్, చిన్న, శ్రీను, నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

బాధితులకు భరోసా ఇవ్వండి : ఏడీసీ

నెల్లూరు(సిటీ), ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): వివిధ సమస్యలపై వినతులు అందచేస్తున్న బాధితులకు భరోసా ఇచ్చేలా పరిష్కారాలు ఉండాలని ఏడీసీ నందన్ తెలిపారు. సోమవారం ఎన్ఎంసీ కార్యాలయంలో నిర్వహించిన పీజీఆర్ఎస్‌లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా నగర ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. అనంతరం మాట్లాడుతూ అధికారులకు అందిన ప్రతీ వినతిపై స్పష్టమైన స్పందన ఉండాలన్నారు. క్షేత్రస్థాయిలో పరిశీలించి వీలైనంత వరకు శాశ్వత పరిష్కారం చూపాలన్నారు. అనంతరం సచివాలయ ఉద్యోగులతో సమావేశం నిర్వహించి, తాగునీటి కుళాయి పన్నుల వసూళ్లలో వేగం పెంచాలని ఆదేశించారు.



సమస్యను తెలుసుకుంటున్న ఏడీసీ నందన్

అగస్త్య మహర్షి గొప్ప రుషి

● ప్రాచీన తెలుగు విశిష్ట అధ్యయన కేంద్రం సంచాలకుడు సంపత్‌కుమార్

వెంకటాచలం, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి) : హిందూ చరిత్రలో అగస్త్య మహర్షి ఒక గొప్ప రుషి అని ప్రాచీన తెలుగు విశిష్ట అధ్యయన కేంద్రం సంచాలకులు మాడభూషి సంపత్‌కుమార్ కొనియాడారు. మండలంలోని చవటపాళెం పంచాయతీ సరస్వతి నగర్‌లో ఉన్న ప్రాచీన తెలుగు విశిష్ట అధ్యయన కేంద్రంలో సోమవారం అగస్త్య మహర్షి - సాహిత్య సమాలోచన అనే జాతీయ సదస్సును నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ సెల్వ షణ్ముగం, డాక్టర్ గాలి గుణశేఖర్, డాక్టర్ జీవి పూర్ణచందు, డాక్టర్ టేకుమళ్ల వెంకటప్పయ్య, డాక్టర్ పెరుగు రామకృష్ణ తదితరులున్నారు.

గంగమ్మకు బంగారు సరుడు బహూకరణ

పొదలకూరు, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి) : పొదలకూరులోని శివాలయం వీధిలో వెలసి ఉన్న గ్రామ శక్తి స్వరూపిణి గంగమ్మతల్లికి మండలంలోని ఆర్‌వైపాలెం గ్రామానికి చెందిన గోపిదేశి పెంచలయ్య, రమాదేవి, వారి కుటుంబ సభ్యులు గోపిదేశి పవన్, హేమలత, గంగరాజు, పవిత్రలు మూడు సవర్లు బంగారు సరుడు బహూకరించారు. సోమవారం ఆలయంలో అమ్మవారికి కుంకుమ పూజలు నిర్వహించి, బంగారు సరుడును అలంకరించి మొక్కులు తీర్చుకున్నారు. ఈ కార్యక్రమంలో పెద్దగొల్ల మద్దిరిళ్ల నరసింహులుయాదవ్, పడ్డాల అంకయ్య, రాము, పూజారి పద్మమ్మ, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో మాజీ ఎంపీపీకి గాయాలు

మనుబోలు, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): మనుబోలు ఎస్‌బీఐ సమీపంలో జాతీయ రహదారిపై సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మాజీ ఎంపీపీ అడపాల బాలచంద్ర ప్రతాప్‌కు గాయాలయ్యాయి. ఆయన రోడ్డు దాటుతుండగా గూడూరు మార్గంలో వస్తున్న వ్యాను ఢీకొంది. అటుగా వెళుతున్న సీఐ శివరామకృష్ణారెడ్డి ప్రమాదస్థలికి వచ్చి పరిశీలించారు. క్షతగాత్రుడిని చికిత్స నిమిత్తం గూడూరు ఏరియా ఆసుపత్రికి తరలించి అక్కడి నుంచి నెల్లూరుకు తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

జొన్నవాడ ఆలయంలో బహిరంగ వేలం

బుచ్చిరెడ్డిపాళెం, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జొన్నవాడ మల్లికార్జునస్వామి, కామాక్షితాయి ఆలయంలో సోమవారం కొబ్బరి చిప్పలు, వస్త్రములు, తదితరాలు సేకరించుకునే హక్కు కల్పించేందుకు ఆలయ టూరిజం గెస్ట్‌హౌస్‌లో బహిరంగ వేలం నిర్వహించారు. కొబ్బరి చిప్పలు సేకణకు రూ.24,00,00, వస్త్రములు సేకరించుకునేందుకు రూ.25,15,000లు పలికింది. తలనీలాలు సేకరణ, పాదరక్షలు బద్రపరచడం, చాపలు, పీటలు, జంకాణాలు అద్దెకు ఇచ్చుకునే పాటలు వాయిదా వేసినట్లు ఆలయ ఈవో ఏవీ శ్రీనివాసులురెడ్డి తెలిపారు. టెండర్లు, వేలంపాటలను నరసింహకొండ ఆలయ ఈవో వేమూరి గోపి పర్యవేక్షించారు.

కోళ్ల వ్యర్థాల వాహనం పట్టివేత

బుచ్చిరెడ్డిపాళెం, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జొన్నవాడ నుంచి దామరమడుగు వెళ్లే పొర్లుకట్ట ప్రాంతంలో సోమవారం ఓ కోళ్ల వ్యర్థాల వాహనంను ఎస్ఐ సంతోష్‌రెడ్డి పట్టుకున్నారు. ఈమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

దర్గాలో వస్త్రాల పంపిణీ

నెల్లూరురూరల్, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి పెళ్లి రోజును పురస్కరించుకుని సోమవారం బారాషహీద్ దర్గా వద్ద పేద మహిళ లకు టీడీపీ మైనార్టీ నా యకులు వస్త్రాలు పంపిణీ చేశారు. అనంతరం దువా చేపట్టారు. కార్యక్రమంలో దర్గా చైర్మన్ ఖాదర్‌బాషా, నాయకులు షంషుద్దీన్ పాల్గొన్నారు.



మహిళలకు వస్త్రాలు అందచేస్తున్న నాయకులు

వైభవంగా అభయ గణపతి శాంతి కల్యాణం

మనుబోలు, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కాగితాలపూరులో సోమవారం ఘనంగా అభయ గణపతి శాంతి కల్యాణం నిర్వహించారు. గ్రామంలో అభయ గణపతి ప్రతిష్ఠ కార్యక్రమాలను మూడు రోజులుగా నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా స్వామి మూలవిరాట్‌ను సుముహూర్తంలో ప్రతిష్ఠించారు. అనంతరం సిద్ది, బుద్ది సమేత అభయగణపతికి శాంతి కల్యాణం నిర్వహించారు. 25 అడుగుల ఏకశిల ధ్వజస్తంభంను ప్రతిష్ఠించారు. కాగితాలపూరు, లక్ష్మీనరసింహపురం, పిడూరు గ్రామస్థులు తరలివచ్చారు.



కల్యాణం నిర్వహిస్తున్న వేదపండితులు

నులిపురుగులు నివారిస్తేనే ఆరోగ్యం

నెల్లూరురూరల్, ఫిబ్రవరి10, (ఆంధ్రజ్యోతి) చిన్నారుల్లో నులుపురుగులను నివారిస్తేనే నిండు ఆరోగ్యం సొంతమవుతుందని సౌత్‌మోపూరు పీహెచ్‌సీ వైద్యులు అర్షద్ హుస్సేన్, రవీంద్రనాథ్‌రెడ్డి అన్నారు. సోమవారం పీహెచ్‌సీ పరిధిలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లోని విద్యార్థులకు నులిపురుగుల నివారణ మాత్రలను అందచేశారు. ఆయన వారు మాట్లాడుతూ ప్రతీ రోజు వ్యక్తిగత శుభ్రత పాటించడంతోపాటు బహిరంగ ప్రాంతాలలో మల, మూత్రవిసర్జన చేయకూడని తెలిపారు.

జాతీయ నులి పురుగుల దినోత్సవం

ఇందుకూరుపేట : మండలంలోని జగదేవిపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సోమవారం జాతీయ నులి పురుగుల దినోత్సవం నిర్వహించారు. వైద్యాధికారులు డాక్టర్ బ్రహ్మేశ్వర్ నాయుడు, డాక్టర్ కిషోర్‌కుమార్‌లు ఎస్సీ, ఎస్టీ కాలనీలు, చేపలు, రొయ్యల చెరువులు, ఇటుకురాయి బట్టీలను సందర్శించి పిల్లలకు ఆల్బెండజోల్ టాబ్లెట్స్ మింగించారు. అలాగే ఆదెమ్మసత్రం జడ్పీ హైస్కూల్, ఇందుకూరుపేట, కొత్తూరు గునపాటి సుబ్బరామిరెడ్డి, రుక్మిణమ్మ జడ్పీ హైస్కూల్‌లో విద్యార్థులకు మందులు మింగించారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో నాయక్, హెల్త్ ఎడ్యుకేటర్ సుధాకర్‌రావు, హెచ్ఈవో శ్రీనివాసులు, హెల్త్ సూపర్‌వైజర్స్ సతీష్‌బాబు, ఫార్మసీ ఆఫీసర్ చంద్రశేఖర్ పాల్గొన్నారు.

జాతీయ తైక్వాండోలో వరుణ్‌కు కాంస్య పతకం

నెల్లూరు(విద్య), ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): ఉత్తరాఖాండ్‌లో జరిగిన 38వ జాతీయ తైక్వాండో పోటీల్లో నెల్లూరుకి చెందిన టీ.వరుణ్ ఉత్తమ ప్రతిభ కనబరిచి కాంస్య పతకం సాధించారు. ఇప్పటికే పలు జాతీయ, రాష్ట్ర పోటీల్లో పతకాలు సాధించిన వరుణ్ మరోసారి జాతీయ పోటీల్లో పతకం సాధించడం గర్వకారణమని తైక్వాండో అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు హర్షవర్ధన్ హర్షం వ్యక్తం చేశారు. ఇదే ఉత్సాహంతో భవిష్యత్‌లో మరిన్ని విజయాలు సాధించాలని తెలిపారు. ఈ సందర్భంగా హర్షవర్ధన్‌ను సోమవారం కోచ్‌లు చరణ్‌తేజ, శ్రీనివాసులు అభినందించారు.



పతకాలతో వరుణ్

న్యూస్ బాక్స్

రాజరాజేశ్వరి ఆలయంలో రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి

నెల్లూరు (సాంస్కృతికం), ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి - సుజితమ్మ దంపతులు సోమవారం నగరంలోని రాజరాజేశ్వరి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా శ్రీధర్‌రెడ్డి మాట్లాడుతూ 1989లో తన వివాహం అయిందని,అప్పటి నుంచి ప్రతి ఏటా అమ్మవారిని దర్శించుకుంటున్నామని తెలిపారు. ఈ సందర్భంగా టీడీపీ కార్యకర్త సంభాయపాలెం బాలాజీరెడ్డి ఆధ్వర్యంలో నగరంలోని పలు కూడళ్ల వద్ద వివాహ వార్షికోత్సవ ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. పేదలకు అన్నదానం, పండ్లు, ఆహార పొట్లాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ కార్యకర్తలు అనీల్, సాయి, భాస్కర్, తదితరులు పాల్గొన్నారు.

నష్టపరిహారం ఇప్పించండి

నెల్లూరు (సాంస్కృతికం) ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి) : రాపూరు మండలం గోనుపల్లిలో తనకున్న 2.50ఎకరాల్లోని 190 నిమ్మచెట్లను పొదలకూరు మండలం అంకుపల్లికి చెందిన ఏఆర్ కానిస్టేబుల్ బొడ్డు చంద్రశేఖర్, అతని తండ్రి పెద్దవీరాస్వామి, తమ్ముడు రాజలు అక్రమంగా నరికివేశారని బాధితుడు బొడ్డు చిన్నవీరాస్వామి తెలిపారు. తనకు నష్టపరిహారం ఇప్పించాలని ఆయన కోరారు. ఈ మేరకు సోమవారం ఆయన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో జేసీ, ఎస్పీకి వినతిపత్రాలు అందజేశారు. తాను కూలీలతో పొలం పనులు చేయబోతే అడ్డుకుని భయభ్రాంతులకు గురిచేశారని తెలిపారు. తమకు జరిగిన రూ.20 లక్షల నష్టపరిహారం ఇప్పించి, తన కుటుంబానికి ప్రాణరక్షణ కల్పించాలని ఆయన అధికారులను వేడుకున్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

నెల్లూరు (జడ్పీ),ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): నగరంలోని హరనాథపురం సబ్‌స్టేషన్ పరిధిలో విద్యుత్ లైన్లు మరమ్మతులు చేస్తున్నందున మంగళవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఈఈ ఎం. శ్రీధర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. యుకోనగర్, డీఎస్‌కే గార్డెన్ ప్రాంతాల్లో సరఫరా ఉండదని తెలిపారు.

14న పీడీఎస్‌యూ సంస్థల విలీన సభ

నెల్లూరు(విద్య), ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): నగరంలో పాత అనితా హాలులో ఈనెల 14న పీడీఎస్‌యూ సంస్థల విలీన సభను నిర్వహించనున్నట్లు జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎం.సునీల్, షారూక్ తెలిపారు. నగరంలోని పీడీఎస్‌యూ కార్యాలయంలో సోమవారం సభా పోస్టర్లను విడుదల చేసి మాట్లాడారు. అందరికీ సమాన విద్య కావాలన్న నినాదంతో ఐదుదశాబ్దాలుగా పీడీఎస్‌యూ పోరాటాలు చేస్తోందన్నారు. అయితే చిన్నచిన్న కారణాలతో తమ నుంచి విడిపోయిన మరో సంఘం కూడా ఇకపై కలిసి పనిచేసేలా సభను ఏర్పాటు చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో నేతలు నాగరాజు, ఆశీర్, నవీన్, హర్ష, చరణ్, వంశీ తదితరులు పాల్గొన్నారు.

నేడు ఎమ్మెల్యే కురుగొండ్ల రాక

సైదాపురం, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి) : మండలంలో అభివృద్ధి పనులను ప్రారంభించేందుకు ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ మంగళవారం వస్తున్నట్లు మండల టీడీపీ అధ్యక్షుడు కట్టా మోహన్‌కృష్ణారెడ్డి సోమవారం తెలిపారు. వేములచేడు, కమ్మవారిపల్లి, సైదాపురం గ్రామాల్లో సీసీ రోడ్ల నిర్మాణాలను ఎమ్మెల్యే ప్రారంభిస్తారన్నారు. టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు పాల్గొని ఎమ్మెల్యే పర్యటనను విజయవంతం చేయాలని కోరారు.

చట్టాలపై అవగాహన సదస్సు

నెల్లూరు(క్రైం), ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): నగరంలోని రామచంద్రాపురంలో ఉన్న హిమాలయ పాఠశాలలో సోమవారం నవాబుపేట పోలీసులు కొత్త చట్టాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఇన్‌స్పెక్టర్ అన్వర్‌బాష మాట్లాడుతూ విద్యార్థులు, మహిళలు సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని, లాకింగ్ హౌస్ మానిటర్ సిస్టం ఉపయోగాలను తెలుసుకోవాలన్నారు. విద్యార్థి దశ నుంచే చట్టాలపై అవగాహన పెంచుకొని, కుటుంబసభ్యులకు, చుట్టుపక్కల వారికి వివరించాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచారం

బుచ్చిరెడ్డిపాళెం, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): మాఘమాసంలో వచ్చే శివరాత్రి పర్వదినం విశిష్టత గురించి త్రైత సిద్ధాంత భగవద్గీత ఆధ్వర్యంలో సోమవారం మండలంలోని రేబాల, రేబాల కాలనీ, నెహ్రూనగర్, లక్ష్మీపురం, అమ్మవారితోపు, చెల్లాయపాళెం గ్రామాలలో ఇంటింటికీ ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో త్రైత సిద్ధాంత సేవాసమితి జ్ఞానవేదిక నెల్లూరు కమిటీ సభ్యులు సురమౌళి, సుధాకరాచారి, రామయ్య, శ్రావణి సుమలత, ప్రదీప్, తదితరులు పాల్గొన్నారు.



మాలతి

ఎన్నెన్ని వినతులో..!

భర్త, కొడుకు చనిపోయారు. షుగర్ కారణంగా ఒక కాలు తొలగించారు. దీంతె బయటకు వెళ్లలేని పరిస్థితి. ఎవరి తోడ్పాటూ లేదు. దీంతో జీవితం దుర్భరంగా మారింది. జీవనాధారం కష్టమైంది. కనీసం పింఛను ఇప్పించినా కొంత వరకు భరోసాగా ఉంటుంది' అంటూ తిరుపతికి చెందిన మాలతి.. కనిపించిన ప్రతి అధికారినీ వేడుకున్నారు.

ఇలా ఒక్కొక్కరు ఒక్కో సమస్య. వ్యక్తిగతంగా.. సామూహికంగా ఎదుర్కొంటున్న సమస్యలను ఎప్పటిలానే ఈ సోమవారమూ కలెక్టరేట్‌లో జరిగిన 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక'లో అధికారుల దృష్టికి తీసుకొచ్చారు.

- 6లో

కిటకిటలాడిన ముక్కంటి ఆలయం

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయం సోమవారం భక్తులతో కిక్కిరిసింది. మాఘమాస త్రయోదశి కావడంతో సుమారు 28వేలమంది దర్శించుకున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు.రూ.200 శీఘ్ర దర్శనం టిక్కెట్ల ద్వారా 1,014మంది, రూ.50ప్రత్యేక దర్శనం టిక్కెట్ల ద్వారా 2,264మంది, రూ.500 అంతరాలయ దర్శనం 254మంది భక్తులు దర్శించుకున్నారు. రూ.500 రాహుకేతు టిక్కెట్ల ద్వారా 2,267మంది, రూ.750 టిక్కెట్ల ద్వారా 848,రూ.1,500 టిక్కెట్ల ద్వారా 221మంది, రూ.2,500 టిక్కెట్ల ద్వారా 170మంది, రూ.5వేలు టిక్కెట్ల ద్వారా 45మంది పూజలు చేయించుకున్నారు.



'పుట్టి' ముంచిన దళారులు!

- వరి చేతికొచ్చేసరికి ధరల పతనం
- కానరాని కొనుగోలు కేంద్రాలు



ధాన్యం కొనుగోలు కేంద్రాలు లేక పొలాల్లో ఆరబెడుతున్న రైతులు

వరిపంట కోతలు మొదలయ్యాయి. రైతులు ధాన్యాన్ని అమ్మి అప్పులు తీర్చుకునేందుకు ప్రయత్నిస్తున్నారు. అదే సమయంలో ధాన్యం ధరలు రోజురోజుకూ పతనమవుతున్నాయి. ముఖ్యంగా పెద్ద జిలకర్ల ధర భారీగా తగ్గిపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. డెల్టా ప్రాంతంలో స్వర్ణముఖి నది పరివాహక గ్రామాల్లో రైతులు ఫిల్టర్ పాయింట్ల కింద వరి సాగుచేశారు. గతేడాది పుట్టి 5204 (పెద్ద జిలకర్లు) రూ.24,500 పలికాయి. దీంతో ఈ ఏడాది కొన్ని గ్రామాల రైతులు బీపీటీ 5204 (పెద్ద జిలకర్లు) రకాన్ని అత్యధికంగా సాగుచేశారు. ఆ రకం ధాన్యం ధర రూ.18,500కు దిగజారింది. ఆ తర్వాత రూ.18,100కు పడిపోయింది. ఆ ధాన్యాన్ని అడిగే దళారులు, మిల్లర్లు లేకపోవడంతో రైతులు దిగాలు పడిపోయారు. ఇలా ఒక్కసారిగా ధరలు పడిపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

దళారుల దోపిడీ

షుగర్‌లెస్ ధాన్యం ఈ ఏడాది మొదట్లో పుట్టి రూ.18,500 పలికి ప్రస్తుతం 19,500 రూపాయల వరకు చేరింది. ఈ ధరలు ఇంకా పెరిగే అవకాశాలు ఉన్నట్లు దళారులు ప్రచారం చేస్తున్నారు. ఈయితే, ఈ రకాన్ని రైతులు అతి తక్కువగా సాగు చేశారు.



బ్రిడ్జిలపైనా ఇలా..

● అదే కేఎన్ఎంలు (సన్నాలు) రకం పుట్టి రూ.19,500 పలికి ప్రస్తుతం రూ.18,700 నుంచి రూ.19వేల వరకు వచ్చి ఆగిపోయి ఉంది. ఈ ధాన్యాన్ని రైతులు ఎక్కువగా సాగుచేశారు. అయితే, దళారులు, ఇతర రాష్ట్రాల్లోని మిల్లర్లు కుమ్మక్కయ్యారు. కర్ణాటకలోని కుమ్మకూరు, తమిళనాడులోని రెడ్‌హిల్స్‌లో ఈ ధాన్యం పెద్దగా డిమాండ్ లేదని దళారులు ప్రచారం చేస్తున్నారు. రైతులు తక్కువగా పండించిన ధాన్యానికి డిమాండ్ పెంచేసి ఎక్కువ సాగుచేసే ధాన్యానికి డిమాండ్ పడిపోయిందని రైతులను దోపిడీకి గురిచేస్తున్నారన్న ఆరోపణలున్నాయి. గతేడాదితో పోల్చుకుంటే బీపీటీ 5204, కేఎన్ఎం రకాలు ఈ ఏడాది ధరలు ఒక్కసారిగా పడిపోయాయి.

కొనుగోలు కేంద్రాలేవీ

ఏటా ఫిబ్రవరి నుంచి మే నెలాఖరు వరకు ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఉండేవి. రైతులు ధాన్యాన్ని అరబెట్టుకొని గిట్టుబాటు ధర వచ్చే వరకు నిల్వ చేసుకొని అమ్ముకుంటూ వచ్చేవారు. మండలంలోని 21 పంచాయతీలలో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఎక్కడా లేవు. దీంతో పండించిన ధాన్యానికి దళారులు నెమ్ములు, పచ్చిపేరుతో నిలువుదోపిడీ చేస్తున్నారు. ఈ ఏడాది దిగుబడి వచ్చినా ఆశించినంతమేర ధరలు లేకపోవడంతో రైతులు డీలాపడ్డారు.

- కోట, ఆంధ్రజ్యోతి

సీనియర్ ఇంటర్ ప్రాక్టికల్స్ ప్రారంభం

తిరుపతి(విద్య), ఫిబ్రవరి10(ఆంధ్రజ్యోతి): సీనియర్ ఇంటర్ జనరల్ కోర్సుల విద్యార్థులకు సోమవారం ప్రయోగ పరీక్షలు ప్రారంభమయ్యాయి. జిల్లాలోని 94పరీక్షాకేంద్రాల్లో ఉదయం నిర్వహించిన జనరల్, ఒకేషనల్ పరీక్షలకు 4278మంది విద్యార్థులకుగాను 4205మంది హాజరవ్వగా..73మంది గైర్హాజరైనట్లు ఆర్ఐవో జీవీ ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. అలాగే మధ్యాహ్న సెషన్‌లో 3143 మందికి 3115మంది హాజరయ్యారు. 28మంది విద్యార్థులు గైర్హాజరయ్యారని తెలిపారు.

ఒక్కొక్కటిగా పరిష్కరిస్తూ..!

- 'అక్షరం అండగా.. పరిష్కారమే అజెండాగా..'

తీరుతున్న జీవకోన సమస్యలు

తిరుపతి(జీవకోన), ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): తిరుపతి నగరం జీవకోనలో సమస్యలు ఒక్కొక్కటిగా పరిష్కారమవుతున్నాయి. ఇక్కడి సమస్యల పరిష్కారానికి వారధిగా ఏబీఎన్ ఆంధ్రజ్యోతి గతనెల 28వ తేదీన 'అక్షరం అండగా.. పరిష్కారమే అజెండాగా..' కార్యక్రమాన్ని నిర్వహించింది. ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, కమిషనరు మౌర్య తదితరులు పాల్గొన్నారు. స్థానికుల సమస్యలను విన్నారు. ప్రధానంగా నీటి సమస్య, రోడ్లు, డ్రైన్లు, మాల్వాడీగుండం నుంచి జీవకోన మీదుగా వచ్చే వర్షపునీరు వృథాగా పోకుండా చెక్‌డ్యాం ఏర్పాటు, పెద్ద కాలువకు సిమెంటు లైనింగ్ తొలగించి భూమిలోకి నీరు ఇంకేలా చర్యలు, కాలువలకు ఇరువైపులా రక్షణ గోడల ఏర్పాటు, స్మశానాల అభివృద్ధి, పారిశుధ్యం, ఇళ్లు ఉన్న వారికి అనుభవ పత్రాలు ఇలా ఎన్నో సమస్యలను స్థానికులు వారి ముందుంచారు. కార్పొరేటర్లు అన్నా అనిత, అన్నా సంధ్య, ఎస్సీ కార్పొరేషన్ డైరెక్టర్ కుమారమ్మలు పలు సమస్యలను తెలియజేసి, పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. వీటిపై ఎమ్మెల్యే, కమిషనరు సానుకూలంగా స్పందించారు. ఇక, కమిషనరు మౌర్య జీవకోనలో పర్యటించి సమస్యలను గుర్తించారు. పరిష్కారానికి చర్యలు చేపట్టారు.



నేడు.. పనులు చేపట్టారిలా..

● తిరుమల బైపాస్ రోడ్డు నుంచి సత్యనారాయణపురానికి వెళ్లే 30 మీటర్ల రోడ్డును కార్పొరేషన్ అధికారులు త్వరితగతిన పనులు చేపట్టారు. దీంతో కొంత మేర ప్రజలకు ఇబ్బందులు తప్పాయి.



నాడు.. తిరుమల బైపాస్ రోడ్డునుంచి సత్యనారాయణపురం వెళ్లే రోడ్డు



నేడు.. తొలగించారు

● రాజీవ్‌గాంధీకాలనీలోని మూడు మతాలకు చెందిన శ్మశానాల అభివృద్ధికి చర్యలు చేపడుతున్నారు. ఇందులో భాగంగా ముళ్ల పొదలను తొలగించారు. త్వరలో ప్రహరీ, గేట్ల నిర్మాణం చేపట్టనున్నారు.



నాడు.. శ్మశానంలో పిచ్చిమొక్కలు

● జీవకోన పరిధిలోని వివిధ కాలనీల్లో పారిశుధ్య పనులను కార్పొరేషన్ యంత్రాంగం మెరుగ్గా చేపడుతోంది. మురుగునీటి కాలువల్లో స్ప్రే చేయడంతో పాటు రాత్రి సమయాల్లో దోమల నివారణకు ఫాగింగ్ చేస్తున్నారు. ఎక్కడా చెత్తకుప్పలు నిల్వ లేకుండా తొలగిస్తున్నారు.

● ప్రధానమైన నీటి సమస్యపై కమిషనర్ దృష్టి సారించారు. ఉన్న బోర్లను మరమ్మతులు చేస్తున్నారు. నీటి సమస్యను అధిగమించేందుకు ప్రయత్నాలు ప్రారంభించారు.

● రోడ్లు, డ్రైన్ల మరమ్మతులకు ప్రణాళికలు సిద్ధం చేయాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు.

దామినేడు వద్ద జిల్లా కోర్టు కాంప్లెక్సు

- స్థలాన్ని పరిశీలించిన హైకోర్టు సీజే

తిరుచానూరు, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): తిరుపతిలోని కోర్టు సముదాయం తిరుచానూరు సమీపంలోని దామినేడు వద్ద ఏర్పాటు కానుంది. నగరంలో ప్రస్తుతమున్న కోర్టు భవనాల సముదాయం చాలడంలేదు. దీంతో జిల్లాకోర్టు కాంప్లెక్సు నిర్మాణానికి స్థలం కేటాయించాలని సంబంధిత న్యాయమూర్తులు ప్రభుత్వాన్ని కోరారు. కొంతకాలంగా జిల్లా కోర్టు కాంప్లెక్సు కోసం చంద్రగిరి, మంగళం, దామినేడు వద్ద స్థలాలను పరిశీలించారు. తిరుపతి నగరానికి, జాతీయ రహదారికి తిరుపతి రూరల్ మండలం దామినేడు దగ్గరగా ఉండటంతో, ఈ స్థలం అనువైందని జిల్లా అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. కలెక్టర్ వెంకటేశ్వర్ ఆదేశాల మేరకు తిరుపతి రూరల్‌మండల రెవెన్యూ అధికారులు దామినేడు వద్ద సర్వే నెంబరు 203, 204, 205 తదితర దానిలో సుమారు 15 ఎకరాల ప్రభుత్వ భూమిని గుర్తించారు. నాలుగైదురోజుల్లో ఈ 15ఎకరాలను జిల్లా కోర్టు కాంప్లెక్సుకు నిర్మాణానికి కేటాయించి.. వారం వ్యవధిలో కోర్టు అధికారులకు అప్పగించనున్నట్లు ఓ రెవెన్యూ అధికారి తెలిపారు. ఇప్పటికే 15 ఎకరాలకు సంబంధించిన రికార్డులను న్యాయశాఖకు అప్పగించే పనుల్లో రెవెన్యూ అధికారులు ఉన్నారు. ఈ స్థలాన్ని ఏపీ హైకోర్టు ప్రధానన్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్, ఉమ్మడి జిల్లాపోర్టుపోలియో అడ్మినిస్ట్రేషన్ హైకోర్టు జడ్జి బి.కృష్ణమోహన్, జేసీ శుభం బన్సల్, ఆర్డీవో రామ్మోహన్ పరిశీలించారు. ఈ కార్యక్రమంలో న్యాయమూర్తులు గురునాథ్, కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



స్థలాన్ని పరిశీలిస్తున్న హైకోర్టు సీజే జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్

పుస్తక ప్రదర్శనపై దాడి ఘటనపై కేసు నమోదు

తిరుపతి(నేరవిభాగం), ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): తిరుపతిలోని ఇస్కాన్ ఆలయం ఎదురుగా ఉన్న టీటీడీ మైదానంలో జరిగిన పుస్తక ప్రదర్శనలో కొందరు దాడి చేయడంపై సోమవారం రాత్రి కేసు నమోదైంది. 'మతపరమైన విషయాలను తెరపైకి తీసుకొచ్చారు. స్టాళ్లలో ఉన్న చాలా పుస్తకాలను చించేశారు. మరికొన్నింటిని నేలపైకి విసిరి కొట్టారు. దాడికి యత్నించారు' అంటూ తుమ్మా ఓంకార్, కిరణ్‌కుమార్, సురేష్‌నాయక్, రమేష్‌బాబుతో పాటు మరికొందరిపై నిర్వాహకులు, పుస్తక ప్రియులు, సాహితీ వేత్తలు, విశాలాంధ్ర బుక్ హౌస్ నిర్వాహకుడు శంకరయ్య కలిసి అలిపిరి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇదే ఘటనపై సోమవారం ఎస్పీ హర్షవర్ధన రాజును కలిసి వినతిపత్రం సమర్పించారు. దీనిపై పరిశీలించిన ఎస్పీ వెంటనే కేసు నమోదు చేసి దర్యాప్తు చేయాలని, నిందితులను అరెస్టు చేయాలని ఆదేశాలు జారీ చేశారు. దీంతో పుస్తకాలను చించి వేయడం, కింద పడేయడం నేరంగా పరిగణిస్తూ సెక్షన్ 427 కింద, మతపరమైన విషయాలను తెరపైకి తీసుకొచ్చి కించపరచడంతో సెక్షన్ 299 కింద సోమవారం రాత్రి అలిపిరి ఎస్ఐ నాగార్జునరెడ్డి కేసు నమోదు చేశారు. నిందితుల కోసం ప్రత్యేక బృందాలతో గాలిస్తున్నారు.

చంద్రబాబు అనుభవంతోనే రాష్ట్రం ముందుకు
- మంత్రి నారాయణ



తిరుమల, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వంలో రాష్ట్ర ఆర్థిక పరిస్థితి అతలాకుతలమైందని, సీఎం చంద్రబాబు తనకున్న అపార అనుభవంతో రాష్ట్రాన్ని ముందుకు తీసుకెళుతున్నారని మంత్రి నారాయణ అన్నారు. తిరుమల శ్రీవారిని సోమవారం ఉదయం దర్శించుకున్న ఆయన ఆలయం ముందు మీడియాతో మాట్లాడారు. త్వరలో రాష్ట్రంలో ఆర్థిక పరిస్థితులన్నీ మెరుగుపడి ప్రజలు అన్ని విధాల బాగుండాలని శ్రీవారిని కోరుకున్నట్టు చెప్పారు.

తిరుమలలో గదుల చెకౌట్ కేంద్రం

తిరుమల, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): తిరుమలలో భక్తులకు గదుల నిరీక్షణ సమయాన్ని తగ్గించేందుకు టీటీడీ కసరత్తు చేస్తోంది. తిరుమలలో సిఫార్సు లేఖలపై ఎంబీసీ34, టీబీ కౌంటర్లలో, వీఐపీలకు పద్మావతి కౌంటర్లలో గదులు కేటాయిస్తారు. అయితే గత కొంతకాలంగా పద్మావతి, ఎంబీసీ కౌంటర్ల వద్ద సిఫార్సు లేఖలు ఉన్నప్పటికీ గంటల తరబడి క్యూలైన్లలో నిరీక్షించాల్సి వస్తోంది. శ్రీవారి దర్శనానికంటే గదులు పొందేందుకే అధిక సమయం పడుతోంది. దీనిపై టీటీడీ అదనపు ఈవో వెంకయ్య చౌదరి, డిప్యూటీఈవో ఆర్‌1 భాస్కర్ ప్రత్యేక దృష్టిసారించారు. ఇందులో భాగంగా ఉద్యోగుల సిఫార్సుల కోసం ఎంబీసీ34కు సమీపంలో మరొక గదులు కేటాయింపు కౌంటర్‌ను ఇటీవల ప్రారంభించారు. పద్మావతి వద్ద గదులు ఖాళీ చేసేవారు కూడా క్యూలైన్ ద్వారానే వెళ్లాల్సివస్తోందని గుర్తించి పక్కనే ప్రత్యేకంగా చెకౌట్ కేంద్రాన్ని ఏర్పాటు చేస్తున్నారు. త్వరలోనే ఈకౌంటర్ అందుబాటులోకి రానుంది.



పద్మావతి కార్యాలయం పక్కనే ఏర్పాటు చేస్తున్న చెకౌట్ కేంద్రం

సర్వదర్శనానికి 16 గంటలు

తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 18 గంటల సమయం పడుతోంది. సోమవారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్‌2లోని కంపార్టుమెంట్లు, నారాయణగిరిలోని షెడ్లలో సర్వదర్శనం భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్‌1లో 6 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచిఉన్నారు.

శనివారం నాటి హుండీ ఆదాయం: రూ.3.67 కోట్లు

ఆదివారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 84,536

తలనీలాలు సమర్పించినవారు: 25,890



ప్రతి అర్జీకీ పరిష్కారం చూపండి



ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న జేసీ శుభం బన్సల్

● కలెక్టరేట్ పీజీఆర్ఎస్‌కు 249 వినతులు

తిరుపతి(కలెక్టరేట్), ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): పీజీఆర్ఎస్ (ప్రజా సమస్యల పరిష్కార వేదిక)లో ప్రజలు ఇచ్చే ప్రతి అర్జీకీ పరిష్కారం చూపాలని జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్ జిల్లా అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన పీజీఆర్ఎస్‌కు 249 అర్జీలు వచ్చాయి. అందులో భూ సమస్యలపైనే 155 ఉండడం గమనార్హం. డీఆర్వో నరసింహులు, ఎస్‌డీసీ దేవేంద్రరెడ్డి, రోష్మాండ్, శివశంకర్‌నాయక్ ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు.

వెటర్నరీ వర్సిటీ విద్యార్థుల ఆందోళన



వెటర్నరీ విద్యార్థుల ధర్నా

స్టైఫండ్ పెంచాలని, తమ సమస్యలు పరిష్కరించాలని శ్రీవెంకటేశ్వర పశువైద్య విశ్వవిద్యాలయం 8 రోజులుగా సమ్మె చేస్తున్న విద్యార్థులు.. సోమవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా చేశారు. వైద్య విద్యకు సమానమైన వెటర్నరీ విద్యను వ్యవసాయ విశ్వవిద్యాలయంలో విలీనం చేయాలనే నిర్ణయాన్ని వ్యతిరేకిస్తున్నామన్నారు. అనంతరం కలెక్టరేట్‌లో అధికారులకు వినతిపత్రాన్ని అందజేశారు. కలెక్టరేట్ నుంచి భారీ ర్యాలీగా వెటర్నరీ యూనివర్శిటీకి వెళ్లారు. యశ్వంత్, లీలాప్రసాద్, నాగరాజు, ఉషా మనోహర్, పవన్, నిరంజన్, మనోజ్, గుణ, కౌశిక్ తదితరులు పాల్గొన్నారు.

మా పొలాలకు 'గంగ'ను ఇవ్వండి

'బాలయ్యపల్లి మండలం గిరిజన కాలనీకి చెందిన.. ప్రభుత్వం ఇచ్చిన భూముల్లో నిమ్మచెట్లు సాగు చేశాం. దీనికి 2009లో ఐటీడీఏ మూడు బోర్లు వేయగా.. నీళ్ల పడలేదు. మేమూ సొంతంగా బోర్లు వేసినా.. నీళ్ల సరిపోవడం లేదు. సుమారు 30 ఎకరాల్లో నిమ్మచెట్లు, ఇతర పంటలు ఎండిపోతున్నాయి. మా పొలాలకు కొంత దూరంలో తెలుగుగంగ కాలువ ఉంది. దీని నుంచి నీటిని మాకు ఇవ్వాలి' అని రైతులు కోరారు.



బాలాయపల్లి రైతులు

ఎస్టీ కార్పొరేషన్ రుణం మంజూరు చేయించండి



రోడ్డు ప్రమాదంలో రెండు కాళ్లు పోయాయి. పింఛను అయితే వస్తోంది. ముగ్గురు పిల్లలు, కుటుంబ పోషణ కష్టంగా ఉంది. ఎస్టీ కార్పొరేషన్‌లో రుణం ఇప్పిస్తే చిన్న కొట్టు పెట్టుకుని జీవనం సాగిస్తాను. కలెక్టరేట్ చుట్టూ తిరుగుతున్నా అధికారులు దయ చూపడం లేదు. మీరైనా కరుణించండి.

- వెంకటేశ్వరరావు, ఎంపేడు, శ్రీకాళహస్తి మండలం

పింఛను కోసం ఏడాదిగా తిరుగుతున్నా..

పింఛను కోసం కలెక్టరేట్ చుట్టూ సంవత్సరం నుంచి తిరుగుతూనే ఉన్నాను. ఎవరూ పట్టించుకోవడంలేదు. సచివాలయ సిబ్బందిని అడిగితే సరిగా సమాధానం చెప్పడం లేదు. మీరైనా స్పందించండి.

- చిరంజీవి, కొండకిందపల్లి, పదిపుట్లబైలు



తిరుపతిలో శాయ్ డీడీ పర్యటన

● మైదానాలు, భవనాల పరిశీలన



ఎస్వీయూ డార్మెటరీలో వంటశాలను పరిశీలిస్తున్న శాయ్ అధికారులు

తిరుపతి(క్రీడలు), ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): స్పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా (శాయ్) డిప్యూటీ డైరెక్టర్ నవీన్‌కుమార్ సోమవారం తిరుపతిలో పర్యటించారు. కర్నూలు, ఏలూరు, వైజాగ్, యానాంలో ఉన్నట్లుగా తిరుపతిలోనూ రాష్ట్రస్థాయి ఖేలో ఇండియా రెసిడెన్షియల్ స్పోర్ట్స్ ట్రైనింగ్ సెంటర్‌ను ఏర్పాటు చేయాలన్నది సీఎం చంద్రబాబు ఆలోచన. ఈ మేరకు గతేడాది డిసెంబరులో శాప్ చైర్మన్ రవినాయుడు ప్రతిపాదనలు తయారు చేసుకొని కేంద్ర క్రీడాశాఖా మంత్రి మన్సుక్ ఎస్.మాండవ్యను కలిశారు. ఆయన సూచన మేరకు శాయ్ డిప్యూటీ డైరెక్టర్(బెంగళూరుశాఖ)నవీన్‌కుమార్ సోమవారం ఉదయం శ్రీనివాస క్రీడా సముదాయానికి చేరుకొన్నారు. డీఎస్‌డీవో సయ్యద్‌సాహెబ్ తదితరులతో సమావేశమయ్యారు. జిల్లాలోని మైదానాలు, క్రీడా సదుపాయాలు, క్రీడల గురించి తెలుసుకున్నారు. ఎస్వీయూలోని డార్మెటరీ, ఫ్యాకల్టీక్వార్టర్స్, ఎమ్మెల్సీ భవనం, తారకరామ మైదానం, శ్రీనివాస క్రీడా సముదాయంలోని ఇండోర్ స్టేడియం, మల్టీపర్పస్‌హాల్‌ను పరిశీలించారు. ప్రతి భవనాన్ని తన సెల్‌ఫోన్‌లో వీడియో, ఫొటోలు తీసుకుంటూ సాధ్యాసాధ్యాలను పరిశీలించారు. తాను తనిఖీ చేసిన భవనాల స్థితిగతులపై నివేదిక తయారుచేసి శాయ్ ప్రధాన కార్యాలయానికి అందిస్తానని నవీన్‌కుమార్ చెప్పారు. ఇప్పటికే శ్రీపద్మావతి మహిళా విశ్వవిద్యాలయంలో ఖేలోఇండియా మల్టీపర్పస్ ఇండోర్ స్టేడియం, ఏర్పేడు వద్ద ఐసర్‌లో అథ్లెటిక్‌ట్రాక్ ఏర్పాటుకు నిధులు మంజూరుచేశామన్నారు. భవిష్యత్తులో మరిన్ని ప్రాజెక్టులకు అనుమతులిస్తామన్నారు.

ఆన్‌లైన్ చీటింగ్ కేసుల్లో లక్ష్మీరెడ్డి అరెస్టు



తిరుపతిలో లక్ష్మీరెడ్డిని అదుపులోకి తీసుకున్న జైపూర్ పోలీసులు

● అదుపులోకి తీసుకున్న రాజస్థాన్ పోలీసులు

తిరుపతి(నేరవిభాగం), ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): జనసేన పార్టీ తిరుపతి నియోజకవర్గ ఇన్‌చార్జి కిరణ్‌రాయల్ మోసం చేశాడంటూ ఆరోపణలు చేసిన తిరుపతి ఎంఆర్‌పల్లెకి చెందిన లక్ష్మీరెడ్డిని సోమవారం రాజస్థాన్ పోలీసులు అరెస్టు చేశారు. ఆన్‌లైన్ చీటింగ్ కేసుల్లో వివిధ రాష్ట్రాల్లో ఈమెపై కేసులు నమోదైనట్లు తెలుస్తోంది. ఆమె కోసం కొన్ని నెలలుగా గాలిస్తున్న జైపూర్ పోలీసులు.. తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో ప్రెస్‌మీట్ తర్వాత లక్ష్మీరెడ్డిని అదుపులోకి తీసుకున్నారు. 2021లో జైపూర్, చాంద్వాజీ పోలీసు స్టేషన్లలో లక్ష్మీరెడ్డితో పాటు అరుణ్‌రెడ్డి, మహ్మద్ జాహిద్‌ఖాన్‌పై చీటింగ్ కేసు నమోదైందని తిరుపతి పోలీసులు చెప్పారు. అదుపులోకి తీసుకున్న లక్ష్మీరెడ్డిని ఎస్వీ యూనివర్సిటీ పోలీసు స్టేషన్‌కు తరలించారు. అక్కడ్నుంచి వైద్య పరీక్షలు నిమిత్తం రుయాస్పత్రికి తరలించారు. వైద్య పరీక్షలు ముగిసిన వెంటనే తిరుపతిలోని అదనపు జ్యుడిషియల్ సివిల్ జడ్జి ఎదుట హాజరు పరిచారు. ఆ తర్వాత ఆమెను జైపూర్‌కు తీసుకెళ్లనున్నారని ఎస్వీయూ స్టేషన్ సీఐ రామయ్య చెప్పారు.

వివిధ సెక్షన్ల కింద కేసు

లక్ష్మీరెడ్డిపై సెక్షన్ 419, 420, 66సీ, 66డీ, 120-బి, 406 సెక్షన్ల కింద కేసు నమోదైనట్లు సమాచారం. ఈ కేసులో అరుణ్‌రెడ్డి, మహ్మద్ జాహిద్‌ను ఇప్పటికే పోలీసులు అరెస్టు చేశారు. పరారీలో వున్న లక్ష్మీరెడ్డి కోసం పోలీసులు కొన్ని సంవత్సరాలుగా వెతుకుతున్నారని తెలిసింది. ఈ క్రమంలో మూడు రోజులుగా కిరణ్‌రాయల్ వ్యవహారంలో మీడియాలో కనిపించడంతో జైపూర్ పోలీసులు తిరుపతికి వచ్చారు. అరెస్టుకు ముందు లక్ష్మీరెడ్డి జిల్లా ఎస్పీ హర్షవర్ధన రాజును కలసి తనకు న్యాయం చేయాలని కోరుతూ వినతి పత్రం ఇచ్చారు. అనంతరం తిరుపతి ప్రెస్‌క్లబ్‌కు చేరుకుని మీడియా సమావేశంలో కిరణ్ రాయల్‌పై ఆరోపణలు చేశారు.

కిరణ్ మాటలకు మోసపోయా
- లక్ష్మీరెడ్డి ఆరోపణ

తిరుపతి(జీవకోన), ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): జనసేన నేత కిరణ్‌రాయల్ మాయమాటలు నమ్మి మోసపోయానని బాధితురాలు లక్ష్మీరెడ్డి ఆరోపించారు. సోమవారం తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో ఆమె మీడియాతో మాట్లాడుతూ కిరణ్ పరిచయం అయినప్పటి నుంచి అతడికి అన్నీతానై ఆర్థికంగా సహాయ సహకారాలు అందించానని చెప్పారు. తనవద్ద నుంచి రూ.12 కోట్లను తీసుకున్నాడని, ఆ మొత్తం రాబట్టుకోవడానికే పోరాడుతున్నానన్నారు. సామాజిక మాధ్యమాల ద్వారా తన బతుకును హేళన చేసే విధంగా కిరణ్‌రాయల్ ట్రోల్ చేయిస్తున్నాడని ఆరోపించారు.

ఆమె పెద్ద చీటర్ అని అప్పుడే చెప్పా

● జైపూర్ పోలీసుల అరెస్టుతో రుజువైందన్న కిరణ్



తిరుపతి, ఫిబ్రవరి10(ఆంధ్రజ్యోతి): 'నాపై అసత్యపు ఆరోపణలు చేస్తున్న లక్ష్మీ పెద్ద చీటర్ అని తొలిరోజే చెప్పా. ఎవరూ నమ్మలేదు. జైపూర్ పోలీసులు తిరుపతికి వచ్చి అరెస్టు చేయడంతో నేను చెప్పింది నిజమైంది' అని జనసేన నేత కిరణ్‌రాయల్ అన్నారు. సోమవారం సాయంత్రం ఆయన మీడియాతో మాట్లాడారు. 'జగన్ 2.0' పోస్టర్ విడుదల చేశాక వైసీపీ నాయకులు కుట్రపన్ని తన రాజకీయ జీవితాన్ని అణిచివేయాలని చూశారన్నారు. వైసీపీ స్వార్థ రాజకీయాలకోసం మహిళను వాడుకున్నారని, పర్యవసానంగా ఆమె ఎక్కడవుందా? అని వెతుకుతున్న జైపూర్ పోలీసులకు దొరికిపోయిందన్నారు. ఆడవాళ్లను అడ్డుపెట్టుకుని రాజకీయం చేయడం వైసీపీకే చెల్లిందన్నారు. పార్టీకి చెడ్డపేరు వస్తుందంటే తాను చావడానికైనా సిద్ధమన్నారు. కోర్టులో న్యాయం గెలుస్తుందని, తనకు అండగా ఉన్న జనసేన కార్యకర్తలకు ధన్యవాదాలు తెలిపారు.

ఎస్వీయూ ఘటనలో ఇద్దరి అరెస్టు

● గంజాయి, హత్యాయత్నం కింద కేసులు నమోదు

తిరుపతి(నేరవిభాగం), ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): ఎస్వీయూ హాస్టల్‌లోని ఇద్దరు విద్యార్థులపై ఆదివారం రాత్రి కత్తితో దాడి చేసిన ఘటనలో నిందితులపై గంజాయి, హత్యాయత్నాల కింద కేసు నమోదు చేసి సోమవారం అరెస్టు చేశారు. ఎస్వీయూ సీఐ రామయ్య కథనం మేరకు.. వెంకటగిరి మండలానికి చెందిన మణికంఠ తిరుపతిలో జులాయిగా తిరుగుతున్నాడు. సులభంగా డబ్బు సంపాదించడానికి అలవాటు పడ్డాడు. ఎక్కడ పడితే అక్కడ రౌడీయిజం చేయడం, అవసరమైతే హత్యాయత్నాలకు పాల్పడడం అలవాటుగా మారింది. దీంతో మణికంఠపై వర్శిటీ పోలీసులు రౌడీషీట్ ఓపెన్ చేశారు. ఈ క్రమంలో ఎస్వీయూలో ఉన్న ఓ వైసీపీ విభాగం నాయకుడితో కలిసి వర్శిటీకి వస్తుంటాడు. ఈ క్రమంలో కడప జిల్లాకు చెందిన మరో విద్యార్థి పరిచయమయ్యాడు. రోజూ అతడి గదికి రాత్రి సమయాల్లో వచ్చి మద్యం తాగేవారు. ఇది రూమ్‌మేట్ హరికి నచ్చక మరో రూముకు వెళ్ళి చదువుకునే వాడు. శనివారం రాత్రి రూము నెంబరు 18 వద్ద చదువుకుంటున్న హరి వద్దకు మణికంఠ, అతడి స్నేహితుడు, వర్సిటీ విద్యార్థి అయిన యోగేశ్వర్ వచ్చారు. తాను గదికి వస్తే.. నువ్వు ఇక్కడికి ఎందుకు వస్తున్నావంటూ హరితో మణికంఠ గొడవపడ్డాడు. తమ గది వద్దకు వచ్చి ఎందుకు గొడవ చేస్తున్నావంటూ వెంకటేష్‌బాబు నిలదీశారు. అప్పటికే మద్యం, గంజాయి మత్తులో ఉన్న మణికంఠ అతడిపై కత్తితో దాడి చేశాడు. వర్శిటీ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకునిమణికంఠ, యోగేశ్వర్‌పై గంజాయి, హత్యాయత్నం కింద కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు.

హాస్టళ్లలో బయటి వ్యక్తులుంటే చర్యలు



హాస్టల్‌ను పరిశీలిస్తున్న వీసీ అప్పారావు, రిజిస్ట్రార్ భూపతినాయుడు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): ఎస్వీ యూనివర్సిటీ హాస్టళ్లలో బయటి వ్యక్తులుంటే కఠిన చర్యలు తీసుకుంటామని వీసీ అప్పారావు, రిజిస్ట్రార్ భూపతి నాయుడు స్పష్టంచేశారు. ఆదివారం రాత్రి హెచ్-బ్లాక్ హాస్టల్లో చోటు చేసుకున్న ఘటన నేపథ్యంలో సోమవారం వీరు పరిశీలించారు. గాయపడిన విద్యార్థిని పరామర్శించారు. హాస్టళ్లలో సమస్యలకు కొందరు సిబ్బంది తీరు కూడా కారణమని పలువురు విద్యార్థులు అధికారుల దృష్టికి తెచ్చారు. దీంతో, బయటి వ్యక్తుల గురించి అధ్యయనం, చర్యల కోసం ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేస్తున్నట్టు అధికారులు ప్రకటించారు. ఈ కమిటీ నివేదిక అందిన వెంటనే యూనివర్సిటీ హాస్టళ్లలోని బయటి వ్యక్తులు, వారికి ఆశ్రయం కల్పిస్తున్న సిబ్బంది, విద్యార్థులపైనా కఠిన చర్యలు తీసుకుంటుందన్నారు. బయటి వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని ఇప్పటికే ఎస్పీకి కూడా ఫిర్యాదు చేసినట్టు చెప్పారు.

లాటరీ పద్ధతిలో మద్యం దుకాణాల కేటాయింపు

తిరుపతి(నేరవిభాగం), ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ప్రభుత్వం గీత కార్మికులకు కేటాయించిన 23 మద్యం దుకాణాలను జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్ సోమవారం లాటరీ ద్వారా డిప్ తీసి అర్హులైన వారికి కేటాయించారు. తద్వారా ప్రభుత్వానికి లైసెన్సు ఫీజు కింద రూ.4.60 లక్షల ఆదాయం లభించింది.

మహాశివరాత్రి ఉత్సవాలకు రండి

● సీఎం చంద్రబాబుకు ఎమ్మెల్యే, అధికారుల ఆహ్వానం



సీఎం చంద్రబాబుకు ఆహ్వాన పత్రిక అందజేస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తిలో ఈ నెల 21 నుంచి ప్రారంభమయ్యే మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలకు హాజరుకావాలని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడిని ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి, ఆలయ అధికారులు, అర్చకులు ఆహ్వానించారు. సచివాలయంలో సీఎంను సోమవారం వీరు కలిసి ఆహ్వాన పత్రికను లాంఛనంగా అందజేశారు. ఆలయ వేదపండితులు సీఎంకు తీర్థప్రసాదాలు, స్వామి అమ్మవార్ల చిత్రపటాన్ని అందజేశారు. వేదాశీర్వాదమిచ్చారు. ఉత్సవ ఏర్పాట్లపై ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, అధికారులతో చంద్రబాబు మాట్లాడారు. ఈవో బాపిరెడ్డి, ప్రధాన అర్చకుడు సంబంధం గురుకుల్, డిప్యూటీ ఈవో కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పీజీ, పీహెచ్‌డీ సెట్స్ కన్వీనర్‌గా వెంకటేశ్వర్లు



నియామక ఉత్తర్వులు స్వీకరిస్తున్న ప్రొఫెసర్ పీసీ వేంకటేశ్వర్లు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని యూనివర్సిటీల్లో పీజీ, పీహెచ్‌డీ ప్రవేశాల కోసం చేపట్టనున్న ఏపీపీజీసెట్, ఏపీపీహెచ్‌డీ సెట్ కన్వీనర్‌గా ఎస్వీయూ ఓఆర్ఐ ప్రొఫెసర్ పీసీ వెంకటేశ్వర్లు నియమితులయ్యారు. ఈ నియామక ఉత్తర్వులను ఎస్వీయూ వీసీ అప్పారావు, రిజిస్ట్రార్ భూపతి నాయుడు నుంచీ ఆయన సోమవారం అందుకున్నారు.

పుస్తకాలపై దాడి అనాగరికం : సాహిత్యవేత్తలు

జిల్లా ఎస్పీకి ఫిర్యాదు



పుస్తకాలను ప్రదర్శిస్తున్న పుస్తక, సాహిత్యాభిమానులు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు, ఆటోనగర్), ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): సాహిత్యం కుట్ర కాదు, రచయితలు కుట్రదారులు కాదని పలువురు సాహిత్యవేత్తలు స్పష్టం చేశారు. తిరుపతి పుస్తక ప్రదర్శనపై దాడికి నిరసనగా సోమవారం సాయంత్రం తిరుపతిలో పుస్తక, సాహిత్యాభిమానులు సమావేశమయ్యారు. 17వ తిరుపతి పుస్తక ప్రదర్శనలో శనివారం కొందరు దాడి చేసి బీభత్సం చేసిన సంఘటను ఖండించారు. సమాజంలో భిన్నాభిప్రాయాలకు చోటుండాలన్నారు. లేకపోతే మానవ మనుగడే ప్రమాదంలో పడిపోతుందని ఆందోళన వ్యక్తం చేశారు. అనంతరం తిరుపతి ప్రతిష్టకు భంగం కలిగేలా ప్రవర్తించిన దుండగులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ జిల్లా ఎస్పీని కలిశారు. 17 ఏళ్లుగా ఎంతో గౌరవంగా జరుగుతున్న పుస్తకోత్సవాల గురించి వివరించారు. దాడి సంఘటన వీడియోలను ఎస్పీకి చూపించారు. దాడికి గురైన విశాలాంధ్ర పుస్తకాల షాప్ ప్రతినిధి శంకర్‌ను విచారించి, వెంటనే చర్యలకు ఆదేశించిన ఎస్పీకి ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐక్యవేదిక నాయకులు పి.అంజయ్య, రాఘవ, వాకా ప్రసాద్, పరమేశ్వర్, ఒ. వెంకటరమణ,, అజీమ్ బాష, రామానాయుడు, వందవాసి నాగరాజు, విశ్వనాథం, సాయిలక్ష్మి, హేమలత, జయంతి, వెంకటాద్రి, హరీష్ పాల్గొన్నారు.

నేడు పుస్తక ప్రియుల ర్యాలీ

తిరుపతి పుస్తక ప్రదర్శనపై దాడిని నిరసిస్తూ మంగళవారం తిరుపతిలో పుస్తక ప్రియులు పుస్తకాలు చేతబట్టి ర్యాలీ నిర్వహించనున్నారు. సాయంత్రం 4:30 గంటలకు బాలాజీ కాలనీలోని పూలే విగ్రహం నుంచీ నాలుగుకాళ్ళ మండపం దాకా ఈ ర్యాలీ సాగనుంది. రచయితలు, కవులు, సాహిత్యాభిమానులు తమకు నచ్చిన పుస్తకాలను పట్టుకొని ఈ ప్రదర్శనలో పాల్గొనాలని తిరుపతి పుస్తక ప్రియుల ఐక్య వేదిక కన్వీనర్ వాకా ప్రసాద్ కోరారు.

దొంగలపై స్పెషల్ ఫోకస్

● ముమ్మరంగా కార్డెన్ సెర్చ్‌లు ● పాత నేరస్థుల కదలికలపై నిఘా

● థార్, పార్థు గ్యాంగ్‌ల పట్ల అప్రమత్తంగా ఉండాలంటూ ఎస్పీ ఆదేశాలు

తిరుపతి (నేరవిభాగం), ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో వరుస దొంగతనాలతో పోలీసులు అప్రమత్తమయ్యారు. దొంగలపై స్పెషల్ ఫోకస్ పెట్టారు. దొంగతనాలు, హౌస్ బ్రేకింగ్‌లు, చైన్ స్నాచింగ్‌ల కట్టడికి చర్యలు తీసుకుంటున్నారు. పోలీసు సర్కిళ్ల వారీగా బృందాలను ఏర్పాటు చేసి ఎస్పీ హర్షవర్ధనరాజు విధులు కేటాయించారు. సాయంత్రం 6 నుంచి రాత్రి 10 గంటల వరకు హోంగార్డుల నుంచి అదనపు ఎస్పీల వరకు రోడ్లపై ఉండి.. విజువల్ పోలీసింగ్ గట్టిగా చేయాలని ఆదేశించారు. మరోవైపు జైళ్ల నుంచి విడుదలైన వారు, పాత నేరస్థుల కదలికలపై దృష్టి సారించారు. ఇప్పటికే సబ్ డివిజన్ల వారీగా రౌడీషీటర్లకు కౌన్సిలింగ్ ఇచ్చే పని మొదలు పెట్టిన పోలీసులు.. ఆయా పోలీసు స్టేషన్లలోని నేరస్థుల జాబితాలు పరిశీలిస్తున్నారు. నేరస్థుల చిట్టాను సిద్ధం చేస్తున్నారు. ఎక్కడెక్కడ ఎవరు ఎలాంటి నేరాలకు పాల్పడ్డారు? థార్, పార్థు గ్యాంగ్‌లు గతంలో ఎక్కడైనా చోరీలు, హౌస్ బ్రేకింగ్‌లకు పాల్పడ్డారా అనే కోణంలో దర్యాప్తు చేస్తున్నారు. వారి వేలిముద్రలు బయటకు తీసి మళ్లీ పరిశీలిస్తున్నారు. ఇప్పటి వరకు అందిన సమాచారం మేరకు దాదాపు 340 మంది పాత నేరస్థులు వున్నట్లు సమాచారం.

డీజీపీ ఆదేశాలతో కదలిన యంత్రాంగం

డీజీపీ హరీష్‌కుమార్ గుప్తా ఆదేశాలతో జిల్లా పోలీసు యంత్రాంగంలో కదలిక వచ్చింది. ఏకాంత కాలనీలు, శివారు ప్రాంతాలు, ఖరీదైన విల్లాల్లో కార్డెన్ సెర్చ్‌లు నిర్వహించడానికి చర్యలు చేపట్టారు. వెంకటగిరి, బాలయ్యపల్లి, డక్కిలి, శ్రీకాళహస్తి, తిరుపతి, నాయుడుపేట, డీవీ సత్రం, వెంకటగిరి ప్రాంతాల్లో సోమవారం ఆయా డీఎస్పీల ఆధ్వర్యంలో కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. 153 వాహనాలకు ఎలాంటి రికార్డులు లేకపోవడంతో వాటిని సీజ్ చేశారు. ఇలాంటి కార్డెన్ సెర్చ్‌లు నిరంతరం కొనసాగిస్తామని ఎస్పీ హర్షవర్ధన రాజు చెప్పారు. వీటితో పాటు నైట్ పెట్రోలింగ్, విజువల్ పోలీసింగ్, మొబైల్ వాహనాల్లో గస్తీ తిరగడం వంటి వాటిని మరింత పటిష్ఠ పరచడానికి చర్యలు తీసుకున్నారు.

గూడూరు
సూళ్లూరుపేట/వెంకటగిరి

నేరాల నియంత్రణకే కార్డన్ సెర్చ్



శ్రీనివాసాపురంలో స్థానికులతో మాట్లాడుతున్న డీఎస్పీ చెంచుబాబు

నాయుడుపేట టౌన్, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): నేరాల నియంత్రణ కోసమే కార్డన్ సెర్చ్‌లు నిర్వహిస్తున్నట్లు డీఎస్పీ చెంచుబాబు అన్నారు. నాయుడుపేట పట్టణం శ్రీనివాసపురం కాలనీలో సోమవారం ఉదయం కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. ప్రతి ఇంటికీ వెళ్లి తనిఖీ చేశారు. కొత్త వ్యక్తుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం డీఎస్పీ మాట్లాడుతూ శ్రీనివాసపురంలో ఉన్న ప్రభుత్వ లేఅవుట్ అభివృద్ధి చెందుతున్న క్రమంలో బయటప్రాంతాల నుంచి వచ్చిన అనుమానిత వ్యక్తులు సంచరిస్తున్నట్లు సమాచారం రావడంతో కార్డన్ సెర్చ్ నిర్వహించినట్లు తెలిపారు. అనుమానిత వ్యక్తులు సంచరిస్తుంటే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. వాహనాలు నడిపేవారు అన్ని ధృవీకరణ పత్రాలు వెంట ఉంచుకోవాలని సూచించారు.

మట్టి రవాణా అడ్డగింత



పోలీస్ స్టేషన్ వద్ద మట్టి టిప్పర్లు

పెళ్లకూరు, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): అక్రమంగా మట్టి రవాణా చేస్తున్న టిప్పర్లను శిరసనంబేడు గ్రామస్తులు సోమవారం అడ్డుకున్నారు. మట్టి టిప్పర్లను మైనింగ్ అధికారులకు అప్పగించారు. సమాచారం అందుకున్న మైనింగ్ టెక్నికల్ అసిస్టెంట్ రామకృష్ణ, ఆఫీస్ సబ్‌ఆర్డీనేటర్ రమేష్ సంఘటనా స్థలానికి చేరుకొని మట్టి టిప్పర్లను పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు సుందర రామిరెడ్డి, ప్రసాద్, రమేష్‌రెడ్డి, రమణయ్య, రఘురామయ్య మాట్లాడుతూ ప్రభుత్వ భూములు, కొండలు, గుట్టలను తవ్వి తరలించి సొమ్ము చేసుకుంటున్న అక్రమార్కులపై అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

క్రీడా పోటీల విజేతలకు అభినందన



క్రీడాకారులను అభినందిస్తున్న డైరెక్టర్, విభాగాధిపతులు

కోట, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): జాతీయ స్థాయి క్రీడా పోటీల్లో విజయం సాధించిన ఎన్‌బీకేఆర్ ఇంజనీరింగ్ కళాశాల క్రీడాకారులను సోమవారం డైరెక్టర్ డాక్టర్ విజయకుమార్‌రెడ్డి, విభాగాధిపతులు అభినందించారు. ఈ నెల 7నుంచి 9వ తేదీ వరకు ఒంగోలులో జాతీయస్థాయి క్రీడా పోటీలు జరిగాయి. బాస్కెట్‌బాల్, టెబుల్ టెన్నిస్ పోటీల్లో ఎన్‌బీకేఆర్ ఇంజనీరింగ్ కళాశాల ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచారు. వారిని డైరెక్టర్‌తో పాటు విద్యావిభాగాధిపతి డాక్టర్ మల్లికార్జున్‌రెడ్డి, అసిస్టెంట్ పీడీలు శోభారాణి, రామ్‌కుమార్ అభినందించారు.

కుట్లు, అల్లికలపై శిక్షణ



విద్యార్థులకు అల్లికలపై శిక్షణ ఇస్తున్న మహిళా సాధికార విభాగం కన్వీనర్ ఉషారాణి, పక్కన ప్రిన్సిపాల్ శంకర్ శర్మ తదితరులు

సూళ్లూరుపేట, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేటలోని వీఎస్ఎస్‌సీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సోమవారం విద్యార్థులకు కుట్లు, అల్లికలపై శిక్షణ తరగతులను ప్రిన్సిపాల్ ఎస్ఎల్‌బీ శంకర్ శర్మ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలకు స్వయం ఉపాధికి శిక్షణ తరగతులు ఎంతో ఉపయోగకరమన్నారు. సూళ్లూరుపేటకు చెందిన పేద మహిళ పి.సంధ్యకు కళాశాల మహిళా సాధికార విభాగం తరపున రూ.3 వేల ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో మహిళా సాధికార విభాగం కన్వీనర్ డి.ఉషారాణి, అమ్మాజి, సునీత, డాక్టర్ సల్మా, బి.అనురాధ, యామిని తదితరులు పాల్గొన్నారు.

కేశవరం, చిట్టేడు గ్రామాలకు గంగనీళ్లు

కోట, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని కేశవరం, చిట్టేడు పంచాయతీలకు తెలుగుగంగ నీటిని విడుదల చేశారు. రైతులు పుచ్చసాగు వేసుకునేందుకు కండలేరు నుంచి 5వ బ్రాంచ్ కెనాల్ ద్వారా 20 క్యూసెక్కుల గంగనీరు కావాలని కోరారు. సోమవారం ఏఈ నిరంజన్‌కుమార్ ఆధ్వర్యంలో ఓజిలి మండలం ఆరిమేని పాడు వద్ద 31వ కిలోమీటరు దగ్గర ఉన్న రెగ్యులేటర్ నుంచి రైతులు మళ్లించుకున్నారు. మంగళవారం నాటికి ఆయా గ్రామాల చెరువులకు గంగనీరు చేరుతుందని ఏఈ తెలిపారు.

పిచ్చిమొక్కల తొలగింపు

చిట్టమూరు, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): చిట్టమూరు పోలీస్‌స్టేషన్ చుట్టు పక్కల ఉన్న పిచ్చిమొక్కలను పోలీసులు తొలగించారు. గూడూరు డీఎస్పీ గీతా కుమారి సూచన మేరకు.. ఎస్ఐ చిన్న బలరామయ్య ఆధ్వర్యంలో పోలీసు సిబ్బంది స్టేషన్ చుట్టు పక్కల ఉన్న పిచ్చిమొక్కలను, చెత్తాచెదారాన్ని తొలగించి శుభ్రం చేశారు. అలాగే పోలీస్ క్వార్టర్స్, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వరకు సిమెంట్ రోడ్డుకు ఇరువైపులా చెట్లను తొలగించారు.

వాహనం ఢీకొని కూలీ మృతి



మృతి చెందిన బంగారు సారంగన్

తడ, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): గుర్తుతెలియని వాహనం ఢీకొని కూలీ మృతి చెందాడు. తమిళనాడు గుమ్మిడిపూడి తాలూకా సామిరెడ్డికండ్రిగ గ్రామానికి చెందిన బంగారు సారంగన్ (55) కూలి పనులు చేస్తూ జీవనం సాగిస్తుంటాడు. సోమవారం ఉదయం 6 గంటలకు పన్నంగాడు వద్ద కూలి పనికి బయలుదేరాడు. జాతీయ రహదారి పక్కన నడుచుకుంటూ వెళ్తుండగా గుర్తుతెలియని వాహనం ఢీకొట్టి వెళ్లిపోయింది. తీవ్రంగా గాయపడిన బంగారు సారంగన్ అక్కడిక్కడే మృతి చెందాడు. ఎస్ఐ కొండపనాయుడు ఘటనాస్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సూళ్లూరుపేట ప్రభుత్వాస్పత్రికి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.





నిండుకుండలా పునబాక చెరువు - వరిసాగు

స్వర్ణముఖిలో మెండుగా భూగర్భ జలాలు

- రైతులకు తీరుతున్న సాగునీటి సమస్య
- కూటమి ప్రభుత్వ నిర్ణయంతో అన్నదాతల్లో ఆనందం

పెళ్లకూరు, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): స్వర్ణముఖినది ఆధారంగా పంటలు సాగుచేసే రైతులు గడిచిన అయిదేళ్లలో వైసీపీ ప్రభుత్వ పెద్దల అనాలోచిత నిర్ణయాల వల్ల చివరి తడికి నీరందక పంటలు కోల్పోయేవారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వంలో ముందుగానే తెలుగుగంగ జలాలు స్వర్ణముఖినదికి విడుదల చేయడం, దానికి తోడు వర్షం పడటంతో స్వర్ణముఖినది భూగర్భ జలాలు మెండుగా పెరిగాయి. దీంతో అటు రైతులకు సాగునీరు, ఇటు ప్రజలకు తాగునీటి సమస్య పరిష్కారం కావడంతో ప్రజల్లో ఆనందం వ్యక్తమవుతోంది. టీడీపీ ఆవిర్భావానికి ముందు వర్షాభావ పరిస్థితులు తలెత్తితే మండలంలో కరవు విలయ తాడవం చేసేది. దివంగత ఎన్టీ రామారావు ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో తెలుగు గంగ ప్రాజెక్ట్‌ను తీసుకువచ్చి విస్తృత్తంగా కాలువలు తవ్వించడంతో పాటు చెన్నైకి తాగునీటి అవసరాలకు నీటిని తరలించారు. అలాగే స్వర్ణముఖినదికి సైతం నీటిని విడుదల చేయడంతో రైతులు కరవు నుంచి బయటపడేవారు. అదేవిధంగా రైతుల ప్రయోజనాల కోసం శ్రీకాళహస్తి వద్ద స్వర్ణముఖినదిలో నిర్మించిన చెక్‌డ్యామ్ నుంచి చెంబేడు కాలువకు గంగ జలాలను మళ్లించడంతో ఈ ప్రాంతమంతా సస్యశ్యామలంగా మారింది. కాలువల ద్వారా పెళ్లకూరు, చిల్లకూరు, జీలపాటూరు, చావాలి, శిరసనంబేడు, చెంబేడు, పునబాక, అర్థమాల, చింతపూడి, నెలబల్లి, పుల్లూరు తదితర చెరువులకు నేరుగా నీరందేది. దీంతో పంటల సాగుకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సాగునీటి సమస్య తప్పింది. ప్రస్తుత కూటమి ప్రభుత్వంలో ముందుగానే తెలుగుగంగ జలాలు స్వర్ణముఖినదికి విడుదల చేయడం, ఈ ఏడాది వర్షాలు కూడా బాగా కురవడంతో స్వర్ణముఖినదిలో భూగర్భ జలాలు పెరిగి సాగునీటికి కొరత ఉండదని రైతులు ఆనందపడుతున్నారు.

ప్రయాణికుల సౌకర్యం కోసమే కొత్త బస్సులు: పాశిం



బస్సులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్

గూడూరు, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గ పరిధిలో ప్రయాణికుల సౌకర్యార్థం రూ.15 కోట్లతో నూతనంగా 25 ఆర్టీసీ బస్సు సర్వీసులను ప్రారంభించడం జరిగిందని ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ అన్నారు. సోమవారం గూడూరు డిపోలో 9 కొత్త బస్సు సర్వీసులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వంలో గ్రామాలతో పాటు పలు పట్టణాలకు బస్సు సర్వీసులను నిలిపివేయడంతో ప్రయాణికులు తీవ్ర అవస్థలు పడ్డారని అన్నారు. కూటమి అధికారంలోకి రాగానే ప్రజా సంక్షేమ పథకాలతో పాటు అభివృద్ధి కార్యక్రమాలను చేపడుతోందన్నారు. గూడూరు రైల్వేస్టేషన్ నుంచి తిరుమలకు, బెంగళూరుకు బస్సులను నడిపేలా చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో ఆర్టీసీ నెల్లూరు రీజనల్ ఛైర్మన్ సురేష్‌రెడ్డి, నాయకులు నెలబల్లి భాస్కర్‌రెడ్డి, పులిమి శ్రీనివాసులు, వెంకటేశ్వర్లురాజు, మట్టం శ్రావణి, గుండాల లీలావతి, అబ్దుల్‌రహీం, కరుణాకర్‌రెడ్డి, ఆరికట్ల బాలకృష్ణమ నాయుడు, వాటంబేడు శివకుమార్, ప్రకాష్ నాయుడు, దయాకర్ తదితరులు పాల్గొన్నారు.

ఏకలవ్య గురుకులంలో ఆరో తరగతికి అడ్మిషన్లు

ఓజిలి, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): ఓజిలి మండలం వాకాటివారి కండ్రిగ వద్ద ఉన్న ఏకలవ్య మోడల్ గురుకుల పాఠశాలలో 6వ తరగతిలో చేరేందుకు అడ్మిషన్లు ప్రారంభమయ్యాయని ప్రిన్సిపాల్ పవన్‌కుమార్ సింగ్ తెలిపారు. విద్యార్థులు ఈనెల 19వ తేదీ లోగా దరఖాస్తు చేసుకోవాలని, 25న ప్రవేశ పరీక్ష ఉంటుందన్నారు.

విద్యార్థినుల అదృశ్యంపై ఫిర్యాదు

గూడూరు, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): స్థానిక రెండో పట్టణ పరిధిలోని గిరిజన బాలికల గురుకుల పాఠశాలలో చదువుతున్న ఇద్దరు విద్యార్థినులు అదృశ్యం అయ్యారని సోమవారం పాఠశాల ప్రిన్సిపాల్ వెంకటేశ్వర్లు రెండో పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. సీఐ శ్రీనివాస్ తెలిపిన వివరాల మేరకు... స్థానిక జానకిరామ్‌పేటలోని గిరిజన బాలికల గురుకుల పాఠశాలలో పదో తరగతి చదువుతున్న చందన, జయశ్రీ సోమవారం మధ్యాహ్నం నుంచి పాఠశాలలో కనిపించకుండా పోయారు. ప్రిన్సిపాల్ ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

వ్యవసాయ పరికరాలు, వాహనాల పంపిణీ

చిల్లకూరు, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తమ్మిన పట్నం, గుమ్మళ్లదిబ్బ, లింగవరం, ఏరూరు గ్రామాల్లోని రైతులకు సోమవారం అదానీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో వ్యవసాయ పరికరాలు, ట్రాక్టరు, ఈ- రిక్షాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ ప్రతినిధులు మాట్లాడుతూ రైతులు వీటిని సద్వినియోగం చేసుకుని వ్యవసాయంలో అధిక దిగుబడులను పొందడంతో పాటు వ్యవసాయ రంగాన్ని అభివృద్ధి పరచాలన్నారు. కార్యక్రమంలో జగదీష్ పటేల్, రాజేష్‌రంజన్, మృత్యుంజయ్‌రామ్, అనురాగ్‌ద్వివేది, వెంకటేష్, భాస్కర్, సరళ, రాధిక, సుబ్రహ్మణ్యం, శ్రీనివాసులు, రఫీ పాల్గొన్నారు.

పేదలకు ఇళ్ల స్థలాలు కేటాయించాలి



సచివాలయం వద్ద నిరసన తెలుపుతున్న సీపీఐ నాయకులు

గూడూరు, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం హామీ మేరకు పేదలకు వెంటనే ఇళ్ల స్థలాలను కేటాయించాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు ప్రభాకర్ అన్నారు. సోమవారం స్థానిక గాంధీనగర్‌లోని సచివాలయం వద్ద సీపీఐ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. అర్హులైన పేదలకు ఇళ్ల స్థలాలను కేటాయించాలని సచివాయ సిబ్బందికి అర్జీలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదలకు పట్టణంలో రెండు సెంట్లు, గ్రామాల్లో మూడు సెంట్లు ఇళ్ల స్థలాలను మంజూరు చేయాలన్నారు. అలాగే ఇంటి నిర్మాణానికి రూ. 5లక్షలు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో శశికుమార్, కాలేషా, నారాయణ, సునీల్, రత్నయ్య, ముని, రూప తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తిగత శుభ్రత పాటించాలి

గూడూరు, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): ప్రతిఒక్కరూ వ్యక్తిగత శుభ్రతను పాటించాలని ఎస్‌కేఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శివప్రసాద్ అన్నారు. సోమవారం కళాశాలలో జాతీయ నులిపురుగుల నివారణ దినం సందర్భంగా ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో విద్యార్థులకు నులిపురుగుల మందును పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఏఎన్ఎం సునీత, విజయ్‌మహేష్, పీరకుమార్, శ్రీధర్‌శర్మ, కోటేశ్వరరావు, నారాయణరాజు తదితరులు పాల్గొన్నారు.

నులిపురుగుల మాత్రల పంపిణీ

వాకాడు, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అంబేడ్కర్ గురుకులంలో విద్యార్థులకు ఎంపీడీవో అన్నపూర్ణరావు ఆల్‌బెండజోల్ మాత్రలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంఈవో నసీం ఆలీ, కళాశాల ప్రిన్సిపాల్ రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

చిట్టమూరు: స్థానిక జీఎం నాయుడు ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు ఎంపీడీవో మనోహర్ గౌడ్ నులి పురుగుల నిర్మూలన మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైద్యాధికారిని పద్మావతి, ఉపాధ్యాయులు గిరిబాబు, ఏఎన్ఎం సక్కుబాయి, ఆశ వర్కులు శుభాషిణీ, మస్తానమ్మ పాల్గొన్నారు.

దక్కిలి: మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లలకు సోమవారం నులిపురుగుల మాత్రలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది రాజి, అంగన్‌వాడీ సూపర్ వైజర్ పరిమళ, టీచర్ సుకన్య, ఆయా లలితమ్మ పాల్గొన్నారు.

అసత్య ప్రచారం మంచిపద్ధతి కాదు

గూడూరు, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): వైసీపీ కార్యకర్తలపై తప్పుడు కేసులు బనాయించి వేధిస్తున్నారంటూ టీడీపీ నాయకులపై అసత్య ప్రచారం చేయడం మంచిపద్ధతి కాదని ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ అన్నారు. సోమవారం ఆయన తన క్యాంపు కార్యాలయంలో మాట్లాడుతూ ఆదివారం మండలంలోని మంగళపూరులో మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి టీడీపీ నాయకులపై చేసిన వ్యాఖ్యలను ఖండించారు. వైసీపీ పాలనలోనే టీడీపీ నాయకులపై తప్పుడు కేసులు నమోదు చేసి ఇబ్బందులకు గురిచేశారన్నారు. కూటమి ప్రభుత్వం కక్షసాధింపు రాజకీయాలను ప్రోత్సహించడం లేదన్నారు. పలు గ్రామాల్లో టీడీపీ ఫ్లెక్సీలను పలుమార్లు వైసీపీ నాయకులు చించివేస్తుంటే.. అలా చేయొద్దని సూచించామే తప్ప పోలీసులను అడ్డుపెట్టుకుని తప్పుడు కేసులు బనాయించలేదన్నారు. కార్యక్రమంలో నెలబల్లి భాస్కర్‌రెడ్డి, పులిమి శ్రీనివాసులు, వెంకటేశ్వర్లురాజు, అబ్దుల్‌రహీం, వెంకటేశ్వర్లురెడ్డి, రవీంద్రరెడ్డి, సిద్దయ్య నాయుడు, వాటంబేడు శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

ప్రధాని ప్రసంగాన్ని వీక్షించిన విద్యార్థులు

నాయుడుపేట, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): ప్రధాని నరేంద్ర మోదీ పరీక్ష పే చర్చ ప్రసంగాన్ని పట్టణంలోని లోతువానిగుంట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం వీక్షించారు. విద్యార్థులు తమ ఆహార అలవాట్లలో కూరగాయాలకు ప్రాధాన్య ఇచ్చి.. పిజ్జా, బర్గర్, మైదా వంటి ఆహార ఉత్పత్తులకు దూరంగా ఉండాలని, ప్రతి రోజూ సూర్యరశ్మితో అనుబంధం పెంచుకోవాలని ప్రధాని మోదీ సూచించారు.

గర్భిణులకు పౌష్టికాహారం అందజేత



గర్భిణులకు పౌష్టికాహారం అందజేస్తున్న డాక్టర్ షరీనా

గూడూరు అర్బన్, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఏరియా ఆస్పత్రిలో సోమవారం జనవిజ్ఞానవేదిక ఆధ్వర్యంలో సెల్వం దాతృత్వంతో గర్భిణులకు పౌష్టికాహారాన్ని అందజేశారు. కార్యక్రమంలో ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ షరీనా, నాగరాజు, ప్రభాకర్, ఇబ్రహీం, ఆనంద్, సుబ్బారావు, శ్రీనివాసాచారి పాల్గొన్నారు.

ఇస్కాన్ మందిరంలో పూజలు

గూడూరు, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): స్థానిక సొసైటీ సెంటర్ లోని ఇస్కాన్ మందిరంలో సోమవారం త్రయోదశి వేడుకలు నిర్వహించారు. కృష్ణ, బలరాములకు ప్రత్యేక పూజలు, అభిషేకాలు జరిపారు. సంకీర్తనలు, భజనలు చేశారు. కార్యక్రమంలో బలభద్ర గోపాల్‌దాస్, ఇస్కాన్ ప్రతి నిధులు తదితరులు పాల్గొన్నారు.

సీఎం చంద్రబాబును కలిసిన టీడీపీ నేతలు



చంద్రబాబుతో సతీష్‌రెడ్డి, కృష్ణారెడ్డి, అశోక్‌రెడ్డి

నాయుడుపేట, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును సోమవారం అమరావతిలో తిరుపతి పార్లమెంటు టీడీపీ ప్రధాన కార్యదర్శి వేనాటి సతీష్‌రెడ్డి, నాయకులు కందల కృష్ణారెడ్డి, కామిరెడ్డి అశోక్‌రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. తిరుపతి పార్లమెంటు, సూళ్లూరుపేట నియోజకవర్గాల్లో అభివృద్ధి పనుల గురించి చర్చించారు.

రూ.కోటి వ్యయంతో సిమెంటు రోడ్ల నిర్మాణం

కోట, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): కోట పట్టణంలో రూ.కోటి వ్యయంతో రెండు సిమెంటు రోడ్ల నిర్మాణం చేపట్టనున్నట్లు టీడీపీ నాయకులు తెలిపారు. పట్టణంలోని ఆర్టీసీ సెంటర్, క్రాస్ రోడ్డుకు అనుబంధంగా అంబేడ్కర్ గురుకులం మీదుగా కోట, వెంకన్నపాళెం రోడ్డు వరకు, అలాగే కోట క్రాస్‌రోడ్డుకు అనుబంధంగా గోపాల్‌రెడ్డి విగ్రహం సమీపంలో రెడ్డి కల్యాణ మండపం మీదుగా సామాజిక ఆరోగ్య కేంద్రం వరకు సిమెంటు రోడ్ల నిర్మాణానికి ఎమ్మెల్యే సునీల్ కుమార్ నిధులు మంజూరు చేయడం జరిగిందన్నారు. రోడ్లు నిర్మించనున్న ప్రాంతాలను టీడీపీ మైనార్టీసెల్ జిల్లా అధ్యక్షుడు షేక్ జలీల్ అహ్మద్, ఎంపీటీసీలు షంషుద్దీన్, సురేష్ సోమవారం పరిశీలించారు.

ఇక్కడ ఏం చేసినా నాకు చెప్పాల్సిందే!
ఇష్టం లేకపోతే వెళ్లిపోండి
ఎంపీడీవో కార్యాలయ సిబ్బందిపై ఎంపీపీ చిందులు

దక్కిలి, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): దక్కిలి ఎంపీడీవో కార్యాలయ సిబ్బందిపై ఎంపీపీ గోను రాజశేఖర్ విరుచుపడ్డారు. కార్యాలయంలో ఏ పని చేయాలన్నా తనకు చెప్పి తీరాల్సిందేనని స్పష్టం చేశారు. సోమవారం ఆయన తన కార్యాలయానికి వచ్చీ రాగానే ఎంపీడీవో గుణశేఖర్‌రెడ్డి, పంచాయితీరాజ్ ఏఈ చంద్రశేఖర్, కార్యాలయ సూపరింటిండెంట్ అనురాధలను తన గదిలోకి పిలిపించుకొని తనకు మాటమాత్రంగా కూడా చెప్పకుండా కార్యాలయంలో విద్యుత్ వైరింగ్‌కు డబ్బులు ఎలా ఖర్చు పెడతారని ప్రశ్నించారు. వైర్లు ప్రమాదకరంగా వేలాడుతుంటే వాటిని సరిచేడంలో తప్పేమేముందని ఎంపీడీవో చెప్పినా వినిపించుకోలేదు. తన మాట కార్యాలయంలో ఎవ్వరూ లెక్కచేయడం లేదని, ఇక్కడ పనిచేయడం ఇష్టం లేకపోతే వెళ్లిపోండి అంటూ గద్దించారు. దీంతో ఎంపీడీవో గుణశేఖర్ జోక్యం చేసుకొని తాను నిజాయితీగా విధులు నిర్వహిస్తానని, కార్యాలయం బాగుండాలన్న ఉద్దేశంతో చిన్నచిన్న మరమ్మతులతో పాటు, ప్రమాదకరంగా మారిన చెట్ల కొమ్మలను తొలిగించామని సమాధానం ఇచ్చారు. ఇది రుచించని ఎంపీపీ ఇక్కడ ఏం చేయాలన్నా తనకు చెప్పే చేయాలని హుకూం జారీ చేశారు. పంచాయతీ రాజ్ ఏఈ చంద్రశేఖర్, కార్యాలయ సూపరింటెండెంట్ అనురాధపై మండిపడ్డారు. పెద్దగా అరుపులు వినిపించడంతో సిబ్బంది విస్తుపోయి చూస్తుండిపోయారు.

విశిష్ట గుర్తింపు సంఖ్యకు నమోదు చేసుకోండి

సూళ్లూరుపేట, వాకాడు, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా ప్రవేశపెట్టిన విశిష్ట గుర్తింపు సంఖ్యకు రైతులందరూ నమోదు చేసుకోవాలని సూళ్లూరుపేట సహాయ వ్యవసాయ సంచాలకురాలు అనిత, వాకాడు ఏవో దీప, కోట ఏవో నిరంజన్‌కుమార్ కోరారు. సోమవారం సూళ్లూరుపేట వ్యవసాయ కార్యాలయంలో ఈ ఫార్మర్ రిజిష్టర్ నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా అనిత మాట్లాడుతూ ఈ నెల 28 వరకు రైతు భరోసా కేంద్రాల్లో రైతులు తమ ఆధార్, పట్టాదారు పాసు పుస్తకాలు తీసుకెళ్లి నమోదు చేసుకోవచ్చునన్నారు. అనంతరం రైతులకు విశిష్ట గుర్తింపు సంఖ్య వస్తుందని, ఈ సంఖ్య ఉంటేనే ప్రభుత్వం అందించే పంటల బీమా, పీఎం కిసాన్, అన్నదాత సుఖీభవ, పంట నష్టపరిహారం వంటివి అందుతాయన్నారు. కార్యక్రమంలో ఏవో కవిత తదితరులు పాల్గొన్నారు.

కోట నుంచి గూడూరు రైల్వేస్టేషన్‌కు బస్సు నడపండి



ఆర్ఎంకు వినతిపత్రం అందజేస్తున్న బీజేపీ నాయకులు

కోట, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): కోట నుంచి గూడూరు రైల్వే స్టేషన్‌కు ఉదయం 6 గంటలకు బస్సు చేరేలా చర్యలు తీసుకోవాలని నెల్లూరు ఆర్టీసీ రీజనల్ ఛైర్మన్ సన్నపురెడ్డి సురేష్‌రెడ్డికి సోమవారం బీజేపీ నాయకులు వినతిపత్రం అందజేశారు. కోట, వాకాడు, చిట్టమూరు మండ లాల నుంచి ప్రజలు నిత్యం నెల్లూరు, తిరుపతి, చెన్నై నగరాలకు ప్రజలు వివిధ పనులపై వెళ్తుంటారని, వారంతా తెల్లవారుజామున బయలుదేరి ఉదయం 6 గంటలకు గూడూరు రైల్వేస్టేషన్‌కు చేరుకొని వెళ్లాల్సి ఉంటుందన్నారు. ఆ సమయంలో ఆర్టీసీ బస్సులు లేక ప్రైవేట్ వాహనాల్లో వెళ్లాల్సి వస్తోందన్నారు. అలాగే వాకాడు నుంచి తెల్లవారుజామున బయలుదేరి 5.30 గంటలకు గూడూరు రైల్వేస్టేషన్‌కు చేరేలా ఒక బస్సు నడపాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పనబాక కోటేశ్వరరావు, పలువురు నాయకులు పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికులకు వేతనాలు ఇవ్వండి



సబ్‌కలెక్టర్ రాఘవేంద్రమీనాకు సమస్యలు వివరిస్తున్న కార్మికులు

గూడూరు, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఏరియా ఆస్పత్రిలో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులకు వేతనాలు అందజేయాలని సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి శశికుమార్ అన్నారు. సోమవారం సబ్‌కలెక్టర్ రాఘవేంద్ర మీనాకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్థానిక ఏరియా ఆస్పత్రిలో పనిచేస్తున్న 20మంది పారిశుధ్య కార్మికులకు ఆరు నెలలుగా వేతనాలు ఇవ్వకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు స్పందించి వెంటనే వేతనాలు అందించేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

రొయ్యల మేతపై అవగాహన

కోట, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): రొయ్యల మేతకు గుర్తింపు పొందిన ఉత్పత్తులనే వాడాలని బీస్ రొయ్యల మేత ఉత్పత్తుల సంస్థ వైస్ ఛైర్మన్ చెర్రి కురియన్ అన్నారు. కోటలోని రెడ్డి కల్యాణ మండపంలో సోమవారం కోట, వాకాడు, చిట్టమూరు, చిల్లకూరు, గూడూరు మండలాల ఆక్వా రైతుల సమావేశం జరిగింది. ప్రస్తుత సీజన్‌లో ఆబీస్ రొయ్యల మేత వాడటం వల్ల ఉపయోగాలు, దిగుబడులపై రైతులకు అవగాహన కల్పించారు.

చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించాలి

గూడూరు, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ అన్నారు. సోమవారం స్థానిక నారాయణ ఇంజనీరింగ్ కళాశాలలో క్రీడా పోటీలను ప్రారంభించారు. కార్యక్రమంలో విజయభాస్కర్‌రెడ్డి, రవిప్రసాద్, దత్తాత్రేయ తదితరులు పాల్గొన్నారు.